జనం రిపోర్టర్ తెలుగు దినపత్రిక

జన శ్రేయస్సే మా బాధ్యత


విలేకరులు కావలెను

ప్రజా శ్రేయస్సే ధ్యేయంగా నడపబడుతున్న జనం రిపోర్టర్ తెలుగు దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్ర మరియు తెలంగాణ రాష్ట్రాల్లో జిల్లాల వారిగా రిపోర్టర్లు కావలెను. అంకిత భావంతో పనిచేసేందుకు ఆసక్తి గలవారు

సంప్రదించండి: 9398 15 6948

సంపుటి : 01 సంచిక : 260, ఎడిటర్: మార్పు సాయి కుమార్ పేజిలు : 08, వెల రూ. 5రూ/ శనివారం -18 - జనవరి - 2025

Published From, Guntur : Circulatedat,VishakaPatanam,Vijayanagaram, East Godavari, West Godavari, Krishna,Kurnool ,Srikakulam, Prakasam, Nellore, Chittoor,, Kadapa, Anantapuram, Hyderabad



## ఇమ్రాన్ ఖాన్‌కు 14 ఏళ్ల జైలుశిక్ష

అల్ ఖాదిర్ కేసులో

ఇమ్రాన్, ఆయన భార్య బుష్రాకు శిక్ష

బుష్రాకు ఏడేళ్ల జైలు శిక్ష

ఇమ్రాన్ పై ఇప్పటి వరకు 200కు పైగా కేసులు

2లో



## దేశం గర్వించేలా మరింత కష్టపడతా: మనూ భాకర్

- ఈ ప్రతిష్ఠాత్మకమైన పురస్కారం అందుకోవడం ఎంతో గౌరవంగా ఉంది
- మనూ భాకర్ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ఓ పోస్టు
- మరిన్ని విజయాల కోసం ప్రయత్నించడానికి నాకు స్ఫూర్తినిస్తుంది

ఢిల్లీ: మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న అవార్డు అందుకోవడంపై ఒలింపిక్ మెడలిస్ట్, భారత షూటర్ మనూ భాకర్ మిగతా..2లో

## ఇద్దరు పిల్లలుంటేనే పోటీకి అర్హత కల్పిస్తూ కొత్త చట్టం



- కనీసం ఇద్దరు పిల్లలుంటేనే స్థానిక ఎన్నికల్లో పోటీకి అర్హత కల్పిస్తూ చట్టం తెస్తామన్న సీఎం
- జనాభా పెంచేందుకు ప్రోత్సాహకాలు ఇస్తామని వెల్లడి
- టోటల్ ఫెర్టిలిటీ రేట్ అంచనాలు ప్రమాదకరంగా ఉన్నాయన్న చంద్రబాబు

అమరావతి: కనీసం ఇద్దరు పిల్లలు ఉంటేనే స్థానిక సంస్థల ఎన్నికల్లో మిగతా..2లో



## నేడు ఏపీకి వస్తున్న అమిత్ షా

అమిత్ షా, చంద్రబాబు సమావేశంలో కీలక అంశాలు చర్చకు వస్తాయి: పురందేశ్వరి

నేడు సాయంత్రం చంద్రబాబు ఇంటికి వెళ్లనున్న కేంద్ర హోం మంత్రి

ఇద్దరి మధ్య రాజకీయ అంశాలు కూడా చర్చకు వచ్చే అవకాశం ఉందన్న పురందేశ్వరి

# పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

- వచ్చే ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో పలు పథకాలకు శ్రీకారం
- సీఎం చంద్రబాబు అధ్యక్షతన నేడు ఏపీ క్యాబినెట్ సమావేశం
- సమావేశం అనంతరం రాజకీయ అంశాలపై చర్చ
- వివిధ పథకాల అమలుకు సిద్ధం కావాలన్న చంద్రబాబు




అమరావతి: వచ్చే ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో పలు పథకాలకు శ్రీకారం చుడుతున్నామని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. ఇవాళ చంద్రబాబు అధ్యక్షతన ఏపీ క్యాబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశ ముగిసిన అనంతరం రాజకీయ అంశాలపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, మత్స్యకార భరోసా పథకాల అమలుకు సిద్ధం కావాలని దిశానిర్దేశం చేశారు.

## ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం

రాష్ట్ర ప్రజలకు ఇక అన్నీ మంచి రోజుల

వైజాగ్ స్టీల్ ప్లాంట్ కు రూ.11,440 కోట్ల ఉద్దీపన ప్యాకేజీ ఇస్తున్నట్టు కేంద్రం అధికారిక ప్రకటన చేయడంపై ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజలకు ఇకపై అన్నీ మంచి రోజులేనని చంద్రబాబు ఆనందం వెలిబుచ్చారు. ఉక్కు పరిశ్రమకు కేంద్రం ప్యాకేజీ ప్రకటించడం చారిత్రాత్మక నిర్ణయం అని కొనియాడారు. ఏపీ ప్రజలు గర్వించదగిన విషయం అని వ్యాఖ్యానించారు. విశాఖ ఉక్కు పరిశ్రమ పట్ల సానుకూలంగా స్పందించి ప్యాకేజీ ప్రకటించినందుకు ప్రధాని నరేంద్ర మోదీకి కృతజ్ఞతలు తెలియచేస్తున్నానని... కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానని చంద్రబాబు పేర్కొన్నారు. విశాఖ ఉక్కు అంటే కేవలం పరిశ్రమ మాత్రమే కాదని, ఆంధ్రుల హృదయాల్లో ప్రత్యేక స్థానం ఉన్న అంశం అని తెలిపారు. విశాఖ ఉక్కు... ఆంధ్రుల హక్కు అని స్పష్టం చేశారు.




## రష్యా తరుపున యుద్ధంలో పోరాడి 12 మంది భారతీయులు మృతి.. 16 మంది మిస్సింగ్

యుద్ధంలో మరణించిన భారతీయుల మృతదేహాలను, గాయపడిన వారిని దేశానికి రప్పించేందుకు ప్రయత్నిస్తున్నట్లు వివరించింది

ప్రస్తుతం రష్యా ఆర్మీలో 18 మంది భారతీయులు మిగిలి ఉన్నట్లు చెప్పారు

## ఈ నెల 31 నుంచి పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు

ఈసారి రెండు విడతలుగా పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు

- జనవరి 31 నుంచి ఫిబ్రవరి 13 వరకు తొలి విడత సమావేశాలు
- ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్
- మార్చి 10 నుంచి ఏప్రిల్ 4 వరకు రెండో విడత సమావేశాలు



ఢిల్లీ: ఈ ఏడాది కేంద్ర బడ్జెట్ సమావేశాలు జనవరి 31 నుంచి నిర్వహించనున్నారు. పార్లమెంటు బడ్జెట్ సమావేశాల ప్రారంభం రోజునే ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగించనున్నారు. బడ్జెట్ సమావేశాలు రెండు విడతలుగా జరగనున్నాయి. జనవరి 31 నుంచి ఫిబ్రవరి 13 వరకు తొలి విడత సమావేశాలు నిర్వహించనున్నారు. కేంద్ర ప్రభుత్వం ఫిబ్రవరి 1న 2025-26 వార్షిక బడ్జెట్ ను పార్లమెంటులో ప్రవేశపెట్టనుంది. ఇక, మార్చి 10 నుంచి ఏప్రిల్ 4 వరకు రెండో విడత సమావేశాలు జరగనున్నాయి.

## విశాఖ ఉక్కు పరిశ్రమకు రూ.11,440 కోట్ల ప్యాకేజీ

విశాఖ స్టీల్ ప్లాంట్‌కు కేంద్రం భారీ ప్యాకేజీ..

అధికారికంగా ప్రకటించిన కేంద్రమంత్రి

అధికారికంగా ప్రకటించిన కేంద్రం ఇది చారిత్రాత్మక నిర్ణయం అంటూ చంద్రబాబు హర్షం మోదీకి కృతజ్ఞతలు తెలిపిన వైనం



అమరావతి: ఏపీకి కేంద్రం గుడ్‌న్యూస్ చెప్పింది. విశాఖ ఉక్కు పరిశ్రమకు భారీ ప్యాకేజీ ప్రకటించింది. రూ.11,440 కోట్లతో కేంద్రం ప్యాకేజీ ఇవ్వనున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ అధికారిక ప్రకటనలో తెలిపారు. విశాఖ ఉక్కు ప్యాకేజీకి కేంద్రం ఆమోదం తెలిపినట్లు కేంద్రమంత్రి వెల్లడించారు. మిగతా..2లో



## ఆగి ఉన్న బస్సును ఢీకొట్టిన మినీ వ్యాన్.. 9 మంది మృతి

ముంబై: ఆగి ఉన్న బస్సును మినీ వ్యాన్ ఢీకొట్టింది. ఆ వాహనంలోని 9 మంది ఈ ప్రమాదంలో మరణించారు. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పోస్ట్‌మార్టం కోసం మృతదేహాలను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## మమ్మల్ని గర్వపడేలా చేశావు.. వైఎస్ జగన్ భావోద్వేగ ట్వీట్



చిన్న కుమార్తె వర్ష స్నాతకోత్సవం సందర్భంగా వైఎస్ జగన్ భావోద్వేగ ట్వీట్

అమరావతి: ప్రపంచ ప్రతిష్టాత్మక కింగ్స్ కాలేజ్ నుంచి మాస్టర్ ఆఫ్ సైన్స్ (ఫైనాన్స్) పట్టా పుచ్చుకున్న సందర్భంగా కుమార్తె వర్షారెడ్డికి వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభినందనలు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు. 'వర్షమ్మకు అభినందనలు. అత్యంత ప్రతిష్టాత్మకమైన కింగ్స్ కాలేజ్ లండన్‌లో చదివి పట్టభద్రురాలవడంతోపాటు, డిస్టింక్షన్‌లో ఉత్తీర్ణత సాధించి మాకు ఎంతో గర్వకారణమయ్యావు. ఆ దేవుడి ఆశీస్సులు నీపై ఎల్లవేళలా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.' అని స్పందించారు. ఈ సందర్భంగా తన కుటుంబంతో దిగిన ఫోటోను కూడా పోస్ట్ చేశారు.



## విశాఖపట్నం ఉక్కు కర్మాగారానికి ఆంధ్రప్రదేశ్ ప్రజల హృదయాల్లో ప్రత్యేక స్థానం ఉంది: మోదీ

విశాఖ ఉక్కు పరిశ్రమపై కేంద్రం కరుణ

రూ.11.440 కోట్లతో భారీ ప్యాకేజి ప్రకటన

ప్రధాని మోదీకి, కేంద్రానికి ధన్యవాదాలు తెలుపుతున్న కూటమి నేతలు

ఉక్కు రంగానికి ఉన్న ప్రాముఖ్యతను అర్థం చేసుకున్నామన్న మోదీ

ఢిల్లీ: విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ అంటూ జరుగుతున్న ప్రచారానికి తెర దించుతూ కేంద్ర ప్రభుత్వం రూ.11,440 కోట్లతో భారీ ప్యాకేజి ప్రకటించిన సంగతి తెలిసిందే. దాంతో కూటమి నేతలు ప్రధాని నరేంద్ర మోదీకి, కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతున్నారు. దీనిపై ప్రధాని మోదీ స్పందించారు. విశాఖపట్నం ఉక్కు కర్మాగారానికి ఏపీ ప్రజల హృదయాల్లో ప్రత్యేక స్థానం ఉందని తెలిపారు. నిన్నటి కేంద్ర క్యాబినెట్ సమావేశంలో, విశాఖ ఉక్కు పరిశ్రమకు రూ.10 వేల కోట్లకు పైగా పెట్టుబడిని మద్దతుగా అందించాలని నిర్ణయించామని మోదీ వెల్లడించారు. ఆత్మ నిర్భర భారత్ ను సాధించడంలో ఉక్కు రంగానికి ఉన్న ప్రాముఖ్యతను అర్థం చేసుకుని ఈ చర్య చేపట్టామని వివరించారు. ఈ మేరకు ప్రధాని మోదీ ట్వీట్ చేశారు.

# స్కిల్ యూనివర్సిటీలో భాగస్వామ్యం అయ్యేందుకు సింగపూర్ అంగీకారం

## సింగపూర్‌లో సీఎం రేవంత్ కీలక ఒప్పందం..

వేల సంఖ్యలో ఉద్యోగాలకు అవకాశం..!

- భాగస్వామ్యం కోసం ముందుకొచ్చిన సింగపూర్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్
- సీఎం సమక్షంలో ఒప్పందంపై సంతకాలు




సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తోన్న స్కిల్ యూనివర్శిటీలో అడ్మిషన్లు షురూ అయ్యాయి. క్లాసులు నిర్వహించేందుకు కూడా శరవేగంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. అనేక రకాల నైపుణ్యం కలిగిన కోర్సులు అందుబాటులోకి రాబోతున్నాయి. ఈ నేపథ్యంలోనే సింగపూర్ ప్రభుత్వ ఆధీనంలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఐటిఇ) సంస్థతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎంఓయు కుదుర్చుకుంది.

హైదరాబాద్: సింగపూర్‌తో తెలంగాణ ప్రభుత్వం కీలక ఒప్పందం కుదుర్చుకుంది. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో భాగస్వామ్యం అయ్యేందుకు సింగపూర్‌కు చెందిన ఇన్ స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఐటీఈ) ముందుకొచ్చింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు సమక్షంలో సింగపూర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ అధికారులు ఒప్పందాలపై సంతకాలు చేశారు. ఐటీఈ పరిశీలన అనంతరం జరిగిన చర్చలు, సంప్రదింపుల మేరకు తెలంగాణలో స్కిల్స్ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో భాగస్వామ్యం కావడానికి సంబంధించి సీఎం సమక్షంలో ఐటీఈ అధికారులు, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ వైస్ ఛాన్స్?లర్ వీఎల్ వీఎస్ఎస్ సుబ్బారావు ఒప్పందాలపై సంతకాలు చేశారు. ఇదిలా ఉండగా, సింగపూర్ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి బృందం సింగపూర్ ఐటీఈలో సాంకేతిక నైపుణ్యం అభివృద్ధి సహా 20కి పైగా విభిన్న డొమైన్‌ల పనితీరును పరిశీలించింది. ఆయా రంగాలలో పనిచేస్తున్న నిపుణులు, సిబ్బందితో ముఖ్యమంత్రి మాట్లాడారు. విద్యార్థులు, యువతకు నైపుణ్య శిక్షణనిచ్చి ఉద్యోగ సంసిద్ధులుగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కంకణం కట్టుకుంది. ఇందులో భాగంగా యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ సింగపూర్ మిగతా..2లో

## రష్యా తరుపున యుద్ధంలో పోరాడి 12 మంది భారతీయులు మృతి.. 16 మంది మిస్సింగ్

న్యూఢిల్లీ: ఉక్రెయిన్‌పై యుద్ధంలో రష్యా తరుపున పోరాడిన భారతీయుల్లో 12 మంది మరణించారు. మరో 16 మంది ఆచూకీ తెలియడం లేదు. విదేశాంగ మంత్రిత్వ శాఖ ఈ విషయాన్ని నిర్ధారించింది. యుద్ధంలో మరణించిన భారతీయుల మృతదేహాలను, గాయపడిన వారిని దేశానికి రప్పించేందుకు ప్రయత్నిస్తున్నట్లు వివరించింది. ఉక్రెయిన్‌తో యుద్ధంలో రష్యా తరుపున ఫైట్ చేసిన కేరళకు చెందిన బినిల్ బాబు మరణించాడు. గాయపడిన మరో భారతీయుడు జైన్ టికె, మాస్కోలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాగా, తాజా మరణాల నేపథ్యంలో ఉక్రెయిన్ యుద్ధంలో రష్యా తరుపున పోరాడుతున్న భారతీయులపై విదేశాంగ మంత్రిత్వ శాఖ స్పందించింది. విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మీడియాతో మాట్లాడారు. ఇప్పటి వరకు 126 మంది భారత పౌరులు రష్యా సైన్యంలో పని చేశారని తెలిపారు. 96 మందిని రష్యా ఆర్మీ నుంచి డిశ్చార్జ్ చేయడంతో వారు దేశానికి తిరిగివచ్చినట్లు చెప్పారు. మరోవైపు రష్యా సైన్యంలో చేరిన వారిలో 12 మంది భారతీయ పౌరులు మరణించారని రణధీర్ జైస్వాల్ తెలిపారు. ప్రస్తుతం రష్యా ఆర్మీలో 18 మంది భారతీయులు మిగిలి ఉన్నట్లు చెప్పారు. అయితే వీరిలో 16 మంది ఆచూకీ తెలియడం లేదని అన్నారు. వారు తప్పిపోయినట్లుగా రష్యా పేర్కొన్నదని వివరించారు. మిగిలిన భారతీయులను రష్యా ఆర్మీ నుంచి డిశ్చార్జ్ చేసి త్వరగా స్వదేశానికి పంపాలని ఆ దేశాన్ని భారత్ కోరిందన్నారు.

## ఇమ్రాన్ ఖాన్‌కు 14 ఏళ్ల జైలుశిక్ష

ఇస్లామాబాద్: అల్ ఖాదిర్ ట్రస్టు భూమి అవినీతి కేసులో పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ , ఆయన భార్య బుష్రా బీబీలు దోషులుగా తేలారు. ఆ ఇద్దరికీ కోర్టు జైలుశిక్ష విధించింది. ఇమ్రాన్ ఖాన్‌కు 14 ఏళ్లు, బుష్రా బీబీకి ఏడేళ్ల జైలుశిక్ష ఖరారైంది. అల్ ఖాదిర్ ట్రస్టులో సుమారు 190 మిలియన్ పౌండ్ల అవినీతి చోటుచేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అడియాలా జైలులో ఏర్పాటు చేసిన కోర్టురూంలో.. జడ్జి నాసిర్ జావెద్ రాణా తీర్పును వెలువరించారు. ఇమ్రాన్, బుష్రాలపై ఫైన్ కూడా వేసింది కోర్టు. ఇమ్రాన్‌కు పది లక్షలు, బుష్రాకు అయిదు లక్షల జరిమానా విధించారు. ఒకవేళ ఆ జరిమానా కట్టకుంటే, మరో ఆర్నెళ్ల పాటు అదనంగా జైలుశిక్ష అనుభవించాల్సి ఉంటుంది. 2024, ఫిబ్రవరి 27వ తేదీన ఈ కేసును ఫైల్ చేశారు. యూకే నుంచి వచ్చిన రూ.50 బిలియన్లను చట్ట పరం చేసినందుకు ఇమ్రాన్‌తో పాటు బుష్రా.. ఖరీదైన భూములను బహరియా టౌన్ లిమిటెడ్ సంస్థ నుంచి లంచంగా తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అయితే ఈ కేసులో గత ఏడాది డిసెంబర్ 23వ తేదీన ఇస్లామాబాద్ అకౌంటబులిటీ కోర్టు తీర్పు ఇవ్వాల్సి ఉంది. కానీ పలు మార్లు ఆ తీర్పు వాయిదా పడింది. 2023లో ఇమ్రాన్‌పై అనేక లీగల్ కేసులు ఫైల్ చేశారు. అవన్నీ రాజకీయ కక్షతో నమోదు చేసినట్లు ఇమ్రాన్ ఆరోపించారు. తోషాకానా, ఇద్దత్ కేసుల్లో ఇమ్రాన్ గత ఏడాది నిర్దోషిగా తేలాడు. కానీ కొత్తగా ఆయనపై తోషాకానా-2 కేసు బుక్కైంది.

## అమిత్ షా, చంద్రబాబు సమావేశంలో కీలక అంశాలు చర్చకు వస్తాయి

అమరావతి: కేంద్ర హోం మంత్రి అమిత్ షా నేడు ఏపీ పర్యటనకు రాబోతున్నారు. రేపు సాయంత్రం ఉండవల్లిలోని చంద్రబాబు నివాసానికి ఆయన వెళతారు. వీరిద్దరూ పలు కీలక అంశాలపై చర్చించనున్నారు. అనంతరం చంద్రబాబు నివసంలోనే అమిత్ షా భోజనం చేస్తారు. రేపు రాత్రికి విజయవాడ నొవోటెల్ హోటల్ లో ఆయన బస చేస్తారు. ఎల్లుండి గన్నవరం నియోజకవర్గం కొండపావులూరులో జరిగే ఎన్డీఆర్ఎఫ్ 20వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకల్లో పాల్గొంటారు. చంద్రబాబుతో అమిత్ షా భేటీపై ఏపీ బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి స్పందించారు. ఇద్దరి మధ్య ముఖ్యమైన అంశాలు చర్చకు వస్తాయని తెలిపారు. రాజకీయ అంశాలు సైతం చర్చకు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. వాజ్ పేయి హయాంలో వైజాగ్ స్టీల్ ప్లాంట్ కు నిధులు విడుదల చేశామని... ఇప్పుడు కూడా విడుదల చేశామని చెప్పారు. స్టీల్ ప్లాంట్ కు ప్యాకేజీ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని తామే అడిగామని తెలిపారు. వైజాగ్ స్టీల్ కు కచ్చితంగా కేప్టివ్ మైన్స్ కేటాయిస్తారని ధీమా వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్టుకు కూడా కేంద్రం నిధులు ఇస్తోందని చెప్పారు. రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఉండటం వల్లే ఇదంతా సాధ్యమవుతోందని అన్నారు.

## ఇద్దరు పిల్లలుంటేనే పోటీకి అర్హత కల్పిస్తూ కొత్త చట్టం

అమరావతి: కనీసం ఇద్దరు పిల్లలు ఉంటేనే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి అర్హత కల్పిస్తూ చట్టం తెస్తామంటూ ఏపీ సీఎం చంద్రబాబు కీలక ప్రకటన చేశారు. ఇకపై ఏ పథకం అమలు చేయాలన్నా కుటుంబ పరిమాణాన్ని ప్రామాణికంగా తీసుకుంటామని చెప్పారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో జనాభాను పెంచేందుకు ప్రోత్సాహకాలు ఇస్తామని ప్రకటించారు. జనాభాను ఒకప్పుడు భారం అనే వాళ్లమని, కానీ ఇప్పుడది ఆస్తి వంటిదని చంద్రబాబు పేర్కొన్నారు. ఇదివరకు జనాభా నియంత్రణకు ప్రోత్సాహకాలు ఇచ్చేవాళ్లమన్నారు. ఇద్దరి కంటే ఎక్కువ మంది పిల్లలు ఉంటే ఎన్నికల్లో పోటీకి అనర్హులను చేస్తూ గతంలో చట్టం తెచ్చామని, అది అప్పటి పరిస్థితి అన్నారు. కానీ ఇప్పుడు జనాభా కావాలన్నారు. ఇప్పుడు కనీసం ఇద్దరు పిల్లలు ఉంటేనే పోటీకి అర్హత కల్పిస్తామని తెలిపారు. ఈ క్రమంలో ఇద్దరి కంటే ఎక్కువ మంది పిల్లలుంటే ఎన్నికల్లో పోటీకి అనర్హులను చేస్తూ తెచ్చిన చట్టానికి ప్రభుత్వం సవరణ చేయనుంది. 2026 లో రాష్ట్రంలో ఒక జంటకు సగటున 1.51 మంది జన్మిస్తే (టోటల్ ఫెర్టిలిటీ రేట్ - టీఎఫ్ఆర్) .. 2051 నాటికి అది 1.07 తగ్గిపోతుందని అంచనాలు చెబుతున్నాయని, ఇది ప్రమాదకరమన్నారు. ఒక జంటకు సగటున 2.1 మంది పిల్లలు జన్మిస్తేనే జనాభా సక్రమ నిర్వహణ సాధ్యపడుతుందని సీఎం పేర్కొన్నారు.

## ఆగి ఉన్న బస్సును ఢీ కొట్టిన మినీ వ్యాన్..

మహారాష్ట్రలోని పూణే జిల్లాలో ఈ సంఘటన జరిగింది. శుక్రవారం ఉదయం పది గంటల సమయంలో పూణే-నాసిక్ హైవేపై నారాయణగావ్ వైపు వెళ్తున్న మినీ వ్యాన్‌ను టెంపో ఢీకొట్టింది. దీంతో మినీ వ్యాన్ అదుపుతప్పింది. రోడ్డు పక్కన ఆగి ఉన్న ఖాళీ బస్సును అది బలంగా ఢీకొట్టింది. కాగా, ఈ ప్రమాదం గురించి తెలుసుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మినీ వ్యాన్‌లో ప్రయాణించిన 9 మంది ఈ ప్రమాదంలో మరణించినట్లు తెలిపారు. మృతులను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. పోస్ట్‌మార్టం కోసం మృతదేహాలను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు వివరించారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి వెల్లడించారు.

## దేశం గర్వించేలా మరింత కష్టపడతా: మనూ భాకర్

ఢిల్లీ: మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న అవార్డు అందుకోవడంపై ఒలింపిక్ మెడలిస్ట్, భారత షూటర్ మనూ భాకర్ స్పందించారు. ఈ ప్రతిష్ఠాత్మకమైన పురస్కారం అందుకోవడం ఎంతో గౌరవంగా ఉందన్నారు. ఈ గౌరవం దేశం గర్వించేలా మరింత కష్టపడి పనిచేయడానికి స్ఫూర్తిని ఇస్తుందన్నారు. ఈ మేరకు మనూ భాకర్ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ఓ పోస్టు చేశారు. "గౌరవనీయులైన రాష్ట్రపతి నుంచి ప్రతిష్ఠాత్మకమైన మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న అవార్డును అందుకున్నందుకు నేను ఎంతో గౌరవంగా భావిస్తున్నాను. ఈ గుర్తింపు నా దేశం గర్వపడేలా మరింత కష్టపడి పనిచేయడానికి, మరిన్ని విజయాల కోసం ప్రయత్నించడానికి నాకు స్ఫూర్తినిస్తుంది. నా ప్రయాణంలో నాకు మద్దతుగా, మార్గనిర్దేశం చేసిన మరియు ప్రోత్సహించిన ప్రతి ఒక్కరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను" అని మనూ భాకర్ ట్వీట్ చేశారు.

## స్కిల్ యూనివర్సిటీలో భాగస్వామ్యం అయ్యేందుకు సింగపూర్ అంగీకారం

మొదటి పేజి తరువాయి

ఇందులో భాగంగా యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ సింగపూర్ ప్రభుత్వ ఆధీనంలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఐటిఇ) సంస్థతో శుక్రవారం నాడు ఎంఓయు కుదుర్చుకుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, స్పెషల్ సీఎస్ జయేశ్ రంజన్ సమక్షంలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ సుబ్బారావు, ఐటిఇ డిప్యూటీ డైరెక్టర్ ఫాబియన్ చియాంగ్ ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు.

## సూపర్ సిక్స్‌లు అమలు చేయమంటే వింత మాటలు మాట్లాడుతున్నారు.. చంద్రబాబుపై వైఎస్ షర్మిల మండిపాటు

అమరావతి : ఏపీ సీఎం చంద్రబాబుపై ఆ రాష్ట్ర పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మండిపడ్డారు. ' ఏరు దాటే దాకా ఓడ మల్లన్న.. దాటాక బోడి మల్లన్న' అనే సామెతను తలపిస్తోందని ట్విటర్‌లో ఆరోపించారు. ఎన్నికల్లో సూపర్ సిక్స్ అంటూ ఆర్భాటం చేసిన బాబు .. అమలుకొచ్చేసరికి ఆదాయం పెరిగితేనే అంటూ మడతపేచి పెట్టారని దుయ్యబట్టారు. అప్పులు దొరకవని, ఆదాయం పెంచుకోవాలని, తలసరి ఆదాయం పెరగాలని, మనుషులు మన ఆస్తి అంటూ వింత వింత మాటలు చెప్తున్నారు. ఆడలేక మద్దెల దరువన్నట్లుందని బాబు వ్యవహారముందని ఆరోపించారు. ఎన్నికల్లో సూపర్ సిక్స్ హామీలు ఇచ్చే ముందు తెలియదా రాష్ట్రం రూ.10 లక్షల కోట్ల అప్పుల్లో ఉందని..? సూపర్ సిక్స్ హామీలు అమలుకు ఏటా రూ.2 లక్షల కోట్లు అవసరం ఉందని..? తెలియదా అంటూ ప్రశ్నించారు. రాష్ట్ర బడ్జెట్ మొత్తం డైవర్ట్ చేసినా ఇంకా నిధుల కొరత ఉంటుందని తెలియదా..? అని అన్నారు. కేంద్రానికి మీరొక్కరే కాదని తెలిసినప్పుడు ఎందుకు మద్దతు ఇచ్చారు ?. రాష్ట్రాన్ని సహాయ పడనప్పుడు మోడీతో చెట్టాపట్టాలు దేనికోసమని నిలదీశారు. ప్రజలు ఓట్లేసి అధికారం ఇస్తే, ఏదో ఉద్ధరిస్తారని నమ్మకం పెట్టుకుంటే, హామీలను తుంగలో తొక్కి, విజన్ల పేరుతో , వృద్ధి రేట్ల సాకుతో కాలయాపన తప్పా..పనితనం శూన్యమని విమర్శించారు. ఎప్పటికైనా రాష్ట్రానికి సంజీవని ప్రత్యేక హోదా. హోదాతోనే రాష్ట్ర అభివృద్ధి. నిధులు పారాలన్నా, పరిశ్రమలు స్థాపన జరగాలన్నా, ప్రజల ఆదాయం పెరగాలన్నా.. యువతకు ఉద్యోగాలు రావాలన్నా. ప్రత్యేక హోదా ఒక్కటే శరణ్యమని షర్మిల పేర్కొన్నారు.

## పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

కేంద్రం పీఎం కిసాన్ నిధులు జమ చేసిన వెంటనే, రాష్ట్రంలో అన్నదాత సుఖీభవ నిధులు జమ చేయాలని తెలిపారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్ల స్థలం పేదలకు ఇచ్చేలా ఏర్పాట్లు చేయాలని చెప్పారు. పోలవరం డయాఫ్రం వాల్ నిర్మాణం వెంటనే ప్రారంభించి, నిర్దేశిత సమయం లోపు పూర్తి చేయాలని అన్నారు. ఇక, రాజధాని అమరావతి పనులు కూడా వెంటనే ప్రారంభం అవుతాయని సీఎం చంద్రబాబు వెల్లడించారు.

# చిరంజీవి మళ్లీ పొలిటికల్‌గా యాక్టివ్ కాబోతున్నారా?

### మళ్లీ రాజకీయాల్లోకి ఎంట్రీ ఇవ్వబోతున్నాడా? బీజేపీలో చేరి చక్రం తిప్పుతారా?



అమరావతి: మెగాస్టార్ చిరంజీవి మళ్లీ రాజకీయాల్లోకి ఎంట్రీ ఇవ్వబోతున్నాడా? ఈసారి బీజేపీ నుంచి చక్రం తిప్పబోతున్నాడా? అంటే అవుననే అనిపిస్తోంది. కొద్దిరోజులుగా చిరంజీవిపై ప్రధాని మోదీ, బీజేపీ పార్టీ చూపిస్తున్న అభిమానం చూస్తుంటే అందరికీ అదే అనుమానం వస్తోంది. ఇదే విషయంలో కొద్దిరోజులుగా సోషల్‌మీడియాలోనూ చర్చ జరుగుతుంది. అసలు చిరంజీవి బీజేపీలో చేరబోతున్నాడని ఇటీవల జోరుగా ప్రచారం జరగడానికి ఒక కారణం ఉంది. ఇటీవల కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఢిల్లీలోని తన నివాసంలో సంక్రాంతి సంబురాలను నిర్వహించారు. ఈ వేడుకలో మెగాస్టార్ చిరంజీవి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ ఈవెంట్‌కు ఎంతోమంది ప్రముఖులు, రాజకీయ నాయకులు హాజరయ్యారు. కానీ వారందరిలో మెగాస్టార్ స్పెషల్ ఎట్రాక్షన్ కావడానికి ఒక కారణం ఉంది. ఎందుకంటే కిషన్ రెడ్డి నివాసంలో జరిగిన ఆ ఈవెంట్‌కు ప్రధాని మోదీ హాజరయ్యారు. ఆ సమయంలో చిరంజీవితో మోదీ చాలా సాన్నిహిత్యంగా ఉన్నాడు. కిషన్ రెడ్డి నివాసంలో ఉన్నంతసేపు కూడా చిరంజీవిని తన పక్కనే ఉంచుకున్నారు. దీనికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ వీడియోలో వైరల్‌గా మారాయి. చిరంజీకి ప్రధాని మోదీ ఇస్తున్న ప్రాముఖ్యత కారణంగానే ఆయన బీజేపీలో చేరబోతున్నాడని ప్రచారం జోరుగా జరుగుతుంది. చిరంజీవికి రాజ్యసభ పదవి ఇచ్చి మోదీ కేబినెట్‌లోకి తీసుకునే అవకాశం ఉందని కూడా వార్తలు వినిపిస్తున్నాయి. చిరంజీవికి ప్రధాని మోదీ ఇంతలా ప్రాధాన్యత ఇవ్వడం ఇదే మొదటిసారి కాదు. ఇటీవల ఏపీ ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ప్రమాణస్వీకారం చేసిన సమయంలో కూడా చిరంజీవితో ప్రధాని మోదీ అదే ఆప్యాయత చూపించారు. కూటమి నాయకుడు అయిన చంద్రబాబు కంటే కూడా చిరంజీవితోనే ఎక్కువ చనువుగా మెదిలాడు. పవన్ కల్యాణ్, చిరంజీవి ఇద్దరినీ ఆప్యాయంగా హత్తుకోవడమే కాకుండా.. వారితో చిరునవ్వులు చిందిస్తూ.. చాలాసేపు మాట్లాడారు. మెగా బ్రదర్స్ చేతులు పట్టుకుని అభివాదం చేశారు. అప్పుడే చిరంజీవి బీజేపీలోకి చేరబోతారని ప్రచారం జరిగింది. ప్రజా రాజ్యం అని సొంత పార్టీ పెట్టి చేతులు కాల్చుకున్న చిరంజీవి.. తన పార్టీని అప్పట్లోనే కాంగ్రెస్‌లో విలీనం చేశారు. ఫలితంగా కాంగ్రెస్ నుంచి రాజ్యసభకు నామినేటవ్వడమే కాకుండా కేంద్రమంత్రి పదవిని కూడా పొందారు. కానీ ఆ సమయంలో జరిగిన పరిణామాలను చూసిన చిరంజీవి రాజకీయాలపై విరక్తిని పెంచుకున్నాడు. అప్పటి నుంచి పాలిటిక్స్‌కు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నారు. అదే విషయాన్ని పలుమార్లు బహిరంగంగానే చిరంజీవి ప్రకటించారు. అందుకే తన సోదరుడు పవన్ కల్యాణ్ జనసేన పార్టీని పెట్టి ఎన్నికల్లో జోరుగా ప్రచారం చేసినప్పటికీ బయట నుంచే మద్దతు ఇచ్చారు తప్ప.. పార్టీలో కీలకంగా వ్యవహరించలేదు. పైగా తమ్ముడి కూటమి పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత దాన్ని తనకు అనుకూలంగా మార్చుకోవాలని.. పదవులు పొందాలని అనుకోలేదు. కానీ తాజా పరిణామాలను చూస్తుంటే.. బీజేపీనే చిరంజీవిని తమవైపు ఆకర్షించుకుంటుందని తెలుస్తోంది. ఆయన్ను పార్టీలోకి తీసుకునేలా కసరత్తు చేస్తుందని తెలుస్తోంది. రాజకీయ పార్టీలకు దూరంగా ఉండాలనే చిరు నిర్ణయాన్ని గౌరవించి.. ఆయన్ను రాష్ట్రపతి కోటాలో రాజ్యసభకు నామినేట్ చేసే అవకాశం ఉందని వార్తలు వినిపిస్తున్నాయి. మరి ఈ వార్తల్లో ఎంత నిజముందో తెలియాలంటే కొద్దిరోజులు ఆగాల్సిందే.!


# రేవంత్ రెడ్డికి కేటీఆర్ సవాల్



రంగారెడ్డి : రాష్ట్రంలో ఏ ఒక్క ఊరిలోనైనా వంద శాతం రుణమాఫీ అయిందని రాసిస్తే.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలమంతా రాజీనామా చేస్తామని సీఎం రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ విసిరారు. రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో ఏర్పాటు చేసిన రైతు సభలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. పేపర్లలో బెస్ట్ జోక్ చూసినా.. రేవంత్ రెడ్డి ఢిల్లీకి పోయిండు.. అక్కడ స్పీచ్ ఇస్తుండు.. తెలంగాణలో మొత్తం ఉద్ధరించిన.. ఢిల్లీలో కూడా ఉద్ధరిస్తానని, మీరు నా మాట నమ్మి కాంగ్రెస్ పార్టీకి అధికారం ఇవ్వండి. తెలంగాణలో ఆరు గ్యారెంటీలు అమలు చేశాం.. రుణమాఫీ చేశాను. 100 రోజుల్లో ఇచ్చిన మాట నిలబెట్టుకున్నా.. ఢిల్లీలో కూడా అదే చేస్తానని రేవంత్ రెడ్డి చెబుతున్నాడు. అమ్మకు అన్నం పెట్టనోడు చిన్నమ్మకు బంగారు గాజులు చేయిస్తాడా..? కూట్లో రాయి తీయనోడు.. ఏట్లో రాయి తీస్తాడా..? సీఎం అబద్ధాలు చెప్పొచ్చునా..? ఆరు గ్యారెంటీలలో అర గ్యారెంటీ అమలైంది.. అది కూడా ఫ్రీ బస్సు. మా ఊరికి బస్సే దిక్కు లేదు అని కొందరు లొల్లి పెడుతున్నరు. మీరు తిట్టే తిట్లకు రోషమున్నడు అయితే బకెట్లో నీళ్లు నింపుకుని దాంట్లో దూకి చచ్చిపోతాడు. కానీ ఆయన రేవంత్ రెడ్డి.. ఆయనకు రోషం, సిగ్గు లేదు. అబ్దదాలు చెప్పుడు ఆయనకు అలవాటు. ఒక్క మాట అడుగుతున్నా.. ఊర్లల్లో ఒక మాటిస్తే, బాకీ ఇస్తే తిరిగి ఇవ్వకపోతే కేసు పెడుతాం.. 420 కేసు పెడుతాం.. చీటింగ్ చేసిండు అని. మరి ఇన్ని మోసాలు చేసిన కాంగ్రెస్ సర్కార్‌ను విడిచి పెడుదామా..? అని కేటీఆర్ ప్రజలను అడిగారు. రైతులను రుణమాఫీ పేరిట మోసం చేసిండు. రూ. 2 లక్షల రుణాలను మాఫీ చేసేందుకు డిసెంబర్ 9న సంతకం పెడుతా అన్నాడు. కానీ పూర్తిగా రుణమాఫీ కాలేదు. నీకు నిజాయితీ ఉంటే.. నీ సొంతూరు కొండారెడ్డిపల్లెకు పోదాం.. కొడంగల్‌కు పోదాం.. రుణమాఫీ అయిందని చెప్తే రాజీనామా కాదు రాజకీయ సన్యాసం తీసుకుంటానని అసెంబ్లీలో చెప్పాను. ఉలుకు పలుకు లేదు. రాష్ట్రంలో ఏ ఊరికైనా సరే.. డేట్, ప్లేస్, టైమ్ నీ ఇష్టం.. నువ్వు కాకపోతే నీ మంత్రులను పంపించు. వంద శాతం రుణమాఫీ అయిందని రాసిస్తే మొత్తం బీఆర్ఎస్ నేతలు రాజీనామా చేసి పోతాం. చారణా రుణమాఫీ కూడా కాలేదు. కానీ ఇవాళ డిల్లీకి పోయి రుణమాఫీ చేసిన అని రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నాడని కేటీఆర్ నిప్పులు చెరిగారు. కేసీఆర్ మీకు బిచ్చమేసినట్టు రైతుబంధు కింద రూ. 10 వేలు ఇస్తుండు.. నన్ను గెలిపిస్తే రూ. 15 వేలు ఇస్తానని అన్నాడు. ఏడాది దాటిపోయింది.. ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. ఎన్నికలప్పుడు 7600 కోట్లు రైతుబంధు వేసేందుకు మేం సిద్ధమైతే ఈసీకి ఉత్తరం రాసిండు రేవంత్ రెడ్డి. ఈ టైమ్‌లో వేస్తే కేసీఆర్‌కు ఓట్లు వేస్తారని చెబితే మోదీ ప్రభుత్వం ఆపింది. ఎన్నికలు అయిపోయాక రైతులను ఇబ్బంది పెట్టిండు. కేసీఆర్ హయాంలో నాట్లప్పుడు రైతుబంధు పడుతుండే.. ఇప్పుడు ఓట్లప్పుడు పడుతున్నాయి. కేసీఆర్ జమ చేసిన రూ. 7600 కోట్లను పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లప్పుడు వేసిండు. వానాకాలం పంటకు రైతుబంధు ఇవ్వలేదు. అందుకే ఇవాళ ధర్నా పెట్టాం. ఎందుకంటే.. ఇది ప్రారంభం మాత్రమే.. రాష్ట్రమంతా ధర్నాలు పెడుతాం. రైతులకు ఇచ్చిన మాట ప్రకారం 15 వేలు ఇవ్వాలి రైతుభరోసా. ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి. వానాకాలం రైతుబంధును ఎగ్గొట్టిండు.. దాన్ని కూడా విడిచి పెట్టొద్దు అని కేటీఆర్ చెప్పారు.

## విశాఖ ఉక్కు పరిశ్రమకు రూ.11,440 కోట్ల ప్యాకేజీ

మొదటి పేజి తరువాయి



ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన కేంద్ర కేబినెట్ గురువారం సమావేశమైన విషయం తెలిసిందే. ఈ సమావేశంలో ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ ప్యాకేజీకి ఆమోదముద్ర వేసినట్లు కేంద్రమంత్రి వెల్లడించారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు ఏటా 7.3 మిలియన్ టన్నుల స్టీల్‌ను ఉత్పత్తి చేసే సామర్థ్యం ఉన్నది. ఈ కంపెనీ 2023-24లో రూ.4,848.86 కోట్ల నష్టపోయింది. అంతకు ముందు 2022-23లో రూ.2,858.74 కోట్ల నష్టాల్లో కూరుకుపోయింది. వర్కింగ్ క్యాపిటల్ కోసం చేసిన అప్పులు పెరగడం దీనికి ప్రధాన కారణం. గత అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం స్టీల్ ప్లాంట్‌పై ప్రత్యేకంగా దృష్టి సారించింది. కేంద్రమంత్రి కుమారస్వామి సైతం ప్లాంట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పలువురు నేతలు ప్లాంట్‌కు రూ.18వేలకోట్ల ప్యాకేజీ ప్రకటించాలని కోరారు. ఆ తర్వాత కొద్దిరోజులకే కేంద్ర ప్రభుత్వం ఉక్కుశాఖ ఎమర్జెన్సీ అడ్వాన్స్ ఫండ్ కింద జీఎస్టీ చెల్లింపులకు రూ.500 కోట్లు, ముడిసరుకుకు సంబంధించి బ్యాంకు అప్పుల చెల్లింపులకు రూ.1,150 కోట్ల చొప్పున రెండు విడుతల్లో సహాయం అందించింది. తాజాగా రూ.11,440 కోట్లతో ప్యాకేజీని ప్రకటించింది. వైజాగ్ స్టీల్ ప్లాంట్ విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు అనే నినాదంతో స్థాపించారు. భారతదేశంలోని అత్యాధునికమైన ప్రభుత్వరంగ ఉక్కు తయారీదారు. విశాఖపట్టణం నగరానికి దాదాపు 26 కిలోమీటర్ల దూరంలో ఉంది. జర్మనీ, సోవియట్ రష్యాల సాంకేతిక సహకారంతో ఈ ప్లాంట్‌ను నిర్మించారు. స్టీల్ ప్లాంట్ ఉత్పత్తులు దేశ విదేశాల్లో మంచి పేరున్నది. సంస్థ రాబడిలో 80శాతం జపాన్, జర్మనీ, అమెరికా సంయుక్త రాష్ట్రాలు, దుబాయి, సింగపూర్, ఆస్ట్రేలియా, దక్షిణ అమెరికా దేశాలకు చేయబడుతున్న ఎగుమతుల ద్వారానే వచ్చాయి. 2010 నవంబరు 10న నవరత్న హోదా పొందింది. అయితే, గత కొద్ది సంవత్సరాలుగా స్టీల్ ఫ్యాక్టరీ నష్టాల్లో కొనసాగుతున్నది. కంపెనీ అప్పులు భారీగా పేరుకుపోయాయి. ఆ తర్వాత స్టీల్ ఉత్పత్తికి అవసరమైన ఐరన్ ఓర్, బొగ్గు సరఫరా బాగా తగ్గిపోయింది. దాంతో ఉత్పత్తి సైతం విపరీతంగా పడిపోయింది. ఇక నష్టాలను పూడ్చే మార్గం సైతం కంపెనీకి లేకుండాపోయింది. చివరకు ఉద్యోగులకు జీతాలు కూడా ఇవ్వలేని స్థితికి చేరుకుంది. కంపెనీపై ఆధారపడ్డ వేలాది మంది ఉద్యోగుల కుటుంబాలు కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ వచ్చారు. ఒక దశలో ఫ్యాక్టరీని కేంద్రం ప్రైవేటీకరించాలని భావించింది. ఉద్యోగులు, కార్మికుల ఆందోళన బాటపట్టారు. దాంతో కేంద్రం వెనక్కి తగ్గింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వైజాగ్ స్టీల్ ఫ్యాక్టరీకి పూర్వవైభవం తీసుకురావాలని నిర్ణయించింది. ఇందులో భాగంగానే ప్యాకేజీని ప్రకటించింది.

# స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత రైతు భరోసాను ఎత్తేయడం ఖాయం..

### కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు



హైదరాబాద్ : రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత రైతు భరోసాను కాంగ్రెస్ ప్రభుత్వం ఎత్తేయడం ఖాయమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ ఎన్నికల కోసమే రైతు భరోసాను రేవంత్ రెడ్డి తెరపైకి తీసుకువస్తున్నాడని కేటీఆర్ తెలిపారు. కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. ఈరోజు రైతుల కోసం మా పార్టీ పోరుబాట పట్టింది. అందులో భాగంగానే ఈరోజు మొదటి రైతు ధర్నా కార్యక్రమాన్ని చేపట్టాము. 21వ తేదీన నల్లగొండలో రైతు ధర్నా ఉంటుంది. స్థానిక సంస్థల కోసం రైతు భరోసా పేరుతో మోసం చేసేందుకు ప్రయత్నం చేస్తుంది. స్థానిక సంస్థల ఎన్నికల అనంతరం రైతు భరోసాను కాంగ్రెస్ ఎత్తివేస్తుంది. కౌలు రైతులకు రైతు భరోసా ఇస్తామని చెప్పిన రేవంత్ రెడ్డి ఇప్పుడు 22 లక్షల మంది గురించి మాట్లాడడం లేదు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతి మాట ప్రతి హామీని నిలబెట్టుకోవాలి అప్పటిదాకా కాంగ్రెస్‌ను వదిలిపెట్టము. రైతులకు, వ్యవసాయానికి కేసీఆర్ చేసినంత సేవ దేశ చరిత్రలో ఎవరూ చేయలేదు. రైతుబంధు, రైతు బీమా, రైతు వేదికలు, సాగునీరు వంటి అనేక విప్లవాత్మక కార్యక్రమాలను కేసీఆర్ తీసుకువచ్చారు అని కేటీఆర్ గుర్తు చేశారు. మా పార్టీకి ఆయువు పట్టుగా ఉన్న రైతన్నల కోసం నిరంతరం ప్రభుత్వం పైన ఒత్తిడి తీసుకు వస్తూనే ఉంటాము. విచారణల పేరుతో ఎంత డైవర్షన్లు చేసినా మా పోరాటం ఆపము. మళ్లీ చెబుతున్నాను రేవంత్ రెడ్డికి ధైర్యం ఉంటే ఆయన జూబ్లీహిల్స్ ప్యాలెస్‌లో కానీ ఇంకెక్కడైనా లైవ్‌లో లై డిటెక్టర్ పరీక్షకు రావాలి. దమ్ముంటే రేవంత్ రెడ్డి ఒప్పుకోవాలి. తనపై కేసు వాదించేందుకు న్యాయవాదులకు కోట్ల రూపాయలను ఈ ప్రభుత్వం కుమ్మరిస్తున్నది. మాపై చేసే వేధింపుల కోసం ప్రజల సొమ్మును దండగ చేయడం ఎందుకు..? ప్రజా కోర్టులోనే తేల్చుకుందాం దమ్ముంటే రేవంత్ రెడ్డి రావాలి. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం రూ. 10 కోట్లు వృధా చేసింది.. ఈ డబ్బులతో వందల మంది రైతన్నలకు, వృద్ధులకు ఆర్థిక భరోసా అందించవచ్చు. కేవలం ఐదు పది లక్షల రూపాయలతో లైవ్‌లో డిబేట్ పెట్టి లై డిటెక్టర్ పెడితే ఎవరు తప్పు చేశారో తెలిసిపోతుంది కదా..? ఏమీ లేనటువంటి ఏసీబీ కేసును ప్రజలను డైవర్ట్ చేసేందుకు ప్రభుత్వం వాడుకుంటుంది. ఏసీబీ, ఈడీ చేసిన విచారణలో ఎలాంటి అవినీతి లేదన్న విషయాన్ని స్పష్టం చేశారు. గ్రీన్ కో కంపెనీకి అప్పటి రాష్ట్ర ప్రభుత్వం వలన ఒక రూపాయి అయినా లాభం జరిగిందా..? ఆ కంపెనీకి ఎలాంటి లబ్ధి చేయనప్పుడు క్విడ్ ప్రోకో అని మాట ఎలా వర్తిస్తుంది? ప్రభుత్వము ఖర్చు చేసిన 46 కోట్లలో నయ పైసా అయినా మాకు వచ్చిందా..? ఆ రేసు రద్దు వలన ప్రభుత్వానికీ నష్టం జరిగింది. ఒక్క ఏడాది పాటు డబ్బులు వెనక్కి తేవడానికి ఏం చేసారు..? గతంలో చెప్పినట్లు మంత్రిగా నేను నిర్ణయం తీసుకున్నాను.. దానికి కట్టుబడి ఉన్నాను అని కేటీఆర్ స్పష్టం చేశారు.

### ఆ 10 నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు ఖాయం.. కేటీఆర్ కీలక వ్యాఖ్యలు

తెలంగాణలో త్వరలోనే ఉప ఎన్నికలు వస్తాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలుపొంది.. కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు తప్పక పడుతుందని ఆయన పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ మీడియాతో సంభాషిస్తూ.. రాష్ట్రంలో కచ్చితంగా ఉప ఎన్నికలు వస్తాయి. పార్టీ మారిన 10 నియోజకవర్గాల్లో కచ్చితంగా ఉప ఎన్నికలు వస్తాయి. ఇప్పటికే ఈ మేరకు సుప్రీంకోర్టు తీర్పు ఉంది. కాంగ్రెస్ పార్టీ తరఫున అప్పుడు వాదించిన న్యాయవాది ఆర్య సుందరం ఉప ఎన్నికలపైన వాదిస్తున్నారు. ఈ సంవత్సరంలో కచ్చితంగా ఉప ఎన్నికలు వస్తాయి. మాకు ఆ పది నియోజకవర్గాల్లో అనేకమంది పోటీకి సిద్ధంగా ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మా పార్టీ శ్రేణులు ఉత్సాహంగా ఉన్నారని కేటీఆర్ తెలిపారు. మాకు జైలు కానీ, ప్రభుత్వాల బెదిరింపులు కానీ, వేధింపులు కానీ కొత్త కాదు. గతంలో తెలంగాణ కోసం ఇవన్నీ ఎదుర్కొన్నాం. మా పైన విమర్శలు చేస్తున్న బిజెపి నేతలు తమ ఉత్సాహాన్ని.. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీల అమలు చేయకుండా చేస్తున్న మోసాన్ని ఎండగట్టడంలో ఉపయోగించండి. కాంగ్రెస్ పార్టీ చేసిన అమృత్ స్కాం.. బియ్యం స్కాం.. కాంగ్రెస్ నాయకుల పైన ఈడీ దాడులను ప్రశ్నించడంపైన చూపించండి. బీజేపీ %-% కాంగ్రెస్, ఈడీ %-% ఏసీబీ కలిసి కేసులు పెట్టుకున్న మేము ప్రజల తరఫున ప్రశ్నించడం ఆపే ప్రసక్తే లేదు. ఎన్నికల అప్పుడు మాత్రమే ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి ఒకరినొకరు విమర్శించుకుంటారు అని కేటీఆర్ పేర్కొన్నారు.

## తప్పుడు అఫిడవిట్ సమర్పిస్తే చర్యలు తప్పవు....
## రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్....



రామగుండం(జనం రిపోర్టర్ ):రామగుండం :జనవరి 16. పోలీస్ వెరిఫికేషన్ లో తమపై ఎలాంటి కేసులు లేవని కొందరు తప్పుడు అఫిడవిట్లు సమర్పిస్తున్నారని, అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాస్ హెచ్చరించారు .రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జోన్‌లకు చెందిన వారు పాస్‌పోర్ట్, ఉద్యోగ నియామకాలు, ఇతర పరిశ్రమల్లో నియామకాలకు సంబంధించి పోలీస్ వెరిఫికేషన్ సర్టిఫికెట్ , పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. అయితే, కొంతమంది గతంలో కేసులు నమోదైనప్పటికీ తమపై ఎలాంటి కేసులు లేవని, తప్పుడు అఫిడవిట్లు సమర్పిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు.ఈ విషయం రామగుండం కమిషనరేట్ స్పెషల్ బ్రాంచ్ అధికారుల విచారణలో వెల్లడైందని, దరఖాస్తుదారుల్లో కొందరిపై గతంలో కేసులు నమోదైనట్లు గుర్తించినట్లు వివరించారు. తప్పుడు అఫిడవిట్ సమర్పించిన 20 మందిని గుర్తించామని, వారి పై కేసులు కూడా నమోదు చేసినట్లు కమిషనర్ వెల్లడించారు.తదుపరి ఘటనలు నివారించేందుకు భవిష్యత్తులో తప్పుడు అఫిడవిట్ సమర్పిస్తే, కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని స్పష్టం చేశారు. నోటరీ చేసే వ్యక్తులు కూడా అఫిడవిట్ పొందిన వారికి తప్పుడు సమాచారంతో అఫిడవిట్ ఇస్తే కేసులు నమోదయ్యే అవకాశాలున్నాయని హెచ్చరించారు.

## నేడు స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ ర్యాలీ కార్యక్రమం..



పొన్నూరు(జనం రిపోర్టర్ ):అత్యంత పరిశుభ్ర రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ను తీర్చిదిద్దేందుకు ప్రతినెల మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రకటించిందని పొన్నూరు మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు శుక్రవారం కార్యాలయంలో మీడియాకు తెలిపారు.కార్యక్రమంలో భాగంగా రేపు ఉ. 8:30 గంటలకు మున్సిపల్ నుండి స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని ర్యాలీగా ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. వివిధ శాఖల అధికారులతో పాటు ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని స్వచ్ఛ పొన్నూరుకు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు కోరారు.

## పేద విద్యార్థికి 55990 రూపాయల విలువ
## గల లాప్ టాప్ బహుకరించిన దొంతి అవియుక్త్ రెడ్డి



వరంగల్:(జనం రిపోర్టర్ ): చెన్నారావుపేట మండలం బాపునగర్ గ్రామానికి చెందిన మంతెన ప్రభుదాస్ కుమారుడు మంతెన సన్నీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తాడేపల్లిగూడెం నేషనల్ ఇన్స్టిట్యూట్ అఫ్ టెక్నాలజీలో సివిల్ ఇంజనిరింగ్ రెండవ సంవత్సరం చదువుతుండగా సన్నీ ఆర్థిక పరిస్థితి బాగా లేనందున చదువుకోవడానికి ఇబ్బందులు పడుతున్న విషయాన్నీ స్థానిక నర్సంపేట శాసనసభ్యులు పేద ప్రజల పెన్నిధి దొంతి మాధవరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించిన ఏమ్మెల్యే తన కుమారుడు యువ నాయకుడు దొంతి అవియుక్త్ రెడ్డి సహకారంతో ఏసర్ కంపెనీకి చెందిన 55990 రూపాయల విలువ గల లాప్ టాప్ ను పేద విద్యార్థి మంతెన సన్నీకి బహుకరించగా మంతెన సన్నీ దొంతి అవియుక్త్ రెడ్డి కి రుణపడి ఉంటానని కృతజ్ఞతలు తెలిపారు.

## ఫ్యాబ్రికేషన్ కార్మికులకు రావలసిన రెండు నెలల వేతనం ఇప్పించిన

### -బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవిసింగ్..



కుత్బుల్లాపూర్ (జనం రిపోర్టర్ ):కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని సూరారం ఇండస్ట్రీ ఏరియాలో "భాష్ ఖాన్ ఫ్యాబ్రికేషన్" లో ప్రవీణ్, మున్న, ఇద్దరు కార్మికులు ఫ్యాబ్రికేషన్ షాప్ లో గత కొన్ని సంవత్సరల నుంచి ఫ్యాబ్రికేషన్ ఓనర్ భాష దగ్గర చేసేవారు... కొన్ని అనివార్య కారణాలవల్ల రెండు నెలల వేతనం ఇవ్వకుండా ఇబ్బంది పెడుతుండడంతో ఫ్యాబ్రికేషన్ వర్క్ మానేయడం జరిగింది... మొత్తం "జూన్, జూలై," రెండు నెలల వేతనం 60,000/- వేల రూపాయలు ఇవ్వాల్సి ఉండగా పలుమార్లు ఫ్యాబ్రికేషన్ ఓనర్ ఎండి. భాషను ఇంత అడిగిన నిర్లక్ష్యం వహిస్తూ పట్టించుకోకపోవడంతో విసుగు చెందిన కార్మికులు ప్రవీణ్, మున్న తమకు తెలిసిన తోటి కార్మికుల ద్వారా మనకు ఎవరైతే న్యాయం చేస్తారో అని తెలుసుకొని, బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవిసింగ్ గురించి తెలుసుకొని తన కార్యాలయం వద్దకు వచ్చి తనకు జరిగిన అన్యాయం గురించి వివరించారు...వెంటనే స్పందించిన కార్మిక నాయకుడు రవిసింగ్.. హుటాహుటిన ఫ్యాబ్రికేషన్ షాప్ దగ్గరికి వెళ్లి ఓనర్ ఎండి.భాష తో పలుమార్లు చర్చించి కార్మికులు ఇద్దరికీ కలిపి మొత్తం రావాల్సిన వేతనం జూన్, జూలై రెండు నెలల వేతనం, 60,000/- వేల రూపాయలు ఇప్పించడం జరిగింది... ఫ్యాబ్రికేషన్ కార్మికులు మాట్లాడుతూ మాకు న్యాయం చేసిన రవిసింగ్ కి ప్రత్యేక ధన్యవాదాలు, తెలియజేశారు... ఈ కార్యక్రమంలో అనిల్, సుదర్శన్, జగన్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు..

## సంక్రాంతి పండుగ సందర్బంగా
## డీసీసీ అధ్యక్షులు గారిని మర్యాద పూర్వకంగా కలిసి
## శుభాకాంక్షలు తెలియజేసిన నియోజకవర్గ ఇంచార్జి



కుత్బుల్లాపూర్ (జనం రిపోర్టర్ ):సంక్రాంతి పండుగ సందర్భంగా ఈరోజు మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి గారిని మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ఈ కార్యక్రమంలో 126 డివిజన్ జగద్గిరిగుట్ట అధ్యక్షులు గణేష్, యువజన సీనియర్ నాయకులు శ్రీశైలం యాదవ్ పాల్గొన్నారు.

## దివ్యాంగ్ రక్షక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీమతి రమ్య గారి పుట్టిన రోజు సందర్భంగా యాచకులకు భోజనం పంపిణీ



పొదిలి (జనం రిపోర్టర్ ):కోనసీమ జిల్లా కొండుకుదురు వాస్తవ్యులు శ్రీ మేడిద రాజేష్ గారి జీవిత భాగస్వామి శ్రీమతి రమ్య గారి పుట్టిన రోజు సందర్భంగా వారి కుటుంబ సభ్యులు నలుగురికి భోజనం పెట్టాలని మంచి ఉద్దేశంతోటి హెూప్ హెల్పింగ్ హాండ్స్ ఫౌండేషన్ వారి చేతుల మీదుగా దివ్యాంగ్ రక్షక్ ఫౌండేషన్ వారికి భోజనం పంపిణీ ఇవ్వడం జరిగింది భోజనాన్ని దివ్యాంగ్ రక్షక్ ఫౌండేషన్ మరియు హెూప్ హెల్పింగ్ హాండ్స్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈరోజు శుక్రవారం పెద్ద మసీదులో తిరుగుతున్న యాచకులకు భోజనం పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఫౌండర్ నరసింహారావు మరియు ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ






రేపల్లె (జనం రిపోర్టర్ ):ఆర్థిక ఇబ్బందుల వలన ఏ ఒక్కరు అనారోగ్యంతో ఇబ్బంది పడకూడదని ఆలోచనతో కూటమి ప్రభుత్వం వివిధ వ్యాధులకు గురైన బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ ను అందజేస్తుందని రాష్ట్ర రెవెన్యూ రిజిస్ట్రేషన్ మరియు స్టాంపులు శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. శుక్రవారం టిడిపి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వివిధ రుగ్మతల వలన బాధపడుతున్న వారికి సీఎం కి రిలీఫ్ ఫండ్ చెక్కులు వచ్చాయని వాటిని బాధితులకు అందజేయడం జరుగుందని అన్నారు నలుగురు బాధితులకు 15 లక్షల 25 వేల 936 రూపాయల విలువ కలిగిన చెక్కులను పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలోరాష్ట్ర టిడిపి కార్యదర్శి పంతని మురళీధరరావు టిడిపి నాయకులు పాల్గొన్నారు

## దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్



రేపల్లె (జనం రిపోర్టర్ ):దివ్యాంగుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రతినెల నాలుగవ శనివారం దివ్యాంగుల గ్రీవెన్స్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్వహించడం జరుగుతుందని తాసిల్దార్ ఎం శ్రీనివాసరావు తెలియజేశారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారుల తో దివ్యాంగుల గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు దివ్యాంగులకు ఎటువంటి సమస్యలు ఉన్న గ్రీవెన్స్ లో హాజీ రూపంలో దాఖలు చేసుకుంటే వాటిని పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందని ఈ అవకాశాన్ని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శోభారాణి పంచాయతీరాజ్ ఏఈ చక్రవర్తి మండల సర్వేయర్. రీ సర్వే డిప్యూటీ తాసిల్దార్ నిరంజన్ బాబు అధికారులు పాల్గొన్నారు

## రబీ రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలి.



పొన్నూరు (జనం రిపోర్టర్ ): గుంటూరు జిల్లా పొన్నూరు మండలంలోని దండమూడి, మునిపల్లె గ్రామాలలో శుక్రవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమంలో జొన్న, మొక్కజొన్న, మినుము, పెసర వరి పైర్లు ను మండల వ్యవసాయ అధికారి డేగల వెంకట్రామయ్య వ్యవసాయ శాఖ సిబ్బందితో కలిసి సందర్శించడం జరిగింది.మొక్కజొన్న, జొన్న లలో కాండం తొలుచు పురుగు సస్యరక్షణ చర్యలు గురించి రైతులకు అవగాహన కల్పించారు. మినుము, పెసర పంటలలో ముఖ్యమైన పోషకాలు





పిచికారి రూపంలో అందించడం ద్వారా మంచి దిగుబడులు సాధించవచ్చని ఏఓ వెంకటరామయ్య వివరించారు. రెండు గ్రామాల రైతులకు రబీ సీజన్లో వేసిన అన్ని పంటలను ఈ పంట నమోదు చేసుకోవాలని సూచించారు.ఈ కేవైసీ కూడా తప్పనిసరిగా చేయాలని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మునిపల్లె, దండమూడి గ్రామాల రైతు సేవ కేంద్రం సిబ్బంది అరుణ నాగరాజ, గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## జనం న్యూస్ పత్రిక క్యాలెండర్ -
## 2025 ని ఆవిష్కరించిన మండల ప్రభుత్వ అధికారులు




నార్పల మండల(జనం రిపోర్టర్ ): కేంద్రంలో గల పలు ప్రభుత్వ కార్యాలయాలలో జనం న్యూస్ పత్రిక కి చెందిన నూతన సంవత్సరం - 2025 క్యాలెండర్ ని మండల తహసిల్దార్ కే అరుణ కుమారి మరియు మండల ఎంపీడీవో గంగావతి ఆవిష్కరింప చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ శ్రీనివాసమూర్తి, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పేదరికం నిర్మూలన చంద్రబాబుతోనే సాధ్యం:- కందుల వేణు వర్ధన్



పొన్నూరు (జనం రిపోర్టర్ ):ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పేదరికం నిర్మూలన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమని ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ ఐక్యవేదిక గుంటూరు జిల్లా ఉపాధ్యక్షులు, అఖిల భారత గౌడ సంఘం గుంటూరు జిల్లా యువత అధ్యక్షుడు, తెనాలి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ నేత, పెదకాకాని మండలం తెలుగుదేశం పార్టీ నేత కందుల వేణు వర్ధన్ స్పష్టం చేశారు. శుక్రవారం తెనాలి మారిస్ పేట ఆయన నివాసం వద్ద కందుల వేణు వర్ధన్ మాట్లాడుతూ గురువారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించిన ప్రజెంటేషన్ పేదరికం లేని రాష్టమే తమ కూటమి లక్ష్యమని ఎన్నికలకు ముందుకు ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. రాష్టాన్ని 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృఢ సంకల్పంతో పని చేస్తున్నారని పేర్కొన్నారు. అమరావతి పూర్తయితే భారతదేశంలోనే నెంబర్ రాజధాని అవుతుందన్నారు. వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఐదేళ్ళ అరాచక పాలన వల్ల రాష్టానికి అప్పులు ఆర్థిక భారం పెరిగిందని అయినప్పటికీ ప్రజాసంక్షేమానికి పెద్ద పీట కూటమి ప్రభుత్వం వేస్తుంది అని కందుల వేణు వర్ధన్ తెలిపారు.

## రామగుండం నగర పాలక సంస్థ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించిన జిల్లా అదనపు కలెక్టర్ జె.అరుణ శ్రీ....



రామగుండం(జనం రిపోర్టర్ ):రామగుండం:జనవరి 17. పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు ) . రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ ( ఎఫ్ ఎ సి ) జె. అరుణ శ్రీ శుక్రవారం రామగుండం నగర పాలక సంస్థ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించి, పారిశుధ్య నిర్వహణ, ఇతర సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించారు. విట్టల్ నగర్ లో ప్రమాదకరంగా పగుళ్లు చూపిన వంతెన పరిశీలించి యుద్ధ ప్రాతిపదికన మరమ్మత్తులు చేపట్టాలని ఆదేశించారు. గౌతమి నగర్ లోని కంపోస్ట్ యార్డ్



, డ్రై రీసోర్స్ సెంటర్ పరిశీలించారు. తడి చెత్త తో కంపోస్ట్ తయారీ పటిష్టంగా జరిగేలా చర్యలు చేపట్టాలని అన్నారు. అనంతరం నగర పాలక సంస్థ పారిశుద్ధ్య వాహన చోదకులతో సమావేశం నిర్వహించారు. ఉదయం 5 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు క్షేత్ర స్థాయిలో ఉండి, విధులు నిర్వహించాలని ఆదేశించారు . సేకరించిన చెత్తను ఎక్కడ పడితే అక్కడ పడ వేయకుండా డంపింగ్ యార్డ్ కు రవాణా చేయాలని అన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం పారిశుద్ధ్య కార్మికులకు ఇవ్వవలసిన ఉపకరణాలు , దుస్తులు వగైరా వెంటనే అందజేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా నగర పాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్ రాయలింగు , ఇఇ రామన్ , సానిటరీ ఇన్స్పెక్టర్లు నాగ భూషణం , సునీల్ రాథోడ్, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ మధుకర్ తదితరులు ఉన్నారు.

జనం
రిపోర్టర్ తెలుగు దినపత్రిక
శనివారం - 18-జనవరి-2025

## బాపట్ల జిల్లా క్రిస్టియన్ మైనారిటీ అధ్యక్షుడిగా సముద్రాల ప్రభు కిరణ్



రేపల్లె (జనం రిపోర్టర్ ):రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్ఆర్సిపి కేంద్ర కార్యాలయం రేపల్లె పట్టణానికి చెందిన సముద్రాల ప్రభుకిరణను బాపట్ల జిల్లా క్రిస్టియన్ మైనారిటీ అధ్యక్షుడిగా ఎంపిక చేయడం అభినందనీయమని పట్టణ మున్సిపల్ వైస్ చైర్మన్ జి ప్రశాంత్ కుమార్ అన్నారు. గురువారం రాత్రి స్థానిక ఏ ఈ ఎల్ సి చర్చి ఆవరణలో ప్రభుత్వ వైఎస్ఆర్సిపి శ్రేణులు అప్పుల మాలలతో ఘనంగా సత్కరించారు కేకును కట్ చేసి పంచి పెట్టుకున్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభు కిరణ్ పై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా వైఎస్ఆర్సిపి పార్టీని బలోపేతం చేసేందుకు సైనికుడు వలె పని చేయాలని సూచించారు. ఎంతోమంది క్రిస్టియన్ మైనార్టీ కి సంబంధించిన వ్యక్తులు ఉన్నప్పటికీ నీపై నమ్మకంతో వైఎస్ జగన్మోహన్ రెడ్డి పదవిని అందజేశారని ఆ పదవికి తగిన వన్నె తేవాలని తెలియజేశారు. పదవి పొందిన సముద్రాల ప్రభుకిరణను వైఎస్ఆర్సిపి మాజీ బాపట్ల జిల్లా క్రిస్టియన్ మైనారిటీ అధ్యక్షుడు చిత్రాలు ఓభేదు . మాజీ కాపు కార్పొరేషన్ డైరెక్టర్ చిమటా బాలాజి . పట్టణ వైఎస్ఆర్సిపి కన్వీనర్ కరేటి శేషగిరి బాపట్ల జిల్లా వైఎస్ఆర్సిపి అధికార ప్రతినిధి కె కృష్ణారెడ్డి ఉపాధ్యక్షుడు చదలవాడ శ్రీనివాసరావు వైఎస్ఆర్సిపి కార్యకర్తలు స్థానిక మిషన్ కాంపౌండ్ యూత్ సభ్యులు పాల్గొన్నారు తొలుత ఏ ఈ ఎల్ సి చర్చి వద్ద చర్చి పాస్టర్ రెవరెండ్ పుట్ట అబ్రహం అబ్రహం ప్రార్థన చేసి అభినందన కార్యక్రమాన్ని ప్రారంభించారు

## చెరుకుపల్లి మండలం గుళ్లపల్లి లో శుక్రవారం వేకువజామున అగ్ని ప్రమాదం




రేపల్లె (జనం రిపోర్టర్ ):చెరువుపల్లి మండలం గుల్లపల్లిలో శుక్రవారం తెల్లవారుజామున అగ్ని ప్రమాదం జరిగింది.అలపర్తి పుల్లారెడ్డి కి చెందిన పూరిల్లు, గొడ్లచావిడి, గడ్డివామి దగ్ధం అయ్యాయిపూర్తిగా దగ్ధమైన ఇల్లు, ఇంటిలోని గృహోపకరణాలు ప్రమాదంలో దూడ మృతిచెందగా రెండు గేదలు తీవ్రంగా కాలిపోయాయి. సుమారు నాలుగు లక్షల రూపాయల ఆస్తి నష్టం జరిగినట్లు బాధితులు పుల్లారెడ్డి తెలిపారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగినట్టు తెలుస్తుంది.ప్రమాదంలో పేలిపోయిన గ్యాస్ సిలిండర్. ప్రమాద సమయంలో ఇంట్లో ఎవరు లేకపోవడంతో తప్పిన పెను ప్రమాదం. అగ్ని ప్రమాదంలో గేదలు కాలిపోవటంతో పశువైద్యులకు సమాచారం ఇచ్చినప్పటికీ స్పందించలేదని వాపోయిన బాధితులు.

## క్రీడలు శారీరకంగామరియు మానసికంగా ఆరోగ్యానికి చాలా మంచివి..!! జిల్లా ఎస్పీ కె. నారాయణ రెడ్డి, ఐపీఎస్..!!



వికారాబాద్ జిల్లా ప్రతినిధి (జనం రిపోర్టర్ )జిల్లా పోలీస్ అధికారులకు ఈ రోజు జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్ నందు ఏర్పాటు చేసిన స్పోర్ట్స్ మీట్ కార్యక్రమం లో జిల్లా ఎస్పీ ముఖ్య అతిథిగా పాల్గొని, టాస్ వేసి పోటీలను ప్రారంభించడం జరిగింది. ఇట్టి కార్యక్రమం లో ఎస్పీ మాట్లాడుతూ క్రీడలు శారీరకంగా,మానసికంగా ఎన్నో ప్రయోజనాలను కల్గిస్తాయి. క్రీడలు ఆడటం వలన సమయస్ఫూర్తి, ఒకరితో ఒకరికి సమన్వయం, కలసికట్టుగా ఉండటం లాంటి అనేక మంచి అలవాట్లు వస్తాయి. కాండరాల దృఢత్వానికి వ్యాయామం తో పాటు క్రీడలు కూడ చాలా ముఖ్యం. గెలుపు కన్నా స్పోర్ట్స్ లలో పాల్గొనడం చాలా ముఖ్యం, క్రీడలలో ప్రతి





ఓటమి, ఒక పాఠాన్ని నేర్పుతుంది. జీవితం లో ఏవిధంగా విజయం సాదించాలి అనేది ఓటమి నుండే తెలుస్తుంది. క్రీడలు ఆడడం వలన శారీరకంగానూ, మానసికంగానే కాకుండా భవిష్యత్తులోకూడా ఆరోగ్యంగా ఉండటంలో, సంతోషకరమైన కమ్యూనిటీని నిర్మించడంలో, జీవితంలో క్రమశిక్షణ గా ఉండుటలో క్రీడలు ఎంతోగానో ఉపయోగపడుతాయిజీవితంలో వచ్చే ఒడిదుడుకులను తట్టుకొని విజయం సాదించాలి అంటే ఆరోగ్యంగా ఉండటం చాలా ముఖ్యం. కావున ఆరోగ్యంగా ఉండుటకు ప్రతి ఒక్కరూ ప్రతి రోజు ఏదో ఒక క్రీడలో తప్పని సరిగా పాల్గొనాలని, పోలీస్ డిపార్ట్మెంట్లో పోలీస్ అధికారులు రిటైర్మెంట్ వరకు ఫీట్ గా ఉండటం కొరకు క్రీడలు,వ్యాయామం చాలా ఉపయోగపడుతాయి కావున ప్రతి ఒక్కరూ తమ రోజువారీ కార్యక్రమాలలో క్రీడలకు, వ్యాయామానికి ప్రముక్యత కల్గించలని ఎస్పీ తెలిపినారు.ఇట్టి కార్యక్రమం లో జిల్లా అదనపు ఎస్పీ టీవీ హనుమంత్ రావు , డి సిఆర్బి డి.ఎస్.పి జానయ్య , వికారాబాద్ డి.ఎస్.పి శ్రీనివాస్ రెడ్డి , ఏ ఆర్ డి ఎస్ పి వీరేష్ , సీఐ లు, ఆర్ ఐ లు, ఎస్సై లు, ఆర్ఎస్ఐ లు, జిల్లా పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొనడం జరిగింది.

## యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో విఫలమైన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు



అమరచింత (వనపర్తి ప్రతినిధి) (జనం రిపోర్టర్ ):యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం డి, కుతుబ్ ఆరోపించారు. శుక్రవారం ఆయన 2025 నూతన క్యాలెండర్ ను పట్టణంలో ని జిల్లా పరిషత్ హై స్కూల్ ఆవరణలో సిపిఐ జిల్లా కార్యదర్శి కే విజయ రాములు చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కుతుబ్ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ దేశానికి వెన్నెముకగా ఉన్న యువతను ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేసి ఎందుకు కొరగాకుండా చేస్తున్నాయని ఆరోపించారు. యువతకు ఉపాధి కల్పించాలని వారి వారి అర్హతలను బట్టి ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి అబ్రహం, పట్టణ కార్యదర్శి భాస్కర్, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి ఏ రవీందర్, సౌలు, మైబు, జాక్స్, మార్టిన్, అభి పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహాన్ని తొలగించవద్దు.... అదనపు కలెక్టర్ కు విజ్ఞప్తి....



రామగుండం(జనం రిపోర్టర్ ):రామగుండం:జనవరి 17. గోదావరిఖని పట్టణంలోని రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ఆఫీస్ ముందు గల భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని తొలగించడం గాని, తరలించడం గాని చేయవద్దని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం రామగుండం మున్సిపల్ కార్యాలయానికి వచ్చిన పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ఇంచార్జ్ కమిషనర్ అరుణ శ్రీ కి విజ్ఞప్తి చేశారు. రామగుండం పారిశ్రామిక ప్రాంతా అభివృద్ధికి ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం వ్యతిరేకం కాదని, అభివృద్ధి పేరిట భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని కొంతమంది మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు తొలగించే కుట్రలు చేస్తున్నారని, తక్షణమే వారి యొక్క చర్యలు విరమించుకోవాలన్నారు. విగ్రహం తరలించకుండా, తొలగించకుండా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ఈ ఈ రామన్, ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు బొంకూరి బొంకూరి మధు, జాతీయ కార్యదర్శి కొంకటి లక్ష్మణ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు మైస రాజేష్, ఆలయ ఫౌండేషన్ సీఈవో తిట్ల రమేష్ బాబు, డిప్యూటీ సీఈవో మిట్టపల్లి రాజేందర్ కుమార్, సభ్యులు ఆర్నకొండ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

## జాబ్ కార్డు ఉన్నవారికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నిబంధన అర్ధరహితం



అమరచింత (వనపర్తి ప్రతినిధి) (జనం రిపోర్టర్ )జాబ్ కార్డు ఉండి 20 రోజులు పని చేసిన వారికే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ప్రభుత్వం పెట్టిన నిబంధన అది కాదని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ అజయ్ అన్నారు. శుక్రవారం అమరచింతలోని హైస్కూల్ గ్రౌండ్ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం2025 క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అమరచింత మున్సిపల్ వైస్ చైర్మన్ జీఎస్ గోపి. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు అజయ్ సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఆర్ ఎన్ రమేష్. రైతు సంఘం జిల్లా కోశాధికారి బి.వెంకటేష్. కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ ఈ శ్యాంసుందర్ లు మాట్లాడుతూ ఇండ్ల స్థలాలు భూ పోరాటాల పరిష్కారం కొరకు రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ కార్మిక సంఘం నిరంతరం కూలీల సమస్యలపై పోరాడుతున్నదని కొనియాడారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా. భూమిలేని వ్యవసాయ కూలీలకు ప్రతి ఏటా 12000 అందిస్తామన్న హామీని ఈనెల 26 నుంచి అమలు చేసేందుకు సిద్ధమవ్వ గా జాబ్ కార్డు కలిగి కనీసం 20 రోజులు పని చేసిన కూలీలకే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా. అందిస్తామన్న నిబంధన సరికాదని. మున్సిపాలిటీలు పట్టణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం లేనందున వారికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ద్వారా భూమిలేని కుటుంబాలను గుర్తించి పట్టణ ప్రాంతాల్లోనూ ఈ పథకం ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో భూములు లేని వ్యవసాయ కుటుంబాల సర్వేను ప్రభుత్వం నిర్వహించి. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో. బెక్కెం కురుమన్న ఇస్మాయిల్. అసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో బాధపడుతున్న బాధితుడికి ఎల్ఓసి అందజేత..



నర్వ (వనపర్తి ప్రతినిధి)(జనం రిపోర్టర్ )నర్వ మండలం లంకాల గ్రామానికీ చెందిన జములయ్యల వెంకటేష్ కొన్ని రోజులుగా అనారోగ్యంతో హాస్పిటల్ లో చికిత్స పొద్దుచున్నాడు విషయం తెలుసుకున్న నర్వ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బీసం చెన్నయ్య సాగర్ ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరికి తెలియజేయడంతో ఎమ్మెల్యే వెంటనే స్పందించి వెంకటేష్ వైద్య ఖర్చుల నిమిత్తం రూ. ఒక లక్ష యాభై వేల ఎల్ ఓ సి ని చెన్నయ్య సాగర్ బాధితుడికి అందజేశారు. ఈ సందర్భంగా బాధ్యత కుటుంబ సభ్యులు మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి స్థానిక కాంగ్రెస్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో నర్వ కాంగ్రెస్ లంకాల గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కోట్ల శ్రీనివాసులు, బీసం రవి, బి పాండు సాగర్,జీకే మూర్తి, దొరకుంట కృష్ణయ్య టి. లక్ష్మారెడ్డి, సత్యనారాయణ, బాలు.నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ఉమ్మడి మండలాల్లో పర్యటించిన జిల్లా కలెక్టర్



అమరచింత/ ఆత్మకూర్ (వనపర్తి ప్రతినిధి)(జనం రిపోర్టర్ ): రాష్ట్ర ప్రభుత్వం జనవరి 26 నుంచి ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు పథకాల అమలుకు అర్హులైన వారిని గుర్తించే ప్రక్రియ పకడ్బందీగా జరగాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సంబంధిత అధికారులను ఆదేశించారు. పథకాలకు అర్హుల గుర్తింపు విషయమై శుక్రవారం అమరచింత ఆత్మకూరు మండలాల్లోని మూలమల్ల, అమరచింత తహసిల్దార్ కార్యాలయంలో అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ పథకాలకు అర్హుల గుర్తింపు సర్వే ప్రక్రియ ఎలా జరుగుతుందని అధికారులతో సమీక్ష నిర్వహించారు అనంతరం అధికారుల పనితీరును పరిశీలించేందుకు మున్సిపాలిటీ లోని 9వ వార్డ్ సందర్శించి పథకాలకు అర్హులు గుర్తింపు ప్రక్రియ ఏ విధంగా జరుగుతుందో అనే విషయాన్ని పరిశీలించారు. ప్రభుత్వం పేదలకు కల్పిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందే విధంగా సర్వే ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. రైతు భరోసా అమలు కోసం మండల పరిధిలో వ్యవసాయేతర, నాలా భూముల గుర్తింపు ప్రక్రియ పకడ్బందీగా,



వేగవంతంగా చేయాలని ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో వ్యవసాయతర భూములను గుర్తించే ప్రక్రియను చేపట్టిన వ్యవసాయ విస్తరణ అధికారులకు తహసీల్దార్, ఎంఏఓ ఎప్పటికప్పుడు సూచనలు చేస్తూ, పర్యవేక్షణ ఉంచాలన్నారు. ఆలస్యం చేయకుండా వ్యవసాయెతర భూములు, లే అవుట్లు చేసినవి, భూసేకరణ చేసినవి తదితర భూములను గుర్తించలన్నారు. కొత్త రేషన్ కార్డుల కోసం ప్రజా పాలనలో వచ్చిన దరఖాస్తుల జాబితాను వెంటబెట్టుకుని పంచాయతీ కార్యదర్శులు అర్హుల గుర్తింపు ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు సంబంధించి మండలంలో ఉన్న జాబ్ కార్డుల ఆధారంగా కుటుంబ ఆర్థిక స్థితిగతులు, వారి పేరు పై ఏమైనా భూమి ఉన్నదా అనే వివరాలు పకడ్బందీగా పరిశీలించాలని సూచించారు. ఉపాధి హామీ కూలీల జాబితా ఆధారంగా వారి ఆధార్ వివరాలు, బ్యాంక్ అకౌంట్ వివరాలు సరిగా ఉన్నాయా లేవా చెక్ చేయాలన్నారు.అదేవిధంగా, ఇందిరమ్మ ఇండ్ల కోసం చేసిన సర్వే ఆధారంగా తయారుచేసిన జాబితాపై సూపర్ చెక్ చేయాలని ఆదేశించారు. ఆయా గ్రామాల్లో నిజంగా అద్దెకు ఉంటున్న వారి జాబితాను గుర్తించాలని సూచించారు. ఇల్లు లేని నిరుపేదలకే లబ్ధి చేకూర్చడమే ఈ పథకం లక్ష్యమని సర్వే ఆధారంగా నిజమైన లబ్ధిదారులను గుర్తించాలని చెప్పారు.సమావేశంలో ప్రత్యేక అధికారి సురేష్, తహసిల్దార్ రవి కుమార్ , ఎంపీడీఓ శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్, నూరుల్ నజీబ్ వ్యవసాయ అధికారులు, ఇతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. జిల్లా పౌర సంబంధాల అధికారి వనపర్తి ద్వారా జారీ

# బ్యాంకులు, ఎటిఎంల వద్ద పటిష్టమైన భద్రతా ప్రమాణాలు పాటించాలి

### ప్రతి బ్యాంక్ ఏటీఎం వద్ద తప్పనిసరిగా సెక్యూరిటీ గార్డు, సిసి కెమెరాలు, అలారం సిస్టం ఏర్పాటు చేయాలి.... పోలీస్ కమీషనర్ శ్రీ ఎం.శ్రీనివాస్...



రామగుండం:(జనం రిపోర్టర్ )రామగుండం:జనవరి 17.శుక్రవారం బ్యాంకు అధికారులు సిబ్బంది, పోలీస్ అధికారులతో సమన్వయంతో పనిచేస్తే నేరాలను నియంత్రించవచ్చని రామగుండము పోలీస్ కమీషనర్ ఎం.శ్రీనివాస్ పేర్కొన్నారు. సిపి పోలీసు కార్యాలయంలో కమీషనరేట్ పరిధి పెద్దపల్లి, మంచిర్యాల జోన్ వ్యాప్తంగా ఉన్న ఎసిపి లు వివిధ బ్యాంకుల్లో పని చేస్తున్న బ్యాంకు అధికారులతో బ్యాంకుల, ఏటీఎంల వద్ద భద్రతా ప్రమాణాలు, సిసి కెమెరాల ఏర్పాటు, ఆర్థిక నేరాలు, గతంలో రామగుండము పోలీస్ కమీషనరేట్ పరిధి లో జరిగిన బ్యాంకు,ఏటీఎం సంబందించిన నేరాల గురించి, భవిష్యత్తు లో తీసుకోవలసిన భద్రత ఏర్పాట్లు, తీసుకోవలసిన జాగ్రత్తలపై, తదితర అంశాలపై సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ.... రామగుండము పోలీస్ కమీషనరేట్ పరిధి పెద్దపల్లి జోన్ లో 109 బ్యాంకు లు, 79 ఏటీఎం సెంటర్స్ ,మంచిర్యాల జోన్ పరిధిలో 109 బ్యాంకు లు, 89 ఏటీఎం సెంటర్స్ లను గుర్తించడం జరిందని అన్నారు. బ్యాంకులు, ఎటిఎంల వద్ద పాటించాల్సిన భద్రతా ప్రమాణాలు, బ్యాంకుల వద్ద భద్రతా ప్రమాణాలు తూచ తప్పకుండా పాటించాలని, ఎటిఎం కేంద్రాల వద్ద కచ్చితంగా గార్డును నియమించాలని సిపి ఆదేశించారు. నిరంతరం సెక్యూరిటీ గార్డు, సిసి కెమెరాలు, అలారం సిస్టం ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రామగుడం కమీషనరేట్ పోలీసులు నిర్వహించిన ఆడిట్లో దాదాపు బ్యాంకులు, ఏటీఎంలలో అధిక నాణ్యత లేని సీసీ కెమెరాలు ఉన్నాయని, చాలా బ్యాంకుల వద్ద సెక్యూరిటీ గార్డులు లేరని ఈ సమావేశం అనంతరం అన్ని ఎటిఎంలలో, బ్యాంకులలో అలారం సిస్టమ్లతో పాటు సిసిటివి కెమెరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు.సెక్యూరిటీని నియమించాలని, దోపిడీ సమయంలో సిబ్బంది ఎలా ప్రతిస్పందించాలో దానిపై ఉద్యోగులకు శిక్షణ ఇవ్వాలని సూచించారు. లోపలికి వచ్చే వ్యక్తులను తనిఖీ చేయడానికి డ్యూటీలో ఉన్న గార్డుకు బ్యాంకు ప్రవేశ ద్వారం వద్ద ఒక డోర్ ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్ ను ఏర్పాటు, హ్యాండ్ హెల్డ్ మెటల్ డిటెక్టర్ అందించాలి.సెక్యూరిటీ గార్డును బ్యాంక్ లేదా సెక్యూరిటీ ఏజెన్సీ నియమించినప్పటికీ, అతని వ్యక్తిగత సమాచారం యొక్క పూర్తి రికార్డు, అతని ఫోటోతో పాటు, బ్యాంక్ వద్ద ఉంచాలి, కొత్తగా నియమితులైన వారు లేదా తాత్కాలిక ప్రాతిపదికన నియమించబడిన వారి పట్ల మరింత జాగ్రత్తగా ఉండండి. చాలా నేరాలలో నిందితులు సీసీటీవీ లపై స్ప్రే చేసి, సిసిటివిలు పని చేకుండా చేసి దొంగాతలకు పాల్పడుతారు. అదేవిధంగా డి వి ఆర్ లను దొంగిలించి నాశనం చేయడం చేస్తారు, కావున డి వి ఆర్ లను కనిపించేలాగా కాకుండా, సీక్రెట్ ప్రాంతాలలో దాచాలి. అటెన్షన్ డైవర్షన్ గ్యాంగ్లో భాగమైన నిజమైన కస్టమర్లు, అనుమానాస్పద వ్యక్తులను గుర్తించడానికి, ఆయుదాలు ఉపయోగం పై సెక్యూరిటీ గార్డులకు శిక్షణ ఇవ్వాలని, సెక్యూరిటీ గార్డ్, బ్యాంకు లోపల, బయట పరిసరాలను,వ్యక్తులను వారి కదలికలు, ప్రవర్తనలను గమనిస్తూ ఉండాలి. బ్యాంక్ అధికారులను కూడా ఆదేశించారు. ఏటీఎం లో డబ్బులు ఫిల్లింగ్ సమయంలో స్థానిక పోలీస్ అధికారులకు సమాచారం ఇస్తే, ఆ ప్రాంతంలోని బ్లూ క్లోట్స్, పెట్రో కార్ సిబ్బందిని అప్రమత్తం చేయడం జరుగుతుందన్నారు.ప్రతి బ్యాంకు అధికారులకు, సిబ్బందికి బ్యాంకు ఉన్న ప్రాంత పోలీస్ స్టేషన్ అధికారుల నెంబర్ లు తెలిసి ఉండాలి, హెల్ప్లైన్, పోలీస్ స్టేషన్ల సంప్రదింపు నంబర్లను బోల్డ్ అక్షరాలతో వ్రాసి బ్యాంకు లోపల తగిన ప్రదేశాలలో ఉంచాలి, తద్వారా అత్యవసర పరిస్థితి ఏర్పడినప్పుడు అవి సులభంగా కనిపిస్తాయి. ఇప్పటివరకు, దొంగలు ఎక్కువగా బ్యాంకులను రోజుకి తెరిచినప్పుడు లేదా మూసివేయబడిన సమయంలో, వారి భోజన విరామ సమయంలో కూడా లక్ష్యంగా చేసుకున్నారు. కాబట్టి ఈ సమయంలో సెక్యూరిటీ గార్డుతో పాటు బ్యాంకు ఉద్యోగులు మరింత అప్రమత్తంగా ఉండాలి. ఏదైనా ప్రమాదకరమైన సంఘటన జరిగినప్పుడు డయల్ 100 కు ,స్థానిక పోలీస్ కి సమాచారం ఉంచాలి. పని వేళల్లో , తర్వాత బ్యాంకు ఆవరణలో కూర్చోవడానికి బదులు, బయట ప్రధాన ద్వారం వద్ద ఉండి అప్రమత్తంగా విదులు నిర్వహించాలి బ్యాంకు సమయం తరువాత బ్యాంకు ను పూర్తిగా డోర్స్ క్లోజ్ చేసి పని చేసుకోవాలి.బ్యాంకుల నుండి బంగారం ,డబ్బులు డ్రా చేసుకొని వెళ్ళే వాళ్ళను లక్ష్యంగా చేసుకుని, వారిని అనుసరించి వారిని దోచుకుంటారు. బ్యాంకు బయట వాహనాలు నిలిపే ప్రాంతాలలో కూడా సిసి కెమరాలు ఏర్పాటు చేసుకోవాలి.రాత్రి సమయం లో కూడా సెక్యూరిటీ గార్డ్స్ లను ఆకస్మికంగా వారి పనితీరు ను తనిఖీ చేయాలని సూచించారు.ఈ సమావేశం లో అడిషనల్ డీసీపీ అడ్మిన్ సి. రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్ర రావు, కమిషనరేట్ పరిధిలోని ఏసీపీలు, ఎ ఆర్ ఏసీపీ లు ప్రతాప్, సిసిఆర్బి ఇన్స్పెక్టర్ సతీష్, ఐటీ అండ్ కమ్యూనికేషన్ ఇన్స్పెక్టర్ రాంప్రసాద్, ఆర్ఐ దామోదర్, బ్యాంకు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఓసిపి-3 లో అంగరంగ వైభవంగా దుర్గాదేవి విగ్రహ ప్రతిష్ఠ...



రామగుండం(జనం రిపోర్టర్ ):రామగుండం:జనవరి 17.శుక్రవారం పెద్దపల్లి జిల్లా రామగుండం 2 పరిధిలోని ఓసిపి త్రీ ఘని ఆవరణ యందు నూతనంగా నిర్మాణం చేసిన శ్రీ కనకదుర్గా దేవి ఆలయం వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య అంగరంగ వైభవంగా, మండల మహోత్సవం నిర్వహించారు. అమ్మవారి కలుశ పూజ, అభిషేకం, హోమం పూర్ణాహుతి, తీర్థ ప్రసాద పంపిణి ,ఆలయ నిర్మాణానికి విరాళాలు ఇచ్చిన భక్తులను సన్మానించడం జరిగింది.ఈ కార్యక్రమంలో అర్జీ టు జి ఎం శ్రీమతి, బి. వెంకటయ్య వనజ దంపతులు, ఎస్ ఓ టు జి ఎం శ్రీరాముడు, బ్రాంచ్ సెక్రటరీ జిగురు రవీందర్. అసిస్టెంట్ అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ శాంసన్, ఇంచార్జ్ మేనేజర్ పాండే, సేఫ్టీ ఆఫీసర్ పాపయ్య, ప్రాజెక్ట్ సెక్రటరీ మొటపలుకుల మహేందర్, సేఫ్టీ కమిటీ మెంబర్లు, మైన్స్ కమిటీ మెంబర్లు, సెక్షన్ హెచ్వోడీలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## రోడ్డు ట్రాఫిక్ సైన్ లపై అవగాహనా ఉండాలి....

### రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తూ ప్రయాణం చేసి గమ్యస్థానాలకు సురక్షితంగా చేరుకోవాలి.....

### ట్రాఫిక్ ఏసిపి నరసింహులు....



రామగుండం:(జనం రిపోర్టర్ ):రామగుండం:జనవరి 17. రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు పెద్దపల్లి ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం పెద్దపల్లి పట్టణంలోని, రైల్వే స్టేషన్ రోడ్ లో గల వ్యాన్ అసోసియేషన్ వారి కార్యాలయం ఆవరణలో ట్రాఫిక్ రూల్స్, ట్రాఫిక్ చిహ్నాల, రోడ్ సేఫ్టీ పై అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ట్రాఫిక్ ఏసిపి జాడి నరసింహులు ముఖ్యఅతిథిగా హాజరై డ్రైవర్స్ తో మాట్లాడడం జరిగింది. సందర్భంగా ఏసిపి మాట్లాడుతూ.. గత సంవత్సరంలో నాలుగు లక్షల ప్రమాదాలు జరగగ అందులో 1,73 వేల పైచిలుకమంది ప్రాణాలు కోల్పోవడం జరిగిందన్నారు. అందులో ఎక్కువ శాతం యువతే ఉంటుందని, చిన్నచిన్న తప్పిదల వల్ల ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ఇట్టి ప్రభావం దేశ ఆర్థిక ప్రగతి నష్టం కలిగిస్తుంది అని అన్నారు. వ్యాన్ డ్రైవర్ వాహనం నడిపే సమయంలో రోడ్డుపై ఉన్న చిహ్నాల గురించి అవగాహన కలిగి, జాగ్రత్తగా గమనిస్తూ వాహనాల నడపాలని, వాహనాలను రహదారిపై ఆపినప్పుడు పూర్తిగా రోడ్డున దింపి ఆపాలని సూచించారు. అదేవిధంగా వ్యాన్లు రాత్రి వేళలో ప్రయాణం చేసినప్పుడు గాని, పార్కింగ్ చేసినప్పుడు గాని ఆ మార్గంలో ప్రయాణం చేసే ఇతర వాహనాలకు వాహనం కనిపించే విధంగా వ్యాన్ ఇరుపక్కల వెనుక భాగంలో కూడా రేడియం స్టిక్కర్ను అంటించాలని, వాహనం ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో ఆగిపోయి నట్లయితే వాహనం చుట్టూ జాగ్రత్తలు పాటిస్తూ, ఇతర వాహనదారులకు ఇబ్బంది కలగకుండా సూచికలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ద్విచక్ర వాహనం నడిపినప్పుడు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలని, ట్రాఫిక్ రూల్స్ పాటించాలని రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తూ, క్షేమంగా గమ్యస్థానాలకు చేరాలని డ్రైవర్లకి అవగాహన కల్పించడం జరిగింది.ఈ కార్యక్రమం లో పెద్దపల్లి ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ అనిల్ కుమార్, పెద్దపల్లి, అసిస్టెంట్ మోటర్ వెహికల్ ఇన్స్పెక్టర్ మధు, ఎస్ ఐ సహదేవ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## నవోదయ కోచింగ్ తో విద్యార్థుల్లో సృజనాత్మకత పెరుగుతుంది



చొప్పదండి, (జనం రిపోర్టర్ ):విద్యార్థులను నవోదయ ప్రవేశ పరీక్ష కోసం కోచింగ్ సెంటర్లకు శిక్షణ కోసం పంపిస్తే వారిలో సృజనాత్మకత పెరుగుతుందని చొప్పదండి పట్టణంలోని రత్నసాగర్ నవోదయ ఐఐటి కోచింగ్ సెంటర్ వ్యవస్థాపకులు రత్నసాగర్,సంబోజి శేఖర్ లు అన్నారు.ఈ మేరకు ఈనెల 18న నవోదయ ప్రవేశ పరీక్ష ఉండడంతో తల్లిదండ్రులతో ఏర్పాటుచేసిన అత్యవసర సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు.తాము నాణ్యమైన షార్ట్ మెథడ్ లో విద్యార్థులకు విద్యాబోధన చేశామని తెలిపారు.ఈ శిక్షణ వలన విద్యార్థులకు నవోదయ లో ప్రవేశం లభిస్తుందని..లభించని విద్యార్థులకు జ్ఞాన సంపార్జన కలుగుతుందని అన్నారు.విద్యార్థులు సమయపాలన పాటించాలని సూచించారు.ఈ సందర్భంగా విద్యార్థులు ఏ విధంగా పరీక్షలకు సన్నద్ధం కావాలనే అంశాలపై అవగాహన కల్పించారు. వేసవి సెలవులలో కూడా శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు ప్రస్తుతం ప్రతిరోజు సాయంత్రం ఐదు గంటల నుండి ఏడు గంటల వరకు ప్రత్యేక శిక్షణ తరగతులు అన్ని తరగతులకు నిర్వహిస్తామని తెలిపారు ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు వినియోగించుకొని వారి పిల్లల అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు.ఈ సమావేశంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పాడి రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి - చమర్తి జగన్ మోహన్ రాజు



నందలూరు, (జనం రిపోర్టర్ ):ఆంధ్ర రాష్ట్రంలోని పాడి రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని, రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రైతుల,పశువుల అభివృద్ధి కోసం చేపట్టిన గోకులం షెడ్ల నిర్మాణాల వల్ల రైతులకు ఎంతో ప్రయోజనం ఉందని తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్ మోహన్ రాజు అన్నారు. శుక్రవారం మండలం లోని టీ.వీ పురం గ్రామంలో ఆయన గోకులం షెడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం,పాడి పశువుల అభివృద్ధి కోసం రాయితీ కింద గోకులం షెడ్లను పశుగ్రాసాన్ని కూడా అందిస్తుందని తెలిపారు.పశు సంక్షేమానికి ప్రభుత్వంచేయూతనందిస్తోందని ప్రతి రైతు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో క్షత్రియ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ అద్దేపల్లి ప్రతాప్ రాజు, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు జంగం శెట్టి సుబ్బయ్య,మండల క్లస్టర్ ఇంచార్జ్ పసుపులేటి ప్రవీణ్ కుమార్,రాజంపేట మండల అధ్యక్షులు గన్నె సుబ్బ నరసయ్య నాయుడు, టిడిపి నాయకులు గంటా గోపి,ఎం.పీ రావు, నారపుశెట్టి శివ,ఆడపూరు నరేష్ నాయుడు,కొండూరు దిలీప్, కొవ్వూరు సుబ్రహ్మణ్యం నాయుడు, సింగన పరశురాం నాయుడు, సతీష్ కుమార్ రాజు,పులపుత్తూరు మల్లికార్జున రాజు పెద్ద ఎత్తున గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఆరు గ్యారెంటీల అమలుపై కాంగ్రెస్ నాయకులని నిలదీయండి: నవాబుపేట్ మండల

# బి ఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు అంతనోల్ల దయాకర్ రెడ్డి ..!!



వికారాబాద్ జిల్లా ప్రతినిధి : నవాబుపేట్ (జనం రిపోర్టర్ ):వికారాబాద్ జిల్లా పరిధిలోని నవాబుపేట్ మండల కేంద్రంలోనిబి ఆర్ఎస్ పార్టీ కార్యాలయ ఆవరణలో మండల పార్టీ నాయకుల ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించిన నవాబుపేట్ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు అంతనోల్ల దయాకర్ రెడ్డి ఆధ్వర్యంలో షాబాద్ మండల కేంద్రంలోని రైతులకు అన్ని విధాల ఆదుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉండే విధంగా చూడాలని తెలంగాణ రాష్ట్ర టిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రంగారెడ్డి జిల్లాలోని షాబాద్ మండల కేంద్రంలోని రైతులను ఆదర్శంగా తీర్చిదిద్దే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేయాలని లేని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించుతామని కేటీఆర్ అన్నారు. నవాబుపేట మండల బి ఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు అంతనుల దాక రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా అనేక రకరకాలుగా కానీ పోనీ మాటలు చెప్పి తెలంగాణ రాష్ట్ర ప్రజలను అన్నదొక విధంగా కాంగ్రెస్ పార్టీ పని చేస్తుందని దాకా రెడ్డి అన్నారు. ఎలక్షన్





మూమెంట్లో ఇచ్చిన హామీలు ఎక్కడ ఆరు గ్యారంటీలను అమలు చేసి తెలంగాణ రాష్ట్రాన్ని తీర్చి దిద్దుతామని అన్న రేవంత్ రెడ్డి, ఎక్కడ అని నీకు తెలంగాణ రాష్ట్రం మీద మానవత్వం ఉంటే ఇచ్చిన ఆరు గంటను అమలు చేసి తీర్చి దిద్దిన వాడనని చెప్పుకోవాలని దయాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఒక సంవత్సరం శుభ సందర్భంగా ఎలాంటి ప్రజలకు లావా దేవాలయం లేకుండా ప్రజలను అనగదొక్క విధంగా కాంగ్రెస్ పార్టీ పని చేస్తుందని ఆయన అన్నారు. గ్రామాలలోషరతులు లేకుండా రుణమాఫీ చేయడంతో పాటు రైతు భరోసా క్రింద ఎకరానికి 15,000/- రూపాయలు రైతులకు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ చలో షాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న శుభ సందర్భంగా నవాబుపేట మండల బి ఆర్ఎస్ పార్టీ నాయకులు 400 మంది బయలుదేరిన శుభ సందర్భంగా ఈరోజు చేవెళ్ల నియోజకవర్గం షాబాద్లో జరగిన రైతు ధర్నా కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్,మాజీ మంత్రివర్యులు సబితా ఇంద్రా రెడ్డి , శ్రీనివాస్ రెడ్డి , మహమూద్ ఆలీ ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి , ఎమ్మెల్యేపాడి కౌశిక్ రెడ్డి , మాజీ ఎమ్మెల్యే నరేందర్ రెడ్డి , మహేష్ రెడ్డి , మాజీ ఐపీఎస్ ప్రవీణ్ కుమార్ మరియు బి ఆర్ యస్ రాష్ట్ర నాయకులతో కలిసి పాల్గొన్న వికారాబాద్ జిల్లా బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ ఈ కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ గణపురం శాంతి కుమార్, మండల ప్రధాన కార్యదర్శి పోలీస్ మహేశ్వర్ రెడ్డి, విజయ్ కుమార్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు రాజు, విద్యార్థి విభాగం అధ్యక్షుడు అనిల్ కుమార్, మాణిక్ రెడ్డి,మాట్లాడుతూ వెంటనే రైతులందరికి ఎలాంటి శరుతులు లేకుండా రుణమాఫీ చేసి, రైతు భరోసా క్రింద ఎకరానికి 15,000/- రూపాయలు రైతులకు ఇవ్వాలి.6 గ్యారంటీల పేర్లతో సంవత్సర క్రితం ప్రతి ఇంటికి వెళ్లి అడిగిమరీ అన్ని వివరాలు తీసుకున్న ఈ కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ కొత్తగా ఇందిరమ్మ ఇళ్ల పేరిట వివరాలు ఎందుకు సేకరిస్తుంది?గతంలో ప్రజల వద్ద తీసుకున్న వివరాలు ఏమయ్యాయి?స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తుండటం తో ప్రజలను మళ్ళీ మభ్యపెట్టి వచ్చే ఎలక్షన్లో లబ్ధి పొందాలనె ప్రయత్నం కోసం మాత్రమే వివరాలు సేకరిస్తున్నారు తప్ప వాస్తవానికి ప్రజా సమస్యల పైన కాంగ్రెస్ ప్రభుత్వానికి అవగాహన లేదు, ప్రజా సమస్యలు తీర్చాలనే చిత్తశుద్ధి అసలే లేదు.వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలో ఓట్ల కోసం మీ ఇంటి ముందుకు వచ్చే ఈ కాంగ్రెస్ నాయకులని 6 గ్యారంటీల అమలుపై నిలదీయండి.

## గెలుపు - ఓటములను సమానంగా స్వీకరించాలి

### తెదేపా పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్ మోహన్ రాజు



నందలూరు, (జనం రిపోర్టర్ ):క్రీడలలో గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించాలని, గెలుపు ఆనందాన్ని ఇస్తే, ఓటమి రాబోయే గెలుపుకు బాటలు వేస్తుందని తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్ మోహన్ రాజు తెలియజేశారు.శుక్రవారం టీ.వీ పురం గ్రామంలో నిర్వహించిన క్రికెట్ పోటీలలో గెలుపొందిన జట్లకు ఆయన బహుమతులు అందజేశారు. రసవత్తరంగా జరిగిన ఫైనల్ మ్యాచ్లో టీవీ పురం,చింతకాయల పల్లె క్రికెట్ జట్లు తలపడగా చింతకాయల పల్లి జట్టు విజేతగా నిలిచింది. టీ.వీ పురం జట్టు రన్నర్స్ గా నిలిచారు. మ్యాన్ ఆఫ్ ది సిరీస్ జాఫర్,మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ రమణ అందుకున్నారు. ఫైనల్ విజేతలకు కప్పు, 20 వేల రూపాయలు, రన్నర్స్ జట్టుకు కప్పు, పదివేల రూపాయల బహుమతుల ను జగన్ మోహన్ రాజు చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో క్షత్రియ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ అద్దేపల్లి ప్రతాప్ రాజు,మండల పార్టీ అధ్యక్షులు జంగం శెట్టి సుబ్బయ్య, టిడిపి నాయకులు పసుపులేటి ప్రవీణ్ కుమార్, గన్నె సుబ్బ నరసయ్య నాయుడు,గంటా గోపి,ఎం.పీ రావు, నారపుశెట్టి శివ,ఆడపూరు నరేష్ నాయుడు,కొండూరు దిలీప్, క్రికెట్ ఆర్గనైజర్లు శీను,భరత్,చందు,రవి, గ్రామ పెద్దలు గోపాల్ రాజు మోహన్ రాజు, బాలరాజు, సురేంద్ర, భాస్కర్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

## రైల్వే ఇంజనీరింగ్ కార్మికుల ఆందోళన




నందలూరు,(జనం రిపోర్టర్ ):రైల్వే ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని స్థానిక మజ్దూర్ యూనియన్ సెక్రటరీ విశ్వనాథ్ డిమాండ్ చేశారు. ఎస్ సి ఆర్ ఎం యు జనరల్ సెక్రటరీ కామ్రేడ్ శంకర్ రావు పిలుపు మేరకు ఇంజనీరింగ్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కొరకు శుక్రవారం స్థానిక ఇంజనీరింగ్ కార్యాలయం ఎదుట ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వనాథ్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కొరకు ఈనెల 24 వ తేదీన గుంతకల్ లోని డిఆర్ఎం కార్యాలయం ఎదుట వచ్చేనెల 5వ తేదీన సికింద్రాబాద్ లోని జి ఎం కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు.ధర్నాకు ప్రధాన డిమాండ్లు, ట్రాక్ మెయింటెయినర్స్ యొక్క అన్ని ఖాళీలను వెంటనే భర్తీ చేయడం, అదనపు పోస్టుల సృష్టించాలని అన్నారు. ఉమెన్ ట్రాక్ మెయింటెయినర్లను వేరే డిపార్ట్మెంట్ లకు పంపించాలన్నారు. ట్రాక్ మెయింటెయినర్ల డ్యూటీ రోస్టర్ రెండు షిఫ్టులుగా ఉండాలన్నారు.ట్రాక్ మెయింటెయినర్లకు పనిభారం తగ్గించాలన్నారు.అన్ని పి.వే యూనిట్లలో గ్యాంగ్ హట్స్ ఏర్పాటు చేయాలని, కీమెన్ ల పనిభారం తగ్గించాలని తెలిపారు. ఎస్ ఎస్ ఈ/ పి. వే పోస్టులను డీసెంట్రాల్జిషన్ చేయాలని, జే ఈ/ పి. వే పోస్టులను రాత పరీక్ష లేకుండా భర్తీ చేయాలన్నారు. 16-2/3% కోటా తో అన్ని డిపార్ట్మెంట్లలోని ట్రాక్ మెయింటెయినర్ల కోసం మాత్రమే భర్తీ చేయాలని , పురోగతి కోసం అన్ని విభాగాల ఏ వి సి ని సక్రమంగా సవరించడం కోసం ఎల్ డి సి ఈ ద్వారా అన్ని డీపార్ట్మెంట్ లలో అందరికి అవకాశం కల్పించాలన్నారు. గ్రూప్'డి' రిక్రూట్మెంట్ అంతా ట్రాక్ మెయింటెయినర్స్ కేటగిరీ మాత్రమే అయి ఉండాలని, ప్రమోషన్ ద్వారా ట్రాక్ మెన్ లకు రూ.4200/- రూ.4600/ గ్రేడ్ పే పొందే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మజ్దూర్ యూనియన్ స్థానిక బ్రాంచ్ అసిస్టెంట్ సెక్రటరీస్ ప్రకాశం, సిద్దయ్య, వైస్ చైర్మన్ లు బి. వి. ఎస్.కె.రాజు,యన్.నరసింహులు ఆర్గనైజింగ్ సెక్రటరీ లు పీరయ్య, షేక్ షా వల్లి, బాల సుబ్రమణ్యం,శ్రీ హర్ష,అశోక్,సుదర్శన్,శ్రీనాథ్ మొదలగు కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని ధర్నాను విజయవంతం చేసినారు.

## క్రీడాకారులకు పోలీస్ క్రీడారుల క్రీడా ప్రదర్శన స్ఫూర్తిగా కావాలి

### - వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా,ఐపీఎస్



వరంగల్ (జనం రిపోర్టర్ ):పోలీస్ విధి నిర్వహణలో ఎన్ని ఒత్తిళ్ళు ఉన్నా క్రీడల్లో రాణిస్తున్న పోలీసులు ఇతర క్రీడాకారులకు పోలీస్ క్రీడాకారులు క్రీడా ప్రదర్శన స్ఫూర్తిగా నిలవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ మూడవ స్పోర్ట్ అండ్ గేమ్స్ మీట్ 2025 ను వరంగల్ పోలీస్ కమిషనర్ శుక్రవారం ప్రారంభించారు. నేటి నుండి మూడు రోజుల పాటు హనుమకొండలోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో జరుగుతున్న ఈ పోలీస్ క్రీడల్లో తొలి రోజు ప్రారంభోత్సవ కార్యక్రమానికి వరంగల్ పోలీస్ కమిషనర్ ముఖ్య అతిథిగా హజరయి క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీస్ క్రీడాకారులు నిర్వహించిన మార్చ్ఫాస్ట్ను నిర్వహించగా, క్రీడలు నిర్వహిస్తున్న మైదానంలో పోలీస్ కమిషనర్ క్రీడా జెండాను ఎగురవేయడంతో పాటు, అకాశంలోకి పావురాలను, బెలూన్లను ఎగురవేయగా పోలీస్ క్రీడాకారులు తీసుకవచ్చిన క్రీడా జ్యోతిని పోలీస్ కమిషనర్కు అందజేసారు. ఈ క్రీడల ప్రారంభోత్సవం సందర్భంగా పురుషుల, మహిళలకు ఏర్పాటు చేసిన ఎనిమిది వందల మీటర్ల పరుగు పోటీలతో , వాలీబాల్ క్రీడలను వరంగల్ పోలీస్ కమిషనర్ ప్రారంభించారు.అనంతరం పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ముందుగా ఈ క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొన్న క్రీడాకారులతో పాటు, క్రీడల నిర్వహణాధికారులను పోలీస్ కమిషనర్ అభినందనలు తెలుపుతూ మూడు రోజుల పాటు నిర్వహించే ఈ క్రీడల్లో వరంగల్ పోలీస్ కమిషనరేట్కు సంబంధించిన మూడు జోన్లతో పాటు మొత్తం ఆరు జట్లు 12 క్రీడాంశాల్లో పోలీస్ క్రీడాకారులు పోటీ పడుతారని ఈ క్రీడల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు త్వరలో జరిగే రాష్ట్రస్థాయి క్రీడల్లో పాల్గొనాల్సి వుంటుందని, క్రీడల్లో గెలుపు ఓటములు ముఖ్యం కాదని, క్రీడల్లో ప్రతిభ కనబరచటం ముఖ్యమని, ఈ క్రీడల ద్వారా మీ శారీరక దారుఢ్యం పెరగడంతో పాటు, పనిఒత్తిళ్ళను అధిగమించి ఆరోగ్యంగా వుంటారని పోలీస్ కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమములో డిసిపిలు రవీందర్, రాజమహేంద్రనాయక్, అదనపు డిసిపిలు రవి, సురేష్కుమార్, జనగామ ఏఎస్పి పండరీ చేతన్ నితిన్తో పాటు ఎసిపిలు, ఇన్స్పెక్టర్లు, ఆర్.ఐలు, ఆర్.ఎస్.ఐలు, ఎస్.ఐలతో పాటు ఇతర పోలీస్ సిబ్బంది ఈ క్రీడల్లో ఉత్సహంగా పాల్గొన్నారు.





## శ్రీ గురుదేవ చారిటబుల్ ట్రస్ట్ వారి అద్వర్యం లో




విజయనగరం జిల్లా కొత్తవలస (జనం రిపోర్టర్ ):శ్రీ గురుదేవ చారిటబుల్ ట్రస్ట్ వారి అద్వర్యం లో నేడు విజయశ్రీ ఉప్పలపాటి మెమోరియల్ క్యాన్సర్ హాస్పిటల్ భవనం సందరిసంచటానికి మరియు కృత్రిమ అవయవాలు పంపిణి కార్యక్రమం జరుపటానికి ముఖ్య అతిధులు గా శ్రీ. %చీ%. ఇంద్ర సేన రెడ్డి (గవర్నర్ ఆఫ్ త్రిపుర) గారు,. ఎస్. మళ్ళ రెడ్డి (బీజేపీ తెలంగాణ స్టేట్ ఎక్స్. వైస్ ప్రెసిడెంట్ %ఱ% ఎక్స్. డైరెక్టర్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ ) గారు, శ్రీ. సీతంరాజు సుధాకర్ (ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్, %ణతీ%. ఎన్ టి ఆర్ వైద్య సేవ ట్రస్ట్ )గారు, పి వి ఎన్ మాధవ్ (ఎక్స్. ఎం ల్ సి) గారు, రత్నాకర్ గారు (వి యు ఎమ్ సి హాస్పిటల్ ), శ్రీ. రాపర్తి జగదీశ్ కుమార్ గారు ( శ్రీ గురుదేవ చారిటబుల్ ట్రస్ట్ శ్రీ గురుదేవ హాస్పిటల్ చైర్మన్ )గారు, డి. సీతల వర్మ గారు (మెడికల్ ఆఫీసర్, పి హెచ్ సి కొత్తవలస ) గారు విచ్చేసారు.వీరు ముందు గా నూతనంగా నిర్మించిన %ణతీ%. విజయశ్రీ ఉప్పలపాటి మెమోరియల్ క్యాన్సర్ హాస్పిటల్ ని సందర్శించి ఘనంగా ప్రారంభించారు. అనంతరం అతిధులు మాట్లాడుతూ ఇలాంటి క్యాన్సర్ హాస్పిటల్ ను నిర్మించాడానికి క్యాన్సర్ రోగులకు అతి తక్కువ ఖర్చుతో కార్పొరేట్ హాస్పిటల్ లో కంటే కూడా ఎక్కువ సౌకర్యాలు కల్పించడం చూసి చైర్మన్ గారిని కొనియాడారు. అనంతరం ట్రస్ట్ ద్వారా 30 మందికి పైగా దివ్యాంగుల కు ఉచిత కృత్రిమ అవయవాలు వీల్ ఛైర్స్, చంక కర్రలు చెవిటి మెషిన్లు. ఆంధులకు పెన్షన్లు, ముసలి వాళ్ళ కి రేషన్ ఇవ్వటం జరిగింది.మరియు 100 మందికి పైగా అంధులు కు పెన్షన్ ఇవ్వటం జరిగింది.ఈ సేవ కార్యక్రమం లు ను శ్రీ రాపర్తి జగదీశ్ కుమార్ గారు ను ( శ్రీ గురుదేవ చారిటబుల్ ట్రస్ట్ శ్రీ గురుదేవ హాస్పిటల్ చైర్మన్ ) కొనియాడారు. ఈ కార్యక్రమం లో ట్రస్ట్ చైర్మన్ రాపర్తి జగదీష్ కుమార్ గారు,. ఫణీంద్ర గారు ( శ్రీ గురుదేవ చారిటబుల్ ట్రస్ట్ %ఱ% శ్రీ గురుదేవ హాస్పిటల్ వైస్ చైర్మన్ ), ట్రస్ట్ మరియు హాస్పిటల్ బృందం పాల్గొన్నారు.

## బదిలీపై వెళ్తున్న కానిస్టేబుల్ ఆకుల రవీందర్ పటేల్ కు సన్మానం



వరంగల్ : జనవరి 17,జనం రిపోర్టర్: నల్లబెల్లి మండల పరిధిలోని పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న ఆకుల రవీందర్ బదిలీపై పరకాల పోలీస్ స్టేషన్ కు వెళ్తున్న సందర్భంగా నల్లబెల్లి ఎస్సై వి.గోవర్ధన్ ఆధ్వర్యంలో మండల మున్నూరు కాపు కుల సోదరులు అతనికి సన్మానం చేసి అభినందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నల్లబెల్లి మున్నూరు కాపుమండల కోఆర్డినేటర్ మేడిపేల్లి సుధాకర్,





మున్నూరు కాపు మండల అధ్యక్షుడు కస్తూరి రవీందర్, కార్యదర్శి కొలగానీ రామారావు, జిల్లా కమిటీ మెంబర్ ఆకుల మధు,ఆకుల సంబరావు, జంగిలి శంకరయ్య, ఐత మ్ నాగరాజు, కొలగాని లక్ష్మయ్య, తోట రత్నాకర్, జంగిలిమోహన్, మాజీ ఉప సర్పంచ్ కక్కేర్ల శ్రీను గౌడ్, ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు రొట్టె సురేష్, వల్లే రమేష్ వివిధ సంఘాల కుల పెద్దలు, మీడియా మిత్రులు తదితరులు కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.

## ఆయిశెట్టి సీతారామయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలలో భాగంగా భారీగా అన్నదాన కార్యక్రమం.



గుంటూరు(జనం రిపోర్టర్): గుంటూరు పట్టణం తూర్పు నియోజకవర్గం నెహ్రూ నగర్ 56వ డివిజన్ కార్పొరేటర్ ఆయి శెట్టి కనకదుర్గ శ్రీనివాస్ (మార్కెట్ శ్రీను) గార్లు ఆయి శెట్టి సీతారామయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నెహ్రూ నగర్ ఆరవ లైన్ లో జనవరి ఒకటవ తారీఖు నుండి ఘనంగా నిర్వహించబడుతున్నాయి.శ్రీ శ్రీ శ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి వారి ఆశీస్సులతో శ్రీమాన్ వింజమూరి ఆకాష్ శ్రీనివాసచార్యులు వేద పండితులు గారి పర్యవేక్షణలో శ్రీ రంగనాయకి శ్రీ గోదా దేవి సహిత శ్రీ రంగనాథ స్వామి వారి ధనుర్మాస పూజలకు ఈనెల ఒకటవ తారీఖు నుండి 18వ తారీకు వరకు నిత్య కార్యక్రమాలు జరుగును. ప్రజలందరూ ఆయురారోగ్యంగా,సుఖ సంతోషాలతో ఉండాలని స్వామి వార్ల ఆధ్వర్యంలో పూజలు,యాగాలు, హెూమాలు నిర్వహిస్తున్నారు.ఈ సంక్రాంతి సంబరాల కార్యక్రమంలో భాగంగా భారీగా అన్నదానం కార్యక్రమం నిర్వహించడం జరిగింది.సుమారు 5000 మంది కి అన్నదాన కార్యక్రమం జరిగింది.కార్పొరేటర్ ఆయిశెట్టి కనక దుర్గ శ్రీనివాస్ గార్ల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలను గత 15 రోజుల నుండి స్వామి వారి కి ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ, ప్రజలకు మంచి జరగాలని ఉద్దేశం తో యాగాలు,హెూమాలు నిర్వహిస్తున్న కార్పొరేటర్ దంపతులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపినారు. ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడానికి ఎంతో వ్యయంతో కూడిన సరే వెనకడుగు వేయకుండా గత కొన్ని సంవత్సరముల నుండి ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్న కార్పొరేటర్ దంపతులు చాలా గొప్ప వారని ప్రజలు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు, కార్యకర్తలు,అభిమానులు,పట్టణ ప్రజలు,ఆయిశెట్టి చారిటబుల్ ట్రస్ట్ కమిటీ వారు పాల్గొని ఈ కార్యక్రమం ను భారీగా విజయవంతం చేశారు.

## అమిత్ షా పర్యటనను వ్యతిరేకిస్తూ ఈనెల 19న రాష్ట్రవ్యాప్త నిరసనలు

విజయవాడ : అంబేద్కర్ పై వ్యాఖ్యలను నిరసిస్తూ అమిత్‌షా పర్యటనను వ్యతిరేకించాలని, ఈనెల 19న రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టనున్న నిరసనలను జయప్రదం చేయాలని వామపక్ష పార్టీలు పిలుపునిచ్చాయి. దీనికి సంబంధించిన ఓ ప్రకటనను శుక్రవారం వామపక్ష పార్టీల నేతలు విడుదల చేశారు. భారత రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్‌పై రాజ్యసభలో అవమానకరమైన, అప్రతిష్టాకరమైన వ్యాఖ్యలు చేసిన కేంద్ర హెూం మంత్రి అమిత్‌షా విజయవాడ పర్యటన వ్యతిరేకిస్తూ జనవరి 19న రాష్ట్ర వ్యాపితంగా నిరసనలకు వామపక్ష పార్టీలు పిలుపునిస్తున్నాయన్నారు. అంబేద్కర్‌ను అభిమానించేవారిని ఎగతాళి చేస్తూ, అంబేద్కర్ జపం చేయడం ఫ్యాషన్‌గా మారిందనీ, ఆ జపం ఏదో దేవుడిని తలుచుకుంటే స్వర్గమన్నా వచ్చేదంటూ అత్యంత అభ్యంతరకరమైన అమిత్ షా వ్యాఖ్యలపై దేశ వ్యాపితంగా ఆగ్రహావేశాలు పెల్లుబికినా, నిరసనలు వెల్లువెత్తినా కేంద్ర బిజెపి వైఖరిలో మార్పులేదని ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. అన్ని తరగతుల, వర్గాల ప్రజానీకం, సామాజిక, ప్రజాసంఘాలు బిజెపి కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఎండగట్టాలని కోరారు. ఈనెల 19న చేపట్టనున్న నిరసనకు ప్రజలు తమ మద్దతునిచ్చి పాల్గొనాలని, జయప్రదం చేయాలని వామపక్ష నేతలు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(యం) రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సిపిఐ(యంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు వై.సాంబశివరావు, సిపిఐ(యంఎల్) నేత జాస్తి కిషోర్‌బాబు, యంసిపిఐ(యు) నాయకులు కాటం నాగభూషణం, సిపిఐ(యంఎల్) లిబరేషన్ నేత యన్.మూర్తి, ఫార్వర్డ్‌బ్లాక్ లీడర్ పి.వి.సుందరరామరాజు, రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ నేత జానకి రాములు పాల్గొన్నారు.

## కీలక నిర్ణయాలు తీసుకున్న ఏపీ కేబినెట్

అమరావతి : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరుగుతోన్న ఆంధ్రప్రదేశ్ కేబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం లభించింది. ధాన్యం కొనుగోలు కోసం 700 కోట్ల రూపాయల రుణం తీసుకునేందుకు ఏపీ మార్క్‌ఫెడ్‌కు ప్రభుత్వ హామీ ప్రతిపాదనపై కేబినెట్ అనుమతి ఇచ్చింది. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగవ్యవస్థపై చర్చించనుంది. ఇక, 62 నియోజకవర్గాల్లో అన్న క్యాంటీన్ల ఏర్పాటుకు సంబంధించి నిర్ణయం కేబినెట్ నిర్ణయం తీసుకోనుంది. మరోవైపు.. ఫెర్రో అల్లాయ్స్ పరిశ్రమలకు ఎలక్ట్రిసిటీ డ్యూటీ టారిఫ్ తగ్గింపు ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదం తెలిపింది. నాగావళి నదిపై గౌతు లచ్చన్న తోటపల్లి బ్యారేజ్ పై కుడి, ఎడమ వైపు మిని హైడల్ ప్రాజెక్టుల నిర్మాణం ప్రతిపాదనకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కడప జిల్లా సీకే దిన్నె మండలంలో ఏపీ ఇండస్ట్రియల్ కారిడార్ ఇన్ఫ్రా కార్పొరేషన్ కు కేటాయించిన 2,595 ఎకరాల బదిలీకి స్టాంపు డ్యూటీ మినహాయింపు ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదం తెలిపింది. అభ్యంతరం లేని ఆక్రమిత స్థలాల క్రమబద్ధీకరణ ప్రతిపాదన పైనా కేబినెట్ లో చర్చించనున్నారు. వైసీపీ హయాంలో దాదాపు 7 లక్షల ఎకరాల భూములు నిషేధిత జాబితా నుంచి తొలగించగా.. దీనిపై అధ్యయనం చేసి ఆయా భూములను ఏం చేయాలన్న దానిపై కేబినెట్ సబ్ కమిటీ ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనుంది.

## ఖేల్‌రత్న పురస్కారాలను ప్రదానం చేసిన రాష్ట్రపతి

న్యూఢిల్లీ : భారత అత్యున్నత క్రీడాపురస్కారం మేజర్ ఖేల్ రత్నను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రదానం చేశారు. శుక్రవారం రాష్ట్రపతి భవన్‌లో అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. షూటింగ్‌లో డబుల్ ఒలింపిక్ పతకాలను గెలుచుకున్న మనుబాకర్, ప్రపంచ చెస్ చాంపియన్ గుకేష్, హాకీ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్, పారా అథ్లెట్ ప్రవీణ్‌కుమార్‌లు రాష్ట్రపతి నుండి ప్రతిష్టాత్మకమైన ఖేల్ రత్న అవార్డులను అందుకున్నారు. వీరితో పాటు 32 మంది అథ్లెట్లను అర్జున అవార్డుతో సత్కరించారు. వీరిలో 17 మంది పారాఅథ్లెట్లు కావడం విశేషం. ఐదుగురు ద్రోణాచార్య పురస్కారాలును అందుకున్నారు. పారిస్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించిన రెజ్లర్ అమన్ సెహ్రావత్, షూటర్లు స్వప్నిల్ కుసాలే, సరబ్జోత్ సింగ్, పురుషుల హాకీ క్రీడాకారులు జర్మన్ ప్రీత్ సింగ్, సుఖ్‌జీత్ సింగ్, సంజరు అభిషేక్ సహా పలువురు క్రీడాకారులు అర్జున అవార్డులను అందుకున్నారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన క్రీడాకారిణులు జివాంజి దీప్తి (పారాఅథ్లెటిక్స్), జ్యోతి యర్రాజీ (అథ్లెటిక్స్) అర్జున పురస్కారాలను స్వీకరించారు. 2014నుంచి అథ్లెటిక్స్‌లో ప్రాతినిధ్యం వహిస్తున్న జ్యోతి.. 2019లో తొలిసారి జాతీయ అండర్-18 మహిళల హర్డిల్స్‌లో స్వర్ణ పతకం కైవసం చేసుకొని అందరి దృష్టిని ఆకర్షించింది. 2022 ఆసియా క్రీడల్లో 100మీ. హార్డిల్స్‌లో రజత పతకం సాధించి పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించింది. 2024 పారిస్ ఒలింపిక్స్ 100మీ. హర్డిల్స్‌లో భారత్‌నుంచి ప్రాతినిధ్యం వహించిన ఏకైక మహిళా అథ్లెట్‌గా జ్యోతి యర్రాజి చరిత్ర సృష్టించారు. పారిస్ పారా ఒలింపిక్స్‌లో మహిళల 400మీ. 20 విభాగంలో దీప్తి కాంస్యం సాధించింది. 55.82 సెకన్లలో లక్ష్యాన్ని చేరుకుని ఈ ఫీట్ సాధించింది.

## తప్పిపోయిన నలుగురు చిన్న పిల్లలను గంట వ్యవధిలోనే పట్టుకొన్న పోలీసులు





జనం న్యూస్ నార్పల: పెద్దవడుగూరు గ్రామం %ాజ% కాలనీ కి చెందిన అంగన్వాడీ టీచర్ గా పని చేయు విజయశ్రీ, వయస్సు 39 సంవత్సరాలు, భర్త పేరు ఖాసీం వలి అను మహిళ తన పిల్లలు అయిన చిన్న మహమ్మద్ తబ్రెజ్, 6 సంవత్సరాలు, కూతురు మమ్మీ 4 సంవత్సరాలు, చిన్న కూతురు శాన్వి 1½ సంవత్సరాలు లతో అదే గ్రామానికి చెందిన ఎస్‌సి కాలనీ కి చెందిన పిల్లలు బాలాజీ 12 సంవత్సరాలు, సూరి బాబు 12 సంవత్సరాలు మరియు శివరాం 13 సంవత్సరాలు లతో కలిసి 17.01.2025 వ తేదీన ఉదయం 10 గంటలపుడు అనంతపురము లోని నేషనల్ పార్క్ కి వెళ్లాలని వారి గ్రామము నుండి తన స్కూటీ లో బయలుదేరి కల్లూరు క్రాస్ దగ్గరికి ఉదయం 11 గంటలకు చెరి అక్కడి నుండి గుత్తి వైపు నుండి అనంతపురము వైపు వెళ్ళు గుర్తు తెలియని కార్ లో తన పిల్లలు అయిన 1) మహమ్మద్ తబ్రెజ్, 6 %ఎతేం%, 2) కూతురు మమ్మీ 4 %ఎతేం% లతో పాటు 3) బాలాజీ 12 %ఎతేం%, 4) సూరి బాబు 12 వై ఆర్ ఎస్, లను ఎక్కించి సదరు కార్ డ్రైవరు తో అనంతపురము నందు వదలమని చెప్పి పంపి విజయశ్రీ తన స్కూటీ లో తన చిన్న కూతురు శాన్వి మరియు శివరాం తో కలిసి వెనకాల బయలుదేరి వెళ్ళినది. తిరిగి అనంతపురము చెరీ తన పిల్లల గురించి చుట్టూ ప్రక్కల ప్రాంతాలలో వెతకగా వారి ఆచూకీ దొరకలేదు. సదరు విషయం పై గార్లదిన్నే పోలీసు స్టేషన్ చేరుకొని నలుగురు, పిల్లలు కనపడలేదని ఫిర్యాదు చేయగా వెంటనే గార్లదిన్నే పోలీసు స్టేషన్ సబ్-ఇన్స్పెక్టర్ అయిన శ్రీ గౌస్ మహమ్మద్ బాష , తన పై అధికారులకు సదరు విషయమును తెలిపి దర్యాప్తు ప్రారంభించినారు.

దర్యాప్తు జరిగిన విధానం: ఈ విషయం లో అనంతపురము జిల్లా ఎస్ పి, అయిన శ్రీ పి.జగదీష్ ఉత్తర్వులు మేరకు, అనంతపురము రూరల్ ఎస్ డి పి ఓ, అయిన పి టి.వెంకటేష్ పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి అనంతపురము నగరము మరియు జిల్లా అంతటా వి హెచ్ ఎఫ్, సెట్ లో సిబ్బందిని అలెర్ట్ చేసి వెంటనే వెహికల్ చెకింగ్ ప్రారంభించమని ఆదేశించగా వెహికల్ చెకింగ్ లో భాగంగా పామిడి సీఐ, అయిన శ్రీ వి.యుగంధర్ మరియు వారి సిబ్బంది సదరు పిల్లలను పామిడి టౌన్ హైవే రోడ్డు స్పీడ్ బ్రేకర్స్ వద్ద ఆటో లో ప్రయాణిస్తున్న పిల్లలను గుర్తించి సదరు ఆటో ని ఆపి నాలుగురు, పిల్లల్ని పామిడి పోలీసు స్టేషన్ కి తీసుకొని రావడం జరిగినది. తరువాత పిల్లల తల్లి తల్లితండ్రులకు విషయమును తెలియపరిచి వారు స్టేషన్ కి వచ్చిన తరువాత పిల్లల్ని వారికి అప్పగించడం జరిగినది.

ఇందులో పాల్గొన్న ప్రత్యేక బృందాలు

1. జి.కౌలుట్లయ్య, సీఐ,సింగనమల సర్కిల్. 2. యుగంధర్, సీఐ, పామిడి. 3. ఎన్.శేఖర్, సీఐ,, అనంతపురము రూరల్ సర్కిల్. 4. క్రాంతి కుమార్, ఎస్ బి, ఇన్స్పెక్టర్, అనంతపురము. 5. జాకీర్, సీఐ, సైబర్ క్రైమ్. 6. గౌస్ మహమ్మద్ బాష, ఎస్సై, గార్లదిన్నే పిఎస్,. 7. విజయ్ కుమార్, ఎస్సై, ఇటుకలపల్లి పిఎస్,. 8. రాంబాబు, ఎస్సై అనంతపురము రూరల్ పిఎస్. 9. రవి ప్రసాద్, ఎస్సై,పామిడి పి ఎస్. 10.శ్రీ ఎం సి.నరసింహులు, ఎస్ బి,హెచ్సి గార్లదిన్నే, ఎం.రామాంజినేయులు, హెచ్ సి, పామిడి మరియు పి.నాగార్జున ఎస్బిఐ పిసి, పామిడి మరియు బి .నరేశ్, పిసి, గార్లదిన్నే, ఓ.కృష్ణ, పిసి, గార్లదిన్నే. ప్రశంస: పై ప్రత్యేక బృందాలను జిల్లా ఎస్ పి, అయిన శ్రీ పి పి.జగదీష్, ఐపీఎస్., అభినందించడం జరిగినది.

## విద్యార్హతల కన్నా నైపుణ్యమే మిన్న




దేశంలో రానున్న ఐదేళ్లలో ఉద్యోగాల స్వరూపమే అనూహ్యంగా మారిపోయే పరిణామాలు కనిపిస్తున్నాయి. ఇదివరకు డిగ్రీలుంటేకానీ సరైన ఉద్యోగాలు రాని పరిస్థితి ఉండగా, ఇప్పుడు సాంకేతిక నైపుణ్యం ముందు డిగ్రీలు చిన్నబోతున్నాయి.దేశంలో ఎఐ(కృత్రిమ మేధ) నైపుణ్యాలకు డిమాండ్ పెరుగుతోంది. ప్రపంచ స్థాయిలో 88% వరకు ఎఐ ప్రోగ్రాములు అమలవుతుండగా, భారతీయ సంస్థలు 96% వరకు ఎఐ ప్రోగ్రాములు అమలు చేస్తున్నాయి. ఉత్పాదక ఆధారిత ఎఐ శిక్షణ నమోదులో అమెరికా, భారత్ దేశాలు ముందుండడంతో ప్రపంచ వ్యాప్తంగా ఎఐ నైపుణ్యాలకు డిమాండ్ పెరిగింది. జనరల్ ఎఐ శిక్షణను పెంచడంలో కార్పొరేట్ సంస్థలు ముందుంటున్నాయి. ఈ కార్పొరేట్ సంస్థలకు ప్రపంచ వ్యాప్తంగా 14 మిలియన్ల కన్నా ఎక్కువ మంది ఉద్యోగులు ఉన్నారు. జనరల్ ఎఐ వినియోగం ప్రస్తుతం అన్ని రంగాల్లో పెరుగుతోంది. అందుబాటులో ఉన్న సమాచారాన్ని వినియోగించుకుని సరికొత్త చిత్రాలు, పాఠ్యాంశాలు, సంగీతం తదితర అంశాలను సృజించే వ్యవస్థలను జనరేటివ్ ఎఐగా వ్యవహరిస్తున్నారు.గత ఐదేళ్లలో ప్రపంచస్థాయిలో జనరేటివ్ ఎఐపై పెట్టుబడులు భారీగా పెరిగాయి. 2019లో 88.2 కోట్ల డాలర్లు పెట్టుబడులు పెట్టగా, 2020లో 218 కోట్ల డాలర్లు, 2021లో 417 కోట్ల డాలర్లు, 2022 లో 264 కోట్ల డాలర్లు, 2023లో 2243 కోట్ల డాలర్ల వరకు పెట్టుబడులు పెరిగాయి. ఎఐ నైపుణ్యానికి సంబంధించి దేశంలో 67% కంపెనీలు కొత్త విభిన్న నైపుణ్య ప్రతిభపై దృష్టి సారిస్తున్నాయి. 30% కంపెనీలు డిగ్రీ షరతులను తొలగించి నైపుణ్యాలకు ప్రాధాన్యం ఇస్తున్నాయి. 2030 నాటికి దేశంలో 17 కోట్ల కొత్త ఉద్యోగాలు సృష్టించబడగా, మరోవైపు 9.2 కోట్ల ఉద్యోగాలు కోల్పోవాల్సి వస్తుందని, అలాగే ప్రపంచంలో 170 మిలియన్ కొత్త ఉద్యోగాలు సృష్టించబడగా, 92 మిలియన్ ఉద్యోగాలు కోల్పోవడమవుతుందని వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ (డబ్లుఇఎఫ్) నివేదిక వెల్లడించింది. కొత్త టెక్నాలజీని అందిపుచ్చుకోవడంలో భారతీయ కంపెనీలు ప్రపంచాన్ని అధిగమించేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఎఐ, రోబోటిక్స్, ఎనర్జీ టెక్నాలజీ వంటి రంగాల్లో భారీగా పెట్టుబడులు పెడుతున్నాయి. 35% భారతీయ కంపెనీలు సెమీకండక్టర్లు, కంప్యూటింగ్ టెక్నాలజీ, తమ వ్యాపారాన్ని పూర్తిగా మార్చగలవని విశ్వసిస్తున్నాయి. 21శాతం కంపెనీలు క్యాంటం, ఎన్‌క్రిప్షన్ టెక్నాలజీలే ముఖ్యమైనవిగా భావిస్తున్నాయి. దేశంలో బిగ్‌డేటా, ఎఐ, మెషిన్‌లెర్నింగ్, సైబర్ నిర్వహణ వంటి ఉద్యోగాలు దేశంలో వృద్ధి చెందే అవకాశాలు కనిపిస్తున్నాయి. భారత దేశంలోని ఐటి రంగం ప్రస్తుతం 5.4 మిలియన్ మందికి ఉద్యోగాలు కల్పిస్తోంది. 2030 నాటికి ఈ సంఖ్యను 10 మిలియన్ వరకు రెట్టింపు చేయాలన్న టార్గెట్ ఉండగా, కేవలం 7.5 మిలియన్ వరకే సాధించగలమని ఆయా రంగ నిపుణులు చెబుతున్నారు. దీనికి కారణం ఎఐ విస్తరించడం వల్ల ఇప్పుడున్న ఉద్యోగాలు పోతాయన్న భయం వెంటాడుతుండడమే.ఐటి రంగం ఏటా 58 శాతం వరకు నిదానంగా వృద్ధి చెందుతుందని, 2027 సంవత్సరం నాటికి 6.2 మిలియన్ నుంచి 6.8 మిలియన్ ఉద్యోగాలు కల్పిస్తుందని అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం ఈ వృద్ధి అంతా డిజిటల్ సాంకేతికత వైపు దూసుకెళ్తోంది. ఎఐ, క్లౌడ్ కంప్యూటింగ్, ఆటోమేషన్ తదితర సాంకేతిక ప్రక్రియలు పారిశ్రామిక, వాణిజ్య సంస్థల ప్రోత్సాహంతో విస్తరిస్తున్నాయి. ఇది వరకటి 10 మిలియన్ ఉద్యోగాల టార్గెట్‌ను 7.5 మిలియన్ ఉద్యోగాలకు సవరించినప్పటికీ, ఉద్యోగాల రాశి కన్నా నైపుణ్యం, నాణ్యతలకు పట్టం కడుతున్నారు. ఎఐ, ఆటోమేషన్ వంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు ఉద్యోగాల నియామక ప్రక్రియలను క్రమబద్ధం చేస్తున్నాయి. ఈ మార్పులు, అత్యంత విలువైన సాంకేతిక సేవలు, నూతన ఆవిష్కరణల వైపు దేశాన్ని ముందుకు నడిపిస్తున్నాయి. ఈ ఆధునిక సాంకేతిక నైపుణ్య ప్రక్రియలను అందిపుచ్చుకోగలిగితేనే ఇప్పుడు ఉద్యోగాలు లభిస్తాయి. ఈ మేరకు ఉద్యోగ అవకాశాలు 80% వరకు సాంకేతిక నిపుణులతో 2025 26 నాటికి 20% వరకు పెరుగుతాయని ఐటి రంగ వర్గాలు పేర్కొంటున్నాయి. అత్యంత ఆధునిక సాంకేతికతల వల్ల 2030 నాటికి దేశంలో 150 బిలియన్ డాలర్ల వరకు ఆర్థిక ప్రయోజనం సిద్ధిస్తుందని అంచనా వేస్తున్నారు. జనరేటివ్ ఎఐ వంటి సాంకేతికతలే ఐటి రంగంలో 2030 నాటికి రెండు మిలియన్ల వరకు కొత్త ఉద్యోగాలను సృష్టిస్తాయని నివేదికల వల్ల తెలుస్తోంది. దేశంలో ప్రస్తుతం 1700 గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు (జిసిసి) ఉన్నాయి. వీటి వల్ల 1.9 మిలియన్ మంది ఉద్యోగాలు పొందుతున్నారు. 2030 నాటికి గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల సంఖ్య 2200 వరకు చేరుకుంటుందని, వాటి ద్వారా 2.5 మిలియన్ నుంచి 2.8 మిలియన్ వరకు ఉద్యోగాలు లభించే అవకాశాలు ఉన్నాయని ఐటి నిపుణులు చెబుతున్నారు. గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు అనేవి ఎదురవుతున్న సవాళ్లకు అనుగుణంగా అనేక రకాల వ్యూహాత్మక విధులను నిర్వహించడానికి బహుళజాతి సంస్థలు స్థాపించే కేంద్రాలు. ఆవిష్కరణ కార్యక్రమాలు, పరిశోధనలు, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, సైబర్ సెక్యూరిటీ, డిజిటల్ పరివర్తన కార్యక్రమాలను వేగవంతం చేయడం, వనరుల వినియోగాన్ని పెంచడం తదితర విధులను ఈ కేంద్రాలు నిర్వహిస్తుంటాయి. ఐటి రంగంలో ఒప్పందం ప్రకారం ఉద్యోగులను నియమించుకునే విధానంలో 43.5% డిమాండ్‌తో బెంగళూరు కేంద్ర స్థానంగా ఉన్నప్పటికీ, 13.4% డిమాండ్‌తో రెండో అత్యధిక స్థానంలో హైదరాబాద్ ఉంది. ఈ ఉద్యోగాల కల్పనలో విద్యార్హతల కన్నా సాంకేతిక నైపుణ్యమే కీలక పాత్ర వహిస్తోందన్నది ఉద్యోగార్థులు గమనించవలసిన కీలకాంశం.

## డిటెన్షన్ విధానం మంచిదే కానీ..!



సమర్థ మానవ వనరుల నిర్మాణానికి విద్య అత్యంత కీలకమైనది. అందరికీ నాణ్యమైన విద్య అందించినప్పుడే ఇది సాధ్యమవుతుంది. ఈ లక్ష్య సాధనలో విద్యాహక్కు చట్టం 2009ను తీసుకురావడం జరిగింది. ఈ చట్టం ప్రకారం 6 నుంచి 14 సంవత్సరాలు పిల్లలందరికీ ఉచిత నిర్బంధ విద్యను అందించడం జరుగుతున్నది. విద్యను సార్వత్రికం చేయడంలో ఈ చట్టం విజయవంతమైందని చెప్పవచ్చు. నేడు మెజారిటీ విద్యార్థులకు విద్య అందుబాటులోకి వచ్చినప్పటికీ నాణ్యతా ప్రమాణాలు లోపిస్తున్నాయని అనేక అధ్యయనాలు పేర్కొంటున్నాయి.ఈ విషయాన్ని అసర్ సర్వే, నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేలు ధ్రువీకరిస్తున్నాయి. ఈ క్రమంలో విద్యా నాణ్యతపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఏర్పడింది. ఇందులో భాగంగానే డిటెన్షన్ విధానాన్ని ప్రవేశపెట్టారు. వాస్తవంగా మొదట్లో విద్యాహక్కు చట్టం సెక్షన్ 16 ప్రకారం నో- డిటెన్షన్ విధానం ఉండేది. ఈ సెక్షన్ రెండు కీలకమైన నిబంధనలను నిర్దేశిస్తుంది. మొదటిది, ప్రాథమిక విద్యను పొందుతున్న ఏ పిల్లవాడినీ పాఠశాలనుంచి బహిష్కరించకూడదు. రెండవది, ఏ తరగతిలోనూ పిల్లలను నిలుపుదల చేయకూడదు. అనగా 8వ తరగతి వరకు విద్యార్థులను నిర్బంధించకుండా పైతరగతులకు అనుమతించాలి. పిల్లలు ప్రతి తరగతిలో ఫెయిల్ అవుతానేమో అనే భయంలేకుండా కనీస అభ్యసనస్థాయి పొందేలా చేయడం, తద్వారా డ్రాపౌట్ రేటును తగ్గించడం సెక్షన్ 16 ప్రధాన ఉద్దేశం. సమ్మిళిత విద్యను ప్రోత్సహించడం, డ్రాపౌట్లను తగ్గించడం కోసం నో -డిటెన్షన్ విధానం ఒక సదుద్దేశంతో తీసుకురావడం జరిగింది. అయితే, దీని అమలు తీరు పలు విమర్శలను ఎదుర్కొంది. ఈ విధానం పిల్లల-స్నేహపూర్వక విద్యా వ్యవస్థను ప్రోత్సహించాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ విద్య నాణ్యత, జవాబుదారీతనంపై ప్రభావం చూపింది. ప్రాథమిక విద్యపై ఇటీవల కేంద్రప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 5, 8 తరగతులకు నో డిటెన్షన్ పాలసీని రద్దు చేసింది. దీని ప్రకారం ఈ రెండు తరగతులకు చెందిన విద్యార్థులపై తరగతులకు వెళ్లేందుకు తప్పనిసరిగా పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. ఇప్పటివరకు పాసైనా, ఫెయిలైనా హాజరు శాతంతో విద్యాహక్కు చట్టం ప్రకారం పైతరగతులకు పంపిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం విద్యార్థి ఫెయిలైతే మళ్లీ పరీక్ష రాసేందుకు అవకాశం కల్పిస్తారు. పరీక్షల ఫలితాలు వెలువడే తేదీకి రెండు నెలల్లోపే మళ్ళీ పరీక్షపెడతారు.ఒకవేళ అందులోనూ ఫెయిలైతే వారు 5, 8 తరగతులను మళ్లీ చదవాల్సి ఉంటుంది. ఫెయిలైన విద్యార్థుల జాబితాను ప్రధానోపాధ్యాయులు నిర్వహించాల్సి ఉంటుంది. అయితే, ప్రాథమికోన్నత విద్య పూర్తయ్యేవరకు ఏ విద్యార్థినీ బహిష్కరించరాదని కేంద్రం స్పష్టం చేసింది. మరోవైపు కేంద్రం నిర్ణయించినట్లు 5, 8 తరగతుల్లో డిటెన్షన్ విధానం అమలు చేస్తే ప్రభుత్వ విద్యా సంస్థల్లో డ్రాపౌట్లు పెరుగుతాయని ఉపాధ్యాయ సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ప్రాథమిక విద్య రాష్ట్ర జాబితాలోని అంశమైనందున ఈ విషయంలో ఆయా రాష్ట్రాలు నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం పరిధిలోని దాదాపు 3 వేల కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ, సైనిక పాఠశాలలకు ఇది వర్తిస్తుంది.ఇప్పటికే ఢిల్లీ సహా 16 రాష్ట్రాలు, 2 కేంద్ర పాలిత ప్రాంతాలు నో డిటెన్షన్ విధానాన్ని రద్దు చేశాయి. డిటెన్షన్ విధానం తెలంగాణలో అమలుపై సందిగ్ధత నెలకొంది. రాష్ట్రంలో ఇటీవల విద్యా వ్యవస్థలో సంస్కరణల కోసం విద్యా కమిషన్ నియమించినది. ఇది విద్యా వ్యవస్థలో నాణ్యత, మౌలిక సదుపాయాలపై అధ్యయనం చేస్తోంది. ప్రస్తుతం 9వ తరగతి వరకు నో డిటెన్షన్ విధానం అమలవుతోంది. పరీక్షల్లో పాసైనా.. కాకున్నా పై తరగతులకు పంపిస్తున్నారు. కేంద్రం నూతన విద్యా విధానం 2020 తీసుకురావడం జరిగింది.

ప్రస్తుతం పలు రాష్ట్రాలు నూతన విద్యావిధానం అమలు దిశగా ముందుకుపోతున్నాయి. ఈ విధానంలో కూడా లోపాలు ఉన్నాయని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. ఈ క్రమంలో పాఠశాల విద్యలో కీలక మార్పులు చేయాల్సిన అవసరమైతే ఉంది. విద్యా నాణ్యతను మరింత మెరుగుపరచడానికి నిరంతర సమగ్ర మూల్యాంకనం, నో డిటెన్షన్ విధానంపై విద్యాహక్కు చట్టంలో చేసిన సవరణలు సమీక్షించాలి. ప్రాథమిక స్థాయిలో నో డిటెన్షన్ విధానం రద్దువలన విద్యార్థుల్లో ఒత్తిడి పెరుగుతుంది. కావున, దీనిపై పునఃసమీక్షించి 8వ తరగతి నుంచి అమలుచేస్తే బాగుంటుంది.

జనం రిపోర్టర్ తెలుగు దినపత్రిక

## సంపాదకీయం

# గ్రీన్‌లాండ్‌పై ట్రంప్ ఆకాంక్ష

## (విశ్లేషణ)

గ్రీన్‌లాండ్‌ను ఎంతకైనా కొనుగోలు చేస్తానని కాబోయే అధ్యక్షుడు ట్రంప్ పదేపదే హెచ్చరించడంతో డానిష్ రాజ్యాలు అప్రమత్తం కావడమే కాక, ఐక్యంగా ప్రతిఘటించాల్సిన అవసరం ఆ దేశాలకు ఏర్పడింది. **57,000** మంది జనాభాతో ప్రపంచంలోనే అతి పెద్దదైన ద్వీపకలం గ్రీన్‌లాండ్. ఇది డెన్మార్క్ ప్రభుత్వ నియంత్రణలోని స్వయంపాలిత భూభాగం. అక్కడి పార్లమెంటే వాణిజ్య పన్నులు, ఇమ్మిగ్రేషన్ (వలస విధానం), గనులు, తదితర స్వదేశీ వ్యవహారాల నిర్వహణతోపాటు, మిలిటరీ విధానాలు, పర్యవేక్షణ వంటి విదేశీ వ్యవహారాలు నిర్వహిస్తుంది. **18**వ శతాబ్దంలో ఆర్కిటిక్ ద్వీపం డేన్స్ వలస పాలకుల అధీనంలో ఉండేది. ఆ సమయంలో ఐరోపాతో సమన్వయం పాటించేది. భౌగోళికంగా ఉత్తర అమెరికా ఖండంలో ఇదో భాగం. రెండో ప్రపంచ యుద్ధంలో నాజీ జర్మనీ ముట్టడిలో డెన్మార్క్ ఉన్నప్పుడు అమెరికా స్వల్పంగా దీనిని ఆక్రమించి రక్షించింది. యుద్ధం తరువాత దీని ప్రాంతీయ భౌగోళిక రాజకీయ ప్రాధాన్యతను అమెరికా గుర్తించింది. ఈ గ్రీన్‌లాండ్‌ను డెన్మార్క్ నుంచి కొనుగోలు చేయడానికి ప్రయత్నించగా, డెన్మార్క్ తిరస్కరించింది. అప్పటి నుంచి డానిష్ రాజ్యంలో ఒక భాగంగా కొనసాగుతున్న గ్రీన్‌లాండ్‌కు **1979**లో హోమ్‌రూల్ కూడా మంజూరైంది. ఈ ద్వీపంపై అమెరికా విమాన స్థావరాన్ని నిర్వహిస్తున్నా ఈ ద్వీపంపై పూర్తి స్వాతంత్ర్యం సాధించాలన్న లక్ష్యంతో డెన్మార్క్ ప్రభుత్వం సమాయత్తమవుతోంది. గ్రీన్‌లాండ్‌లో వలసపాలకుల అవశేషాలను తొలగించడమే తదుపరి చర్యగా గ్రీన్‌లాండ్ ప్రధాని ముటెఎగెడే కొత్త సంవత్సర శుభాకాంక్షల సందర్భంగా ప్రస్తావించారు. ట్రంప్ అమెరికా అధ్యక్షునిగా తొలిసారి పాలించినపుడు గ్రీన్‌లాండ్ కొనుగోలు వ్యవహారాన్ని తెరపైకి తీసుకువచ్చారు. అయితే ఇప్పుడు రెండోసారి అధ్యక్షునిగా వచ్చాక గ్రీన్‌లాండ్ కొనుగోలు అంశం సీరియస్ అయ్యే పరిస్థితి కనిపిస్తోంది. జాతీయ భద్రత, ప్రపంచం మొత్తం మీద స్వేచ్ఛ, తదితర ప్రయోజనాల దృష్టా గ్రీన్‌లాండ్‌పై నియంత్రణ అధికారం తప్పనిసరిగా ఉండాలని అమెరికా ఆశిస్తున్నట్టు ట్రంప్ గత డిసెంబర్‌లో వెల్లడించారు. ఆ ప్రకటన తరువాత ట్రంప్ కుమారుడు, జూనియర్ ట్రంప్ ఒక ప్రైవేట్ వ్యక్తిగా గ్రీన్‌లాండ్‌ను సందర్శించారు. అయితే గ్రీన్‌లాండ్, డానిష్ ప్రధానులిద్దరూ ఈ బెదిరింపులను ఖాతరు చేయడం లేదు. ‘గ్రీన్‌లాండర్లదే గ్రీన్‌లాండ్’ అని స్పష్టం చేశారు. అయితే ఈ విషయంలో ట్రంప్ అస్పష్టంగా ఉంటున్నారు. గత వారం పత్రికావిలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గ్రీన్‌లాండ్ విషయంలో మిలిటరీ బలప్రయోగం కానీ, కొనుగోలు చేసి తమ దేశంలో చేర్చుకోడానికి కానీ తాము ప్రయత్నించబోమని పేర్కొన్నారు. గ్రీన్‌లాండ్ ద్వీపానికి ఒకవైపు అట్లాంటిక్, మరోవైపు ఆర్కిటిక్ జలాలు చుట్టుముట్టి ఉన్నాయి. వాతావరణ మార్పులకు, భూతాపానికి, ఆర్కిటిక్ సముద్రంలోని హిమానీ నదులు, మంచు ఫలకలు కరుగుతుంటాయి. ఫలితంగా నౌకారవాణాకు కొత్తమార్గాలు ఏర్పడుతుంటాయి. ఇది వాణిజ్యం బాగా విస్తరించడానికి దోహదం చేస్తుంది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరుగుతుండడంతో ఆర్కిటిక్ జలాల్లో నూతన నౌకా రవాణా మార్గాలను అభివృద్ధి చేయడానికి రష్యా, చైనా దేశాలు ఇప్పటికే ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. ఉత్తర సముద్ర మార్గంలో సహకారం పెంపొందించుకోడానికి ఈ రెండు దేశాలు గత నవంబరులో సబ్ కమిటీని ఏర్పాటు చేసుకున్నాయి. స్కాండినేవియా సమీపాన గల బారెంట్స్ సముద్రం నుంచి అలస్కా సమీపాన గల బెరింగ్ జలసంధి వరకు ఈ మార్గం **5600** కిలోమీటర్ల పొడవునా విస్తరించి ఉంది. ఈ ప్రాంతంలో రష్యా చైనా సహకార ఒప్పందం పెద్ద సవాలు కావడంతో గ్రీన్‌లాండ్‌ను చేర్చుకోవడం అమెరికాకు తప్పనిసరి అవుతోంది. దీని ద్వారా ఆ ప్రాంతంలో అమెరికాకు గట్టి నియంత్రణ ఏర్పడుతుంది. ఈ వ్యూహాత్మక జలాల్లో ఎవరు రవాణా సాగించాలో ఎవరు ఆపరేట్ చేయాలో నిర్ణయించే అధికారం అమెరికాకు కలుగుతుంది. ఇంతేకాకుండా ఈ గ్రీన్‌లాండ్ ద్వీపంలో అపురూప ఖనిజాలు సమృద్ధిగా ఉన్నాయి. **2025** ఒక సర్వే ప్రకారం **35** కీలకమైన ఖనిజాల్లో **25** ముడి ఖనిజాలు గ్రీన్‌లాండ్‌లో నిక్షిప్తమై ఉన్నాయి. ఎలక్ట్రిక్ వాహనాలు, బ్యాటరీల్లో ఈ ఖనిజాలను వినియోగిస్తారు. **28,000** చదరపు కిలోమీటర్ల పరిధిలో ఉండే గ్రీన్‌లాండ్ మంచు ఫలకలు కరుగుతుండడంతో చమురు, గ్యాస్, ఇతర కీలకమైన ఖనిజాలను తవ్వితీయడం సులువవుతుంది. ప్రస్తుతం ప్రపంచం మొత్తం మీద చైనా కీలకమైన ఖనిజాల ఎగుమతి, ఉత్పత్తిదారుగా ఉంటోంది. గ్రీన్‌లాండ్‌ను కొనుగోలు చేయగలిగితే చైనాకు అమెరికా గట్టిపోటీ ఇవ్వగలుగుతుంది. పనామా కాలువను కెనడాను తమ అధీనంలోకి తెచ్చుకోడానికి ఎంతకైనా కొనుగోలు చేయడానికి అమెరికా సిద్ధమేనని ట్రంప్ ఇటీవల హెచ్చరించారు. ఇవన్నీ అమెరికా ఆర్థిక, జాతీయ భద్రతకు దోహదం చేస్తాయి. దేశాల సార్వభౌమత్వాన్ని గ్రీన్‌లాండ్‌తో సహా గుర్తించాలని ఐక్యరాజ్యసమితి చార్టర్‌లో పేర్కొన్న మొట్టమొదటి ప్రమాణానికి అమెరికా గండికొడుతోంది. అలాగే నాటో ఒప్పందానికి వ్యతిరేకంగా వెళుతోంది. ఐక్యరాజ్యసమితి పొందుపరిచిన సముద్ర పరిరక్షణ చట్టం మేరకు ప్రపంచ దేశాలన్నిటికీ సమాన వినియోగ హక్కు కల్పించేవిగా ఆర్కిటిక్ జలాలు ఉంటున్నాయి. ఇప్పుడు అమెరికా అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టబోతున్న డొనాల్డ్ ట్రంప్ పాలసీలు అంతర్జాతీయ రాజకీయాల వెనుకఉన్న నిజమైన అరాచక స్వభావాన్ని తెరపైకి తీసుకు వస్తున్నాయి.

## ప్రపంచంలోనే 3వ అతిపెద్ద స్టార్టప్ ఎకో సిస్టమ్‌గా భారత్..

# తొమ్మిదేళ్ల ప్రస్థానంలో కీలక మైలురాయి



సరిగ్గా తొమ్మిదేళ్ల క్రితం భారత ప్రభుత్వం ప్రారంభించిన “స్టార్టప్ ఇండియా” దేశాన్ని 3వ అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థ (%భ్ఖతీబజూ జుషీ ూఎర్వఎ%)గా తీర్చిదిద్దింది. వ్యాపార, పారిశ్రామిక రంగాలతో పాటు వివిధ రంగాల్లో సరికొత్త ఆలోచనలు, ఆవిష్కరణలతో ముందుకొచ్చే యువతను ప్రోత్సహించడం కోసం ఏర్పడిన స్టార్టప్ ఇండియా 2025 జనవరి 16 నాటికి తొమ్మిదేళ్ల ప్రస్థానాన్ని పూర్తిచేసుకుని 10వ ఏటలోకి అడుగు పెడుతోంది. ఈ సందర్భంగా జనవరి 16ను కేంద్ర ప్రభుత్వం నేషనల్ స్టార్టప్ డే (%చీఘఅశీఖశ్రీ ళ్ఖతీబజూ ఖఎ%)గా పేర్కొంటూ.. తొమ్మిదేళ్ల ప్రయాణంలో అధిగమించిన మైలురాళ్లు, సాధించిన విజయాలను వెల్లడించింది. భారత ప్రభుత్వం “స్టార్టప్ ఇండియా” పేరుతో సరికొత్త ఆలోచనలతో వచ్చే యువతకు ఆర్థిక వనరులు కల్పించడం, వివిధ శాఖల నుంచి అనుమతులు కల్పించడంలో సహకరిస్తూ ప్రోత్సహిస్తూ వచ్చింది. దీనికి తోడు ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన భారత్‌లో ఇంజనీరింగ్, సైన్స్ రంగాల్లో చదువుకున్న యువత కూడా పెద్ద సంఖ్యలో ఉండడం కలిసొచ్చింది. సాంకేతిక పరిజ్ఞానం కల్గిన మానవ వనరులే భారతదేశానికి ఒక ఆస్తిలా మారాయి. వీటన్నింటికీ మించి ప్రపంచంలోని ఏ ఇతర దేశంతో పోల్చినా సరే ఇక్కడ తక్కువ ఖర్చుతో కంపెనీలను ఏర్పాటు చేయడం, తక్కువ ఖర్చుతోనే మానవ వనరులను పొందగల్గడం భారత్‌లోనే సాధ్యపడుతోంది. ఇవన్నీ ప్రస్తుతం భారత్‌ను స్టార్టప్ ఎకోసిస్టమ్‌లలో 2-3 స్థానాల్లో నిలబెడుతోంది. మొదటి స్థానంలో అమెరికా కొనసాగుతుండగా.. 2-3 స్థానాల్లో భారత్, యునైటెడ్ కింగ్‌డమ్ అటూ ఇటుగా కొనసాగుతున్నాయి. ఆ తర్వాతి స్థానాల్లో కెనడా, జెర్మనీ ఉన్నాయి. డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ (%ఖూ××ు%) గణాంకాల ప్రకారం 9 సంవత్సరాల క్రితం భారతదేశంలో కేవలం 500 స్టార్టప్ కంపెనీలు మాత్రమే ఉండేవి. ఇప్పుడు 1.59 లక్షల స్టార్టప్ కంపెనీలు, వాటిలో 100కు పైగా యూనికార్న్ కంపెనీలతో ప్రపంచస్థాయిలో భారతదేశం దూసుకుపోతోంది. ఈ తొమ్మిదేళ్లలో 16 లక్షలకు పైగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలను సృష్టించిన రంగంగా రికార్డుల్లో నిలిచింది. జొమాటో, ఓలా, జీరోదా, జెప్టో, బ్లింకిట్, కంట్రీ డిలైట్ వంటి నిత్యజీవితంలో ఉపయోగించే అనేక రకాల ఈ-కామర్స్, ఫిన్‌టెక్ యాప్స్ అన్నీ స్టార్టప్‌లే అన్న విషయం మరువరాదు. ఇవన్నీ స్థానిక మార్కెట్లో అనేక సవాళ్లను పరిష్కరించి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొదాయి. దేశ ముఖచిత్రాన్ని మార్చేసి, ఆర్థిక పురోగతిలో భాగమయ్యాయి.

### స్టార్టప్ ఇండియాలో కొన్ని విశేషాలు

- భారత్‌లో స్టార్టప్‌ల సంఖ్య 1,59,157
- 2024 అక్టోబర్ నాటికి మొత్తం 73,151 గుర్తింపు పొందిన స్టార్టప్‌లలో కనీసం ఒక మహిళా డైరెక్టర్ ఉన్నారు.
- ఈ 9 సంవత్సరాలలో, గుర్తింపు పొందిన స్టార్టప్‌లు 16.67 లక్షల ఉద్యోగాలను సృష్టించాయి

ఏయే రంగాల్లో సృష్టించిన ఉపాధి ఎంత?

- ఐటీ సేవలు - 2.04 లక్షలు
- హెల్త్ కేర్ అండ్ లైఫ్ సైన్సెస్ %-% 1.47 లక్షలు
- వృత్తిపరమైన, వాణిజ్య సేవలు %- 94, 060
- విద్య - 90, 414

స్టార్టప్ ఇండియా చొరవ ప్రత్యేకత ఏమిటి?

- వ్యాపారాన్ని సులభంగా చేయడం: ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాలతో వ్యాపారాలను ప్రారంభించడం సులభతరం చేయడం
- పన్ను ప్రయోజనాలు: స్టార్టప్ ప్రారంభించే వారికి వరుసగా మూడు ఆర్థిక సంవత్సరాలు పన్ను ప్రయోజనాలు లభిస్తాయి.
- నిధుల మద్దతు: స్టార్టప్‌ల కోసం రూ. 10,000 కోట్ల విలువైన నిధుల నిధి అందుబాటులో ఉంది.
- వివిధ రంగాలకు ప్రత్యేక విధానాలు: బయోటెక్నాలజీ, వ్యవసాయం, పునరుత్పాదక ఇంధనం వంటి రంగాలకు సంబంధించిన కేంద్రీకృత విధానాలు.

‘డెవలప్డ్ ఇండియా యంగ్ లీడర్స్ డైలాగ్’లో భారతదేశ స్టార్టప్ ఎకోసిస్టమ్‌ను మరింత విస్తరించాలని ప్రధానమంత్రి మోదీ కోరుకున్నారు. నేటి భారతదేశం కొత్త ఉత్సాహంతో ముందుకు సాగుతోందని ఆయన అన్నారు. నేడు భారతదేశం ప్రపంచంలో ఐదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలిచిందని, అదే సమయంలో నేడు ప్రపంచంలోనే నంబర్ వన్ ఫిన్‌టెక్ ఎకో సిస్టమ్ భారతదేశంలో ఉందని తెలిపారు. ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద స్టార్టప్ ఎకోసిస్టమ్‌గా భారత్ నిలవడం గర్వంగా ఉందని తెలిపారు. అలాగే భారతదేశం ప్రపంచంలో రెండవ అతిపెద్ద మొబైల్ తయారీ దేశంగా కొనసాగుతోందని వెల్లడించారు. భవిష్యత్తులో భారతదేశం ప్రపంచ అభివృద్ధికి కేంద్రంగా మారుతుందని, ఇది ప్రపంచ వృద్ధి ఇంజిన్‌గా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు

# లోకేష్ కూడా రెడీ !



ఏపీలో అధికారంలోకి టీడీపీ కూటమి వచ్చి ఏడు నెలలే అయింది. ఇంకా ఎన్నికలకు చాలా దూరం ఉంది. అంతే కాదు కూటమి చేతిలో అధికారం అక్షరాల నాలుగున్నర నెలల దాకా ఉంది. దీంతో పాలన హాయిగా చేసుకోవచ్చు. / కానీ ఏపీలో చూస్తే ఆ పరిస్థితి అయితే అసలు కనిపించడం లేదు. ఎందువల్ల అంటే అధికారం నుంచి రాజకీయం అలాగే రాజకీయం నుంచి అధికారం ఇలా ఈ రెండూ విడదీయలేని బంధంగా మారిపోయాయి. కేంద్రంలో చూసినా మోడీ అధికారంలో ఉంటూనే ఎపుడూ ఎన్నికల కోసం వివిధ రాష్ట్రాలలో పర్యటనలు రాజకీయ సభలతో బిజీగా ఉంటారు. దాని వల్లనే బీజేపీ క్యాడర్ కూడా నిరంతరం అలెర్ట్ అవుతూ ఉంటుంది. వారిలో ఆ వేడి కసి అలాగే ఉంటాయి. అందుకే వరస విజయాలకు బీజేపీకి దక్కుతున్నాయి. ఇపుడు ఈ సూత్రాన్ని ఏపీ రాజకీయ పార్టీలు కూడా గట్టిగా పట్టించుకున్నాయని అంటున్నారు. కొత్త ఏడాది 2025 వచ్చేసింది. ఆ తరువాత పెద్ద పండుగ సంక్రాంతి కూడా ముగిసింది. దాంతో రాజకీయాలు మళ్లీ వేడెక్కుతున్నాయి. వైసీపీ అధినేత మాజీ ముఖ్యమంత్రి జగన్ జనంలోకి రావడానికి ముహూర్తం గతంలోనే పెట్టేశారు. ఆయన ప్రస్తుతం లండన్ టూర్ లో ఉన్నారు. %ూశ్రీంశీ =ఖు౦% - ఎఫ్.బీ.ఐ. టాప్-10 మోస్ట్ వాంటెడ్ లో భారతీయుడు... ఎవరీ పటేల్? ఆయన అక్కడ నుంచి ఏపీకి రాగానే ఫిబ్రవరి మొదటి వారం నుంచి జిల్లా పర్యటనలు స్టార్ట్ అవుతాయి. ప్రతీ జిల్లాలో రెండు రోజుల పాటు పర్యటించేలా జగన్ తన టూర్ ని రెడీ చేస్తున్నారు. ఆ మేరకు వైసీపీ యాక్షన్ ప్లాన్ కూడా సిద్ధం చేసింది జగన్ జనం లోకి వస్తున్న టైం లోనే ఉప ముఖ్యమంత్రి జనసేన అధినేత పవన్ కూడా జనం లోకి వెళ్లాలని అనుకుంటున్నారు. ఆయన కూడా రానున్న రోజులల్లో క్షేత్ర స్థాయి పర్యటనలకు శ్రీకారం చుట్టబోతున్నారు. పవన్ తన రాజకీయ జీవితంలో విపక్ష పాత్రనే ఇంతకాలం పోషిస్తూ వచ్చారు. మొదటి సారి అధికారంలో ఉంటూ జనం లోకి రావడం అన్నది పవన్ కి కొత్త అనుభవం. దాంతో పాటుగా ప్రజల సమస్యలను తెలుసుకొని వాటిని చేతిలో ఉన్న అధికారంతో పరిష్కరించడం ద్వారా పార్టీ విస్తరణకు అలాగే రాజకీయంగా బలపడేందుకు మార్గం సుగమం చేసుకోవాలన్నది జనసేన నాయకత్వం ఆలోచనగా కనిపిస్తోంది అంటున్నారు. కట్ చేస్తే ఇపుడు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ కూడా జనంలోకి రానున్నారు అని అంటున్నారు. ఆయన కూడా ఫిబ్రవరి నుంచి పార్టీ పటిష్టత మీద దృష్టి పెడతాను అని అంటున్నారు. ఆయన సైతం పార్టీని మరింతగా గట్టి పరచేందుకు క్యాడర్ కి దగ్గర అయ్యేందుకు తద్వారా ప్రభుత్వానికి పార్టీని మధ్య కనెక్టివిటీని మరింతగా పెంచేందుకు ఈ టూర్లను ఉపయోగించాలని చూస్తున్నారు. మొత్తం మీద చూస్తూంటే మరి కొద్ది రోజులలో జగన్ పవన్ లోకేష్ ఈ ముగ్గురు నేతలూ జనంలోకి రానున్నారు అని అంటున్నారు. దీంతో కొత్త ఏడాదిలో రాజకీయం వేసవి రాక ముందే హీటెక్కించే సూచనలు అయితే బలంగా కనిపిస్తున్నాయి.

# వైఎస్సార్ బతికి ఉంటే అదే జరిగేదా ?




వైఎస్సార్ విషయంలో చాలా చెప్పాల్సినవి ఉన్నాయి. ఆయన 2004 నుంచి 2009 సెప్టెంబర్ రెండవ తేదీ వరకూ ముఖ్యమంత్రిగా పనిచేసారు. ఆయన కరెక్ట్ గా చూస్తే అయిదుంపావు ఏళ్ళ పాటు సీఎం గా వ్యవహరించారు. ఉమ్మడి ఏపీని అత్యధికాలం పాలించిన సీఎంలలో ఆయనకు నాలుగో ప్లేస్ దక్కుతుంది. / ఇక వైఎస్సార్ ఏలుబడి ఒక స్వర్ణ యుగంగా చెబుతారు. ఆయన హయాంలో ఒక వైపు అభివృద్ధి మరో వైపు సంక్షేమం రెండూ పరుగులు పెట్టించారు అని అంటారు. అయితే దానికి కారణం ఆనాటి రాజకీయ ఆర్థిక పరిస్థితులు అని చెప్పాలి. కేంద్రంలో కూడా యూపీఏ కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంది. ఉమ్మడి ఏపీ నుంచి పెద్ద ఎత్తున కాంగ్రెస్ ఎంపీలు గెలిచి వెళ్లారు. అలా కేంద్ర ప్రభుత్వంలో ఏపీ పాత్ర రాజకీయంగా బాగా పెరిగింది. దాంతో వైఎస్సార్ కేంద్రం నుంచి పెద్ద ఎత్తున ఆర్థిక సహాయం పొందారు. అలా తాను అనుకున్న వాటిని ఏ ఇబ్బంది లేకుండా నెరవేర్చుకో గలిగారు అని అంటున్నారు. ఆయన చేతికి ఎముక లేదు అన్న మాట కూడా అలాగే వచ్చింది. ఇక కేంద్ర ప్రభుత్వం ఆనాడు ఏ సీఎం కి ఇవ్వని విలువ గౌరవం వైఎస్సార్ ఇచ్చింది అని చెబుతారు. ఆయన మీద ఉమ్మడి ఏపీ భారం పూర్తి స్థాయిలో వదిలేసింది అంటారు. ఒక విధంగా ఆయన ఒక ప్రాంతీయ పార్టీ అధినేతగా వ్యవహరించారు. అంతలా ఆయన ఫ్రీ హ్యాండ్ తో పాలించారు అంటే దానికి కారణం ఆనాటి పరిస్థితులు అని చెప్పాలి. అయితే అదే వైఎస్సార్ 2009లో మరణించడంతో దేవుడిగా ప్రజల గుండెలలో నిలిచిపోయారు. ఆయనలా ఆయన కుమారుడు జగన్ కూడా పాలన చేయలేదని ప్రజలు అనుకున్నారు. అంతవరకూ ఎందుకు జగన్ సొంత చెల్లెమ్మ కూడ జగన్ తన తండ్రిలా పాలించలేదని విమర్శలు గుప్పించారు. అయితే వైఎస్సార్ పాలనలో జరిగినవి తరువాత జరగలేదు. అందుకే ఆయన ఒక గోల్డెన్ పీరియడ్ ని చూశారు అని అంటారు ఆయనతో అప్పట్లో అత్యంత సన్నిహితులుగా మెలిగిన వారు. ఇక వైఎస్సార్ విషయంలో ఈ రోజుకీ సగటు జనాలు అనుకునేది ఏంటి అంటే వైఎస్సార్ ఉంటే అనుకున్నవన్నీ జరిగేవి అని. నిజంగా అలా జరిగేవా అంటే ఏమో అది 2009 సెప్టెంబర్ దాకానే జరిగి ఆగింది. ఆ తరువాత కాంగ్రెస్ సీఎంలే ఇద్దరు పాలించినా కూడా అలాంటివి జరగలేదు. ఎందువల్ల అంటే అప్పటికే పరిస్థితుల్లో మార్పులు వచ్చాయని అంటారు. ఇదే విషయాన్ని ఇటీవల మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డి కూడా చెప్పారు. ఏపీ ప్రజలు ఈ రోజుకీ అనుకునేది ఒకటి ఉంది. అది వారి బలమైన నమ్మకం కూడా. అదేంటి అంటే వైఎస్సార్ జీవించి ఉంటే ఉమ్మడి ఏపీ రెండు ముక్కలు అయ్యేది కాదు అని. నిజంగా అలా జరుగుతుందా అంటే దానికి కిరణ్ కుమార్ రెడ్డి చెప్పినది చిత్రంగానే కాదు ఆసక్తిగా ఉంది. వైఎస్సార్ జీవించి ఉన్నా ఉమ్మడి ఏపీ విభజనను ఆపలేరని కిరణ్ కుమార్ రెడ్డి సంచలన వ్యాఖ్యలే చేసారు. 2009లోనే కేంద్ర స్థాయిలో కాంగ్రెస్ అత్యంత కీలకమైన డెసిషన్ ని తీసుకుందని ఏపీని రెండుగా చేయాలన్నది ఆ పార్టీ విధాన నిర్ణయమని తెలంగాణాను ఇవ్వాలని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని దానిని పూర్తి చేయడంలో కచ్చితంగా వ్యవహరిస్తుందని చెప్పేశారు. అందువల్ల వైఎస్సార్ ఉన్నా ఎవరు ఉన్నా ఏపీ రెండుగా మరడం ఖాయమని కిరణ్ కుమార్ రెడ్డి చెప్పారు. మరి ఆయన అభిప్రాయాలతో ఏకీభవించే వారు ఎంత మంది అంటే అది ఎవరికి వారే ఆలోచించుకోవాలి. అయితే కొంతమంది విషయంలో ఆయన బతికి ఉంటేనా అన్నది ఎపుడూ చర్చగానే ఉంటుంది. అలాగే వైఎస్సార్ అంటే ఒక స్వర్ణ యుగం పాలన అన్నది మెజారిటీ జనం అంటారు. విభజన విషయంలో ఆయన అడ్డ పడతారు అని నమ్మే వారూ ఎక్కువగానే ఉంటారు అని అంటున్నారు.

## కర్ణాటకలో మరో బ్యాంక్ దోపిడీ..
## రూ.15 కోట్ల ఆభరణాలు, రూ.5 లక్షల నగదు చోరీ



మంగుళూరు : కర్ణాటకలో మరో బ్యాంక్ దోపిడీ ఘటన చోటుచేసుకుంది. శుక్రవారం మధ్యాహ్నం ఉల్లాల్ సమీపంలోని కెసి రోడ్ బ్రాంచ్‌లో కోటేకర్ వ్యవసాయ సహకార బ్యాంక్‌పై పట్టపగలు ఆరుగురు సాయుధ దుండగులు దోపిడీకి పాల్పడ్డారు. బ్యాంక్ సిబ్బందిని తుపాకులతో బెదిరించి రూ.15 కోట్ల విలువైన బంగారు ఆభరణాలు, రూ.5లక్షల నగదును దోచుకువెళ్లినట్లు అధికారులు తెలిపారు. అనంతరం బూడిదరంగు ఫియట్ కారులో పరారయ్యారని అన్నారు. దుండగులు కత్తులు, తుపాకులతో బ్యాంకులోకి చొరబడ్డారని, సిబ్బందితో పాటు సిసిటివి టెక్నీషియన్‌ను బెదరించారని అన్నారు. సిబ్బందిలో ముగ్గురు మహిళలు ఉన్నారని చెప్పారు. దోపిడీకి ముందు దుండుగుల భవనం గ్రౌండ్‌ఫ్లోర్‌లోని బేకరీలో విద్యార్థులను అక్కడి నుండి వెళ్లాల్సిందిగా బెదిరించారని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. వారు తమలో తాము కన్నడలో మాట్లాడుకున్నారని, బ్యాంక్ సిబ్బందితో మాత్రం హిందీలో మాట్లాడారని అన్నారు. ఘటనా స్థలాన్ని కర్ణాటక అసెంబ్లీ స్పీకర్ యుటి ఖాదర్ సందర్శించారు. విచారణను వేగవంతం చేయాల్సిందిగా పోలీసులను ఆదేశించారు.కర్ణాటకలోని బీదర్‌లో గురువారం దోపిడీ దొంగలు భీభత్సం సృష్టించిన సంగతి తెలిసిందే. ఎటిఎంలో డబ్బులు పెట్టేందుకు వచ్చిన వాహనంపై దుండగులు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో సెక్యూరిటీ గార్డు మరణించగా, ఇద్దరు సిబ్బందికి గాయాలయ్యాయి.

## అతిపెద్ద బ్యాటరీ స్టోరేజీ ప్లాంట్‌లో అగ్ని ప్రమాదం .. స్థానికుల తరలింపు



శాక్రమెంటో : కాలిఫోర్నియాలోని ప్రపంచంలోనే అతిపెద్ద బ్యాటరీ స్టోరేజీ ప్లాంట్ (మాస్ ల్యాండింగ్ టెస్లా బ్యాటరీ ఫ్యాక్టరీ )లో గురువారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం జరిగినట్లు అధికారులు తెలిపారు. ఉత్తర కాలిఫోర్నియాలోని జాతీయ రహదారి 1లో కొంత భాగాన్ని మూసివేశారు. వందలాది మందిని ఆప్రాంతాన్ని ఖాళీ చేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. అగ్ని ప్రమాదం కారణంగా అన్ని పాఠశాలలు, కార్యాలయాలను శుక్రవారం మూసివేసినట్లు నార్త్ మాంటెరీ కౌంటీ యంత్రాంగం ప్రకటించింది. మంటలు అంతకంతకూ వ్యాపిస్తుండటంతో పాటు ఆప్రాంతమంతా నల్లని దట్టమైన పొగ కమ్మేసింది. గురువారం రాత్రికి కూడా మంటలు తగ్గే సూచనలు కనిపించకపోవడంతో మాస్ ల్యాండింగ్ (బ్యాటరీ స్టోరేజ్ ప్లాంట్ ప్రాంతం), ఎల్కోర్న్ స్లాఫ్‌లను చెందిన దాదాపు 1,500 మందిని ఖాళీ చేయాల్సిందిగా ఆదేశించినట్లు స్థానిక మీడియా వెల్లడించింది. శాన్‌ఫ్రాన్సిస్కోకు దక్షిణంగా 77 మైళ్ల దూరంలో ఉన్న మాస్ ల్యాండింగ్ పవర్‌ప్లాంట్ టెక్సాస్ కంపెనీ విస్ట్రా ఎనర్జీకి చెందినది. పదివేల లిథియం బ్యాటరీలను కలిగి ఉంది. సౌరశక్తి, పునరుత్పాదక వనరుల నుండి ఉత్పత్తి చేసే విద్యుత్‌ను ఈ బ్యాటరీల్లో నిల్వ చేస్తుంది. ఈ ఫ్యాక్టరీలో మంటలను ఆర్పేందుకు అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా కృషి చేస్తోందని, ఇది అతిపెద్ద విపత్తు అని మాంటెరీ కౌంటీ సూర్‌వైజర్ గ్లెన్‌చర్చ్ పేర్కొన్నారు. కాంక్రీట్ భవనంపైకి మంటలు వ్యాపిస్తాయని ఊహించలేదని అన్నారు. తాజా అగ్ని ప్రమాదానికి కారణాలు తెలియరాలేదని విస్ట్రా ప్రతినిధి జెన్నీ లియాన్ పేర్కొన్నారు. ప్రమాదాన్ని గుర్తించిన వెంటనే సిబ్బందిని సురక్షితంగా తరలించామని తెలిపారు. మంటలను అదుపు చేసిన అనంతరం విచారణకు ఆదేశిస్తామని పేర్కొన్నారు. కమ్యూనిటీ, సిబ్బంది భద్రతకు ప్రాధాన్యత నిచ్చామని అన్నారు. అత్యవసర సిబ్బంది అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. ఫైర్ స్ప్రింకర్ల సిస్టమ్ పనిచేయకపోవడంతో 2021-2022లో విస్ట్రా ప్లాంట్‌లో మంటలు చెలరేగాయి. ఫలితంగా కొన్ని యూనిట్లు వేడెక్కాయని మెర్క్యూరీ న్యూస్ మీడియా తెలిపింది.ః

## వ్యాధినిరోధక శక్తిపై దాడి, పెరగనున్న శ్వాస సంబంధ వ్యాధులు



లాస్‌ఏంజెల్స్ : గత కొన్నిరోజులుగా లాస్‌ఏంజెల్స్‌లోని పలు ప్రాంతాలను భస్మీపటలం చేసిన కార్చిచ్చు ప్రపంచ వ్యాప్తంగా ఆందోళన సృష్టించిన సంగతి తెలిసిందే. గృహాలు, ఇతర నిర్మాణాలను బూడిదగా మారుస్తూ పెద్ద ఎత్తున విధ్వంసం సృష్టించింది. కార్చిచ్చుతో ఇప్పటి వరకు 24 మంది మరణించారు. అయితే ఈ కార్చిచ్చు ప్రత్యక్షంగానే కాకుండా మానవ ఆరోగ్యంపై దీర్ఘకాలిక ప్రభావం చూపే అవకాశం ఉందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రత్యేకించి, వ్యాధినిరోధక శక్తిపై దాడి చేయడమే కాకుండా శ్వాస సంబంధ వ్యాధులను, ఇన్ఫెక్షన్‌లను వ్యాప్తి చేస్తుందని తెలిపారు.

వ్యాధి నిరోధక శక్తిపై ప్రభావం

మంటలతో కాలిన గాయాలు, దట్టమైన పొగ ప్రాణాపాయాన్ని కలిగించే అవకాశం ఉంది. అయితే ఇవి రెండూ కూడా రోగనిరోధక వ్యవస్థలో తీవ్రమైన మరియు దీర్ఘకాలిక మార్పులకు కారణమవుతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇన్ఫెక్షన్ల బారిన పడే అవకాశం ఉందని తెలిపారు. కొన్ని గాయాలు హైపర్ ఇన్‌ఫ్లమేషన్‌కు దారితీస్తాయి. తీవ్రమైన గాయాలతో పోరాడిన వ్యక్తుల్లో న్యుమోనియో, ఇతర శ్వాసకోశ ఇన్ఫెక్షన్ల ప్రమాదాన్ని పెంచే అవకాశం ఉందని పరిశోధనలు హెచ్చరిస్తున్నాయి. దట్టమైన పొగ అస్థిరమైన కర్బన సమ్మేళనాలు, ఓజోన్, విషవాయువులు, సూక్ష్మజీవులను కలిగి ఉంటుంది. ఇవి శ్వాసకోశ ఇన్ఫెక్షన్లతో పాటు ఆస్తమాను కలిగించవచ్చని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. 2019-20లో ఆస్ట్రేలియాలో బ్లాక్ సమ్మర్ తర్వాత కరోనా వ్యాప్తికి అవకాశం అధికంగా ఉందని పరిశోధనలు వెల్లడించాయి. పొగ కారణంగా మానవుల్లో ఫంగల్ ఇన్ఫెక్షన్లపై శాస్త్రవేత్తలు పరిశోధనలను పరిశీలిస్తున్నారు. పొడి నేలల్లో ఉండే కొక్సిడియోయిడ్స్ ఇమ్మిటిస్, కోక్సిడియోయిడ్స్ పోసాడాసి వంటి బ్యాక్టీరియా దుమ్ము, పొగతో మానవుల్లోకి చేరే అవకాశం ఉంది. ఇవి జ్వరానికి, ఫ్లూ, ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్ కలిగిస్తాయి. కాలిఫోర్నియాలో వైల్డ్‌ల్యాండ్ అగ్నిమాపక సిబ్బందిపై జరిపిన ఓ అధ్యయనంలో వ్యాలీ ఫీవర్ ఇన్ఫెక్షన్లు ఎక్కువగా ఉన్నట్లు తేలింది.

## స్పేడెక్స్ అనుసంధానం విజయవంతం : ఇస్రో




న్యూఢిల్లీ : స్పేడెక్స్ డాకింగ్ ప్రయోగం విజయవంతమైనట్లు భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) ప్రకటించింది. అమెరికా, రష్యా, చైనా తర్వాత ఈ చారిత్రాత్మక ప్రయోగాన్ని చేపట్టిన నాలుగో దేశంగా భారత్ నిలిచింది. డిసెంబర్ 30న పిఎస్‌ఎల్‌వి సి60 ద్వారా ప్రయోగించిన రెండు ఉపగ్రహాలు ఎస్‌డిఎక్స్ 01 (ఛేజర్), ఎస్‌డిఎక్స్ 02 (టార్గెట్)లను ఇస్రో టెలీమెట్రీలోని మిషన్ ఆపరేషన్స్ కాంప్లెక్స్ (ఎంఒఎక్స్) నుండి అంతరిక్షంలోకి అనుసంధానం చేసినట్లు ఇస్రో ప్రకటించింది. క్లిష్టతరమైన డాకింగ్ విధానాన్ని ఇస్రో టెలిమెట్రీ, ట్రాకింగ్, కమాండ్ నెట్‌వర్క్ (ఐఎస్‌టిఆర్‌ఎసి) పర్యవేక్షించిందని తెలిపింది. అంతరిక్ష నౌక డాకింగ్ పూర్తయిందని, ఇదో చారిత్రాత్మక క్షణమని ఇస్రో సోషల్ మీడియా ఎక్స్‌లో పేర్కొంది. చంద్రునిపైకి భారతీయ వ్యోమగామిని పంపడం, చంద్రుని నుండి నమూనాలను భూమిపైకి తీసుకురావడం, భారతీయ అంతరిక్ష కేంద్రం నిర్వహణకు ఈ సాంకేతికత అవసరమని తెలిపింది.

# గాజాలో శాంతి సాధ్యమేనా!



బాంబుల మోత ఆగుతుందంటే... తుపాకులు మౌనం పాటిస్తాయంటే... క్షిపణుల జాడ కనబడదంటే... ఇనుప డేగల గర్జనలు వినబడవంటే... నిత్యం మృత్యువు వికటాట్టహాసం చేస్తున్నచోట హర్షాతిరేకాలు వ్యక్తం కావటం సహజమే. అందుకే 15 నెలలుపైగా... అంటే 467 రోజులుగా రాత్రింబగళ్లు ప్రాణభయంతో కంటి మీద కునుకు లేకుండా గడిపిన గాజా ప్రజానీకం వీధుల్లోకొచ్చి పండుగ చేసుకున్నారు. అటు హమాస్ చెరలో మగ్గుతున్నవారి కుటుంబసభ్యులు సైతం ఆనందో త్సాహాలతో ఉన్నారు. ఇజ్రాయెల్-మిలిటెంట్ సంస్థ హమాస్‌ల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిందని మధ్యవర్తులుగా వ్యవహరించిన అమెరికా, ఖతార్ ప్రతినిధులు బుధవారం రాత్రి ప్రకటించగానే ప్రపంచం, ప్రత్యేకించి పశ్చిమాసియా ఊపిరి పీల్చుకున్నాయి. 'నేను దేశాధ్యక్షపదవి స్వీకరించబోయే జనవరి 20 నాటికి బందీలకు స్వేచ్ఛ లభించకపోతే సర్వనాశనం ఖాయమ'ని అమెరికాకు కాబోయే అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పక్షం రోజుల నాడు ప్రకటించారు. 'నా హెచ్చరిక ఫలించబట్టే కాల్పుల విరమణ ఒప్పందం సాకారమైంద'ని ఇప్పుడు ఆయన అంటుంటే... 'నా అనుభవంలోనే అత్యంత కఠినమైన ఈ చర్చల ప్రక్రియను మొత్తానికి సుఖాంతం చేయగలిగాన'ని ప్రస్తుత అధ్య క్షుడు జో బైడెన్ చెబుతున్నారు. ఈ ఘనత ఎవరి ఖాతాలో పడాలన్నది తేలకముందే ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ మొండికేస్తున్నారు. తొలుత ఒప్పందాన్ని స్వాగతించిన ఆయనే ఇంకా తేలాల్సినవి ఉన్నాయంటున్నారు. ఒప్పందంపై ఆమోదముద్ర వేసేందుకు నిర్వహించాల్సిన కేబినెట్ సమావేశాన్ని నిలిపివేశారు. ఈలోగా నిన్న, ఇవాళ గాజాపై ఇజ్రాయెల్ సాగించిన బాంబు దాడుల్లో 19మంది పిల్లలు సహా 80 మంది చనిపోయారు. కాల్పుల విరమణ ఒప్పందం అమలవుతుందా లేదా, ఈ ప్రాంతంలో తాత్కాలికంగానైనా శాంతి నెలకొంటుందా అన్న అంశంలో సందిగ్ధత ఏర్పడింది. సుదీర్ఘకాలం ఘర్షణలతో అట్టుడికినచోట సాధారణ పరిస్థితులు ఏర్పడటం అంత సులభమేమీ కాదు. అందునా ఇజ్రాయెల్‌తో వైరమంటే మామూలుగా ఉండదు. ఇజ్రాయెల్ భూభాగంలోకి హమాస్ మిలిటెంట్లు చొరబడి 2023 అక్టోబర్ 7న విచ్చలవిడిగా కాల్పులు జరిపి 1,200 మంది పౌరులను హతమార్చటంతో పాటు, 251 మందిని బందీలుగా తీసు కెళ్లటంతో ఇదంతా మొదలైంది. హమాస్ మతిమాలిన చర్య తర్వాత ఇజ్రాయెల్ క్షిపణులు, బాంబులతో గాజా, వెస్ట్‌బ్యాంక్‌లపై సాగించిన దాడుల పర్యవసానంగా ఇంతవరకూ కొందరు హమాస్ కీలకనేతలతో పాటు 46,700 మంది పౌరులు చనిపోయారు. ఇందులో అత్యధికులు పిల్లలు, మహి ళలే. ఇతరులు నిత్యం చావుబతుకుల మధ్య రోజులు వెళ్లదీస్తున్నారు. ఇజ్రాయెల్ సైన్యం జారవిడిచే కరపత్రాలు సూచించిన విధంగా ఎటు పొమ్మంటే అటు వలసపోతూ అష్టకష్టాలు పడుతున్నారు. తిండీ, నీళ్లూ కరువై, అంతంతమాత్రం వైద్య సదుపాయాలతో జీవచ్ఛవాల్లా బతుకుతున్నారు. ఒక్కోటి 42 రోజులు (ఆరు వారాలు)ఉండే మూడు దశల కాల్పుల విరమణ ఒప్పందం సజావుగా అమలవుతుందా, మధ్యలో తలెత్తగల సమస్యలేమిటి అన్న ప్రశ్నలకు ఎవరి దగ్గరా సమాధానాల్లేవు. హమాస్ చెరలో ఇంకా 94 మంది బందీలు మిగిలారని, వారిలో 34మంది మరణించివుండొచ్చని ఇజ్రాయెల్ అంచనా. తొలి దశ అమల్లోవుండగా గాజా స్ట్రిప్ నుంచి ఇజ్రాయెల్ దళాలు వైదొలగాలి. ఆ తర్వాత పాలస్తీనా ఖైదీల విడుదలకు బదులుగా 33 మంది బందీలను హమాస్ విడుదల చేస్తుంది. ఒకసారంటూ ఒప్పందం అమలు మొదలైతే ఇరువైపులా ఉన్న బందీలను దశలవారీగా విడుదల చేస్తారు. గాజాకు భారీయెత్తున సాయం అందటం ప్రారంభమవుతుంది. ఒప్పందం ప్రకారం తొలి దశ కొనసాగుతున్న దశలోనే ఇజ్రాయెల్ రెండోదశ కోసం హమాస్‌తో చర్చించటం మొదలెట్టాలి. రెండో దశకల్లా బందీలతోపాటు దాడుల సందర్భంగా హమాస్‌కు చిక్కిన ఇజ్రాయెల్ ఆడ, మగ సైనికులు పూర్తిగా విడుదలవుతారన్నది అంచనా. అప్పుడు మొదలుకొని తొలి దశలో వున్న తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం శాశ్వత కాల్పుల విరమణగా మారుతుంది. మూడో దశ అంతా పునర్నిర్మాణంపై కేంద్రీకరిస్తారు. హమాస్ బందీలుగా ఉంటూ మరణించినవారి మృత దేహాలను అప్పగించాలి. కేవలం మొదటి దశకు మాత్రమే ప్రస్తుత ఒప్పందం పరిమితమనీ... కొత్తగా చర్చలు జరిగాకే రెండు, మూడు దశలకు సంబంధించి తుది నిర్ణయం ఉంటుందనీ ఇప్పటికే నెతన్యాహూ ప్రకటించారు. తొలి దశ పూర్తయ్యాక మళ్లీ యుద్ధం తప్పదన్న హామీ ఇవ్వకపోతే తమ ఆరుగురు మంత్రులూ తప్పుకుంటారని తీవ్ర మితవాదపక్ష నాయకుడు, జాతీయ భద్రతా మంత్రి బెన్‌గివర్ హెచ్చరించటం తీసిపారేయదగ్గది కాదు. లెబనాన్‌లోని హిజ్బొల్లాతో ఉన్న రెండు నెలల కాల్పుల విరమణ ఒప్పందం ప్రస్తుతం అంతంతమాత్రంగానే ఉంది. అక్కడ ఇరువైపులా కాల్పులు జరగని రోజంటూ లేదు. ఆ ఒప్పందం కూడా ఈనెల 26తో ముగుస్తుంది. ఇప్పుడు హమాస్‌తో కుదిరిన ఒప్పందం గతి కూడా అలాగే ఉంటుందా అన్నది ప్రశ్నార్థకం. సిరియాలో అసద్ నిష్క్రమణ, ఉక్రెయిన్ యుద్ధంలో రష్యా నిమగ్నమైవుండటం, ఇరాన్ బల హీనపడటం, ట్రంప్ ఆగమనం వంటి పరిణామాలతో హమాస్‌లో పునరాలోచన మొదలయ్యాకే ఈ ఒప్పందానికి అంగీకరించింది. ఎనిమిదినెలల నాడు దాదాపు ఇవే షరతులు ప్రతిపాదిస్తే ఆ సంస్థ తిరస్కరించటం గమనార్హం. మొత్తానికి పశ్చిమాసియా తెరిపిన పడటానికి అన్ని పక్షాలూ చిత్తశుద్ధి ప్రదర్శించటం అవసరం. దాడులతో ఎవరినీ అణిచేయలేమని ఇన్నాళ్ల చేదు అనుభవాల తర్వాతైనా ఇజ్రాయెల్ గుర్తిస్తే మంచిది. ఎన్ని లోటుపాట్లున్నా ఘర్షణలు అంతరించాలి. శాంతి చిగురించాలి.

# హుకుంనామా!



మరెవరిదో కాదు.. పైన తాళ్లలాగే వారిదే! మనకి కనపడే వారంతా "కేతిగాళ్లు.. బంగారక్కలే..!" మరీ ముఖ్యంగా 1990ల తర్వాత ప్రపంచ బ్యాంకు విధానాలు మెల్లిగా పాతుకోవడం మొదలైంది. ఆ తర్వాత దేశమంతా ఈ తోలు బొమ్మలాట క్యారెక్టర్లే తైతక్కలాడుతున్నాయి. వెనక తాళ్లు లాగే ప్రపంచబ్యాంకు సూత్రధారులు అస్సలు కనపడరు. పాలకులను, వారి హావభావాలను, డైలాగులను బట్టి, పార్టీల రంగులను బట్టి చూస్తే తప్ప విధానాల లోతుపాతులు అర్థంకావు. 1990ల్లో అటు బహుళజాతి గుత్త సంస్థలు, ఇటు ఐఎంఎఫ్ ప్రపంచబ్యాంకు వంటి అంతర్జాతీయ మదుపు సంస్థలు అన్ని మూడవ ప్రపంచ దేశాల్లోని విద్యుత్ సంక్షో భాలకు ప్రధాన కారణం, అవసరమైనంత భారీ థర్మల్ కేంద్రాలు లేకపోవడమేననీ, దానికి చాలినంత బొగ్గు, గ్యాసు దిగుమతి చేసుకునైనా సరే అర్జంటుగా థర్మల్ కేంద్రాలు స్థాపించాలన్నాయి. ఇకనేం?! ఎన్రాన్ అలా వచ్చి, మహారాష్ట్ర స్టేట్ ఎలక్ట్రిసిటి బోర్డు (ఎంఎస్‌ఈబీ) ని ఇలా ముంచిపోయింది. పాత కథంతా ఇప్పుడెందుకనుకుంటున్నారేమో?! దేనికైనా గతించిన చరిత్ర తెల్సుకోకపోతే వర్తమానం అర్థంకాదు. భవిష్యత్ డోలాయామానంలో ఉంటుంది. ముఖ్యంగా విద్యుత్‌కు సంబంధించి ప్రస్తుత పాలకుల కార్యాచరణ అర్థం కావాలంటే పాత నేపథ్యం కొంత అర్థమై ఉండాలి. తాజాగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం "గ్రీన్ ఎనర్జీ"అనే పాట పాడింది. ఆశ్చర్యమేమంటే ఇదే పాట అమరావతిలోనూ ప్రతిధ్వనించింది. అక్కడితో ఆగితే ఫరవాలేదు. మోడీ మహాశయుని పుణ్యాన దేశమంతా మారుమోగుతోంది. బహుశా నిన్న పత్రికల్లేవు గాని, ఉండుంటే పతాక శీర్షికలెక్కాల్సిన వార్త "తెలంగాణ ప్రజలకి కరెంటు చార్జీలు పెంచట్లేదనే 'శుభవార్త'ట! వార్త కరెక్టే గాని దీంట్లో శుభం ఎంతో, అశుభం ఎంతో రాష్ట్ర ప్రజలకి తెలియాలి. ఎప్పటికప్పుడు పారదర్శకంగా ప్రజలకి చార్జీల మోత అర్థం కావాల్సిందిపోయి రెగ్యులేటరీ కమిషన్లు ప్రభుత్వాల చేతిలో కీలుబొమ్మలైనాయి. అందుకనే బీఆర్‌ఎస్ సుమారు రూ. 16వేల కోట్లకు పైబడే మొత్తాన్ని ఎప్పటికప్పుడు వాయిదాలు వేసుకుంటూ చివరికి పైసా చెల్లించకుండానే దాటిపోయింది. దాన్ని రేవంత్ ప్రభుత్వం తమ భుజాల మీదేసుకుంది. ఆ మేరకు మంచిదే. చివరికి 2025-26 ఏడాదికి సంబంధించింది కూడా ప్రభుత్వం మీదేసుకుంది. అదేనట శు భవార్త. ఇక్కడ అసలు విషయమేమిటంటే 2000 సం౹ఎలో జరిగిన విద్యుత్ చార్జీల వ్యతిరేక ఉద్యమంతో ఈ పాతికేండ్లలో వచ్చిన ఏ పార్టీ, ఏ ప్రభుత్వమూ విద్యుత్ చార్జీలు పెంచే ధైర్యం చేయలేకపోతోంది. చివరికి విద్యుత్ సంస్థలు వేల కోట్ల రూ.లు 'ట్రూ-అప్' చార్జీలు పేర పేరబెట్టి ఈఆర్సీ ముందుకుపోయినా ప్రభుత్వాలు సాహసించలేకపోతున్నాయి. ఇప్పుడు తాజాగా రాష్టం ప్రకటించిన గ్రీన్ ఎనర్జి పాలసీ (7.6)లో వ్యవసాయ భూముల్లో సోలార్ ప్లాంట్‌లు పెడితే దాన్ని నాలుగెకరాల వరకు వ్యవసాయేతర భూమిగా 'డీమ్డ్ కన్వర్షన్' స్టేటస్ ఇస్తారు. ఒక రకంగా నయా భూస్వాముల తయారీకి ఇది పెద్దమార్గం కానుంది. ప్రభుత్వ పెద్దల వ్యవహారం చూస్తే అరచేతిలో పెట్టి మోచేతి దాకానో, వీళ్లైతే ఇంకా ఆ పైకో నాకించేలా ఉన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 2024-25లో గరిష్ట డిమాండు 15,623 మె.వా. ఉందట. అది మరో పదేండ్లకు 31,809 మె.వా. పెరుగుతుందట. ఎలానో తెలుసా? మెట్రో రైలు విస్తరణ, ఫ్యూచర్ సిటీ, ఎ.ఐ. సిటీ, ఫార్మాసిటీ, రీజినల్ రింగ్ రోడ్, పారిశ్రామిక కారిడార్ తదితర అభివృద్ధి పనుల వల్లనట! సామెతలు చెబితే పెద్దలు నొచ్చుకోవచ్చు. ఆలీ లేదు.. చూలూ లేదు పుట్టబోయే కొడుకు పేరు సోమలింగమట?! మొన్న ఫార్మాసిటీ అంటేనే నానా యాగీ జరిగింది. అబ్బే! అది ఫార్మాసిటీ కాదు, దాని పేరు ఇండిస్ట్రియల్ కారిడార్ అన్నారు. అయితే, గియితే సోమలింగమే పుడితే పందేరం రెడీ చేశారు. ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్‌లట, విండ్ పవర్ ప్లాంట్లట, గ్రీన్ హైడ్రోజనట, హైబ్రిడ్ ప్రాజెక్టులట! పంచరంగుల చిత్రాలు 70 ఎమ్.ఎమ్.లో చూపుతున్నారు. ముందస్తు ప్రణాళికలు మంచివే! కానీ అవి ఎవరి ప్రయోజనాలను కాస్తున్నాయో జనానికి అర్థం కావాలిగా?!!

# ఇంతన్నాడంతన్నాడే ట్రంప్!



'అధికారానికి వచ్చిన 24గంటల్లోనే ఉక్రెయిన్ సమస్యను పరిష్కరిస్తా'నన్నాడు డోనాల్డ్ ట్రంప్, కావాలంటే దానికంటే ముందే కూడా చేస్తానని కూడా సెలవిచ్చాడు. ఒక్కరోజులో కాదులే గానీ కనీసం వందరోజులు పడుతుందన్నాడు ఉక్రెయిన్ రాయబారిగా ట్రంప్ ఎంచుకున్న కెయిత్ కెలోగ్. వంద రోజులా? చెప్పటానికి బాగానే ఉంటుంది గానీ, అంత తేలిగ్గా ఎలా కుదురుతుంది? కొన్ని నెలలు, అంతకంటే ఎక్కువ కాలమే పట్టవచ్చునని ట్రంప్ సలహాదారులు చెప్పినట్లు రాయిటర్స్ తాజా కథనం.ఈ తీరు చూసినపుడు 'ఇంతన్నాడంతన్నాడే గంగరాజు నన్నొగ్గేసెల్పోనాడే గంగరాజు' అన్నట్టుగా ఉక్రెయిన్ పరిస్థితి తయారైనట్లు కనిపిస్తోంది. ఎన్నికలకు ముందు ఎన్నో కబుర్లు వల్లించిన పెద్దమనిషి నోట ఫలితాలు వెలువడిన మరుసటి రోజు నుంచే మాటలో తేడా వచ్చింది. అప్పు రేపు అని గోడమీద రాసినట్లుగా " పరిష్కరిస్తా" అని మాత్రమే మాట్లాడుతున్నాడు. గాజాలో దాడులకు స్వస్తి పలకటం కంటే ఉక్రెయిన్ పోరు ముగించటం కష్టంగా కనిపిస్తోందని ఒక సందర్భంగా చెప్పాడు. ఎప్పటికెయ్యది అప్పటికా మాటలాడి తప్పించుకు తిరుగువాడు ట్రంప్.పైకి ఎన్ని బింకాలను ప్రదర్శించినా ఏదో విధంగా రాజీచేసి పరువు దక్కించమని పశ్చిమ దేశాలను జెలెన్‌స్కీ వేడుకుంటున్నాడన్నది స్పష్టం. ఉక్రెయిన్ మీద రష్యా ప్రారంభించిన సైనిక చర్య గురువారం నాడు 1,057వ రోజులోకి ప్రవేశించింది. ఐ

బుధవారం నాడు రష్యా ప్రయోగించిన 40 క్షిపణులు, 70డ్రోన్ దాడులతో ఉక్రెయిన్ గ్యాస్ మౌలిక సదుపాయాలతో సహా విద్యుత్ సర ఫరా వ్యవస్థ చిన్నాభిన్నమైందని వార్తలు. అయితే ముందు జాగ్రత్త చర్యగా తామే అనేక ప్రాంతాల్లో కోతలు విధించినట్లు జెలెన్‌స్కీ యంత్రాంగం చెప్పుకుంది. తమ భద్రతకు పనామా కాలువను, గ్రీన్‌లాండ్ ప్రాంతాన్ని అప్పగించాలని, కెనడాను విలీనం చేయాలని డోనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనను రష్యా తనకు అనువుగా మలుచుకొంటోంది. రాజీ కుదిరితే స్వాధీనం చేసుకున్న ఉక్రెయిన్ ప్రాంతాలను అప్పగిస్తారా? అన్న ప్రశ్నకు అసలు దాని గురించి చర్చలకు కూడా ఆస్కారం లేదని పుతిన్ సహాయకుడు నికోలారు పత్రుషెవ్ కుండబద్దలు కొట్టినట్లు చెప్పాడు. ట్రంప్ కొన్ని ప్రాంతాలు కావాలని కోరుకుంటున్నట్లే తమకూ ఉక్రెయిన్లో కొంత ప్రాంతం అవసరమే కదా అన్నట్లుగా పోలిక తెచ్చాడు. తమ దేశ భద్రతకు హామీగా నాటోలో ఉక్రెయిన్‌ను చేర్చుకో కూడదన్న వినతిని పెడచెవిన పెట్టిన తరువాతే రష్యా 2022 ఫిబ్రవరి 24 నుంచి మిలిటరీ చర్య జరుపుతున్నది. ట్రంప్ ప్రకటన తరువాత దానికి మరింత బలం చేకూరుతున్నది. అమెరికా తన అవసరాలకు అనుగుణంగా ప్రపంచ పటాన్ని తిరిగి గీస్తున్నది, అందులో భాగంగానే అనేక దేశాల వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటున్నదని పత్రుషెవ్ చెప్పాడు.ఉక్రెయిన్, ఐరోపా యూనియన్‌తో నిమిత్తం లేకుండా ముందుగా అమెరికా-రష్యాలు ఒక ఒప్పందానికి రావాలని అన్నాడు.చర్చలకు ప్రత్యేక పరిస్థితులేమీ అవసరం లేదని పుతిన్ ప్రతినిధి పెష్కోవ్ చెప్పాడు.దీని అర్థం సైనిక చర్యను తాత్కాలికంగా కూడా నిలిపివేసేది లేదని చెప్పటమే. డోనాల్డ్ ట్రంప్ ఒక రాజకీయవేత్తగా ఓట్ల కోసం లేదా స్వభావసిద్ధంగానే వదరుబోతు కావచ్చు,కానీ అమెరికా పాలకవర్గ ప్రయోజనాలకు అనుగుణంగానే అంతిమంగా వ్యవహరిస్తాడు. 'నువ్వొకందుకు పోస్తే నేనొకందుకు తాగా' అన్నట్లుగా పుతిన్ ఉన్నాడు. ట్రంప్‌తో చర్చలకు తాము సముఖమే గానీ ఆయన సలహాదారులు ముందుకు తెచ్చిన ప్రతిపాదనలు కొన్ని కుదిరేవి కాదని రష్యా చెబుతున్నది. సంక్షోభ ముగింపు కొన్ని నెలలు పట్టవచ్చన్న సలహాదారుల వ్యాఖ్యలపై మాస్కో మౌనం పాటించింది. యుద్ధం కొనసాగిన కొద్దీ ప్రజల సొమ్ము ఖర్చు చేయాల్సి వస్తోందనే మనో భావాలను ట్రంప్ రెచ్చగొట్టవచ్చు, దాని వలలో కొందరు పడవచ్చు గానీ సంక్షోభం ఎంత దీర్ఘకాలం కొనసాగితే అమెరికా ఆయుధ పరిశ్రమలకు లాభాలు, కొంత మందికి ఉపాధి, రష్యా ఇంధన మార్కెట్‌ను అమెరికా కంపెనీలు ఆక్రమించి లాభాలు పిండుకుంటాయి. అందుకనే ఏదో ఒకసాకు చూపి ట్రంప్ కూడా జో బైడెన్ బూట్లలో కాళ్లు దూర్చి నడిచేందుకే చూస్తాడు. ఐరోపాలోని అగ్రరాజ్యాలకు రష్యా బలహీనం కావటం అవసరం. అందుకే ఈ సంక్షోభం ఇప్పట్లో ముగిసేది కాదని భావిస్తున్నారు.నాటో కూటమి దేశాల ఉద్దేశ్యాలను గ్రహించి కావచ్చు, తొలి రోజుల మాదిరి రష్యా ఇప్పుడు దూకుడుగా ముందుకు పోవటం లేదు, నిదానంగా అడుగులు వేస్తున్నది. అమెరికా, ఇతర పశ్చిమ దేశాల చెలగాటం మనవంటి తృతీయ ప్రపంచ సమాజాలకు ప్రాణసంకటంగా మారుతోంది.

EDITOR, PRINTER, PUBLISHER AND OWNED BY SIRASALA SURESH KUMAR, Printed at M/S MARPU PUBLICATION,# /639-1-7-15, NANDYAL ROAD, CPI COLONY, 4TH ROAD, TADIPATRI-515 411, Ananthapuramu Dist., (A.P.), PUBLISHED AT # 1/639-1-7-15, NANDYAL ROAD,CPI COLONY, 4TH ROAD,TADIPATRI-515 411,Ananthapuramu Dist.,(A.P.). Cell:9398156948,REG.RNI: APTEL/2023/86845, E-Mail:janamnews19@gmail.com